ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 21.08.2026 | సంపుటి :13 సంచిక : 32 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv JANAMSAKSHI

## డబులింజన్ సర్కారులో

# కొత్త చోద్యం

భారత రాజ్యాంగం భాషా వైవిధ్యాన్ని గౌరవించే నేపథ్యంలో.. స్థానిక భాషను ప్రోత్సహించడం ఒక అంశమైతే, ఆ భాష రాదనే కారణంతో ఓ కార్మికుడి పొట్ట కొట్టడం మరో అంశం. ప్రభుత్వాలు ఉపాధి కల్పించాల్సింది పోయి భాషా పరీక్షల పేరుతో ఉపాధి కోల్పోయే పరిస్థితులు సృష్టించకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## మహారాష్ట్రలో ఆటో వాలాకు కొత్త తిప్పలు

- జాతీయ భాష హిందీ జాంతానై.. మరాఠీ రాకపోతే డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్!
- వలస కార్మికుల పొట్ట కొడుతున్న కొత్త నిబంధనలు







**ముంబై (జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి):** డబుల్ ఇంజన్ సర్కారులో మరో కొత్త చోద్యం తెరపైకి వచ్చింది. మహారాష్ట్రలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు మరాఠీ భాషపై ప్రాథమిక పని పరిజ్ఞానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తోంది. మరాఠీ భాషా పరీక్షలో విఫలమైన డ్రైవర్లకు ముందుగా నెల రోజుల గడువు ఇచ్చి, ఆ తర్వాత కూడా నిబంధన పాటించకపోతే డ్రైవింగ్ అధికారం లేదా డ్రైవర్ బ్యాడ్జ్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉంది. పునరావృత ఉల్లంఘనలకు లైసెన్స్ లేదా బ్యాడ్జ్ రద్దు చేసే నిబంధనలూ ఉన్నాయి.

### 7,750 మంది ఫెయిల్

ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటివరకు 1,40,423 మంది ఆటో డ్రైవర్లు మరాఠీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. 7,750 మంది పరీక్షలో విఫలమయ్యారు. మరో 17,427 మంది శిక్షణ పూర్తి చేయాల్సి ఉంది. అంటే వేలాది మంది డ్రైవర్లు ఇంకా ఈ నిబంధన పరిధిలోనే ఉన్నారు. అయితే ఇప్పటివరకు ఎంతమంది డ్రైవర్ల లైసెన్సులు లేదా బ్యాడ్జ్‌లు వాస్తవంగా సస్పెండ్ చేశారన్న అధికారిక సంఖ్య మాత్రం అందుబాటులో లేదు. 18 నుంచి ఆర్టీఓ అధికారులు తనిఖీలు చేపట్టి, మరాఠీ పరిజ్ఞానం లేని డ్రైవర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసి నెలరోజుల గడువు ఇస్తున్నారు.

### వలస కార్మికులపై ప్రభావం

మహారాష్ట్రలో జీవనోపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆటో, ట్యాక్సీలు నడుపుకుంటున్న వేలాది మంది వలస కార్మికులపై ఈ నిబంధన ప్రభావం చూపే అవకాశం ఉంది. భాష నేర్చుకోవడానికి అవకాశం ఇవ్వడం ఒక ఎత్తయితే.. భాషా పరిజ్ఞానం లేదనే కారణంతో జీవనోపాధిని కోల్పోయే పరిస్థితి తీసుకురావడం మరో ఎత్తు. దీంతో డ్రైవర్లలో ఆందోళన నెలకొంది. పుణెలోనే 4,000–5,000 మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు మరాఠీ అసలు తెలియదని ఆర్టీఓ అధికారి వెల్లడించారు. ప్రయాణికులతో స్థానిక భాషలో కనీస సంభాషణ అవసరమనే ప్రభుత్వ వాదన ఉన్నప్పటికీ, భాషను ఉపాధికి అడ్డంకిగా మార్చడం ఎంతవరకు సమంజసం? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికుల జీవనోపాధిపై ప్రభావం పడేలా నిబంధనలు కఠినతరం చేయడం విమర్శలకు దారితీస్తోంది.




## సీఎం రేవంత్ సాబ్..
# జరా సోంచో!

- జర్నలిస్టుల రక్షణకు తెలంగాణలోనూ ప్రత్యేక చట్టం కావాలి
- మహారాష్ట్ర తరహాలో చట్టం తీసుకురావాలి
- మీడియాపై దాడులకు అడ్డుకట్ట వేయాలి



**హైదరాబాద్(జనంసాక్షి):** జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, విధులకు ఆటంకాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణలోనూ జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మహారాష్ట్రలో జర్నలిస్టులు, మీడియా సంస్థల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమల్లో ఉంది. విధుల్లో ఉన్న జర్నలిస్టుపై దాడి,

మిగతా 2లో..

## కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదట!

కొండా సురేఖ సరికొత్త భాష్యం 2లో..

## కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : మహేశ్ కుమార్ గౌడ్

## విద్యార్థి పీక పట్టిన సీఐ సస్పెండ్

ఘటనపై డీఎస్పీ స్థాయి విచారణకు ఆదేశం ఎస్పీ కీలక చర్య.. 12లో..

## ఈ ప్రభుత్వంలో
# మీ పప్పులుడకవు

- 22ఏ భూతంగా చూపెట్టి అమాయక ప్రజలను రెచ్చగొడుతున్నారు
- దీని మాటున అక్రమ ఆస్తులను రిలీజ్ చేసుకోవాలని కలలు కంటున్నారు
- భూ భారతి మా ప్రభుత్వానికి రెఫరండం : మంత్రి పొంగులేటి



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం మా కాంగ్రెస్ ప్రభుత్వానికి రెఫరండం' అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు తాము చిత్తశుద్ధి, నిజాయితీతో పని చేస్తున్నామన్నారు. గురువారం సత్తుపల్లి మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై నిర్వహించిన రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన

మిగతా 2లో..

## అమ్మా.. నీ కన్నీళ్లు నాకు, ప్రియాంకకే
# తెలుసు

- రాహుల్ గాంధీ భావోద్వేగం
- సోనియా ఆత్మకథ సందర్భంగా పోస్ట్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రయాణంపై 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట రాసిన 544 పేజీల ఆత్మకథ నవంబరు 10న పాఠకుల ముందుకు రానుంది. తన మాతృమూర్తి జీవిత కథ పుస్తక రూపంలో రానున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. "అమ్మా.. నిన్ను నాన్ననూ కలిసి చివరిసారి చూసి 35 ఏళ్లకు పైగా దాటింది. నాన్న వెళ్లిపోయినప్పటి నుంచి ప్రతి సవాల్‌ను నువ్వు ఎంతో ధైర్యం, గౌరవంతో ఎదుర్కొన్నావు. నువ్వు ఎదుర్కొన్న కష్టాలు ఏంటో ప్రియాంకకు, నాకు మాత్రమే తెలుసు" అని రాహుల్ ఎక్స్‌లో భావోద్వేగపూరితంగా రాసుకొచ్చారు. తన తల్లి ఆత్మకథను లక్షల మంది చదవబోతున్నందుకు గర్వంగా ఉందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ బహిరంగంగా చెప్పేందుకు ఇష్టపడని ఆమెకు.. ఈ కథను ప్రపంచంతో

మిగతా 2లో..




## దక్షిణాది అభివృద్ధికి సహకరించండి

సదరన్ జోనల్ కౌన్సిల్ భేటీలో ముఖ్యమంత్రుల డిమాండ్

వార్త 2 లో

## పేదోళ్లకూ సన్న బియ్యం..
# కాంగ్రెస్ ఘనతే..

అర్హులైన ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వార్త 2 లో

## ఆర్డీవో అక్రమాస్తులు రూ.100కోట్ల పైమాటే!

ఏసీబీ వలలో మరో అవినీతి తిమింగలం

15 బృందాలతో సోదాలు

2లో..

## 22ఏ బాధితులకు బీఆర్ఎస్ న్యాయసహాయం

హరీశ్‌రావు

2లో..

## బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రూల్

దశదినకర్మ



కీ॥శే॥ రాగం సుజాత యాదవ్ గారు
(10/10/1974 - 13/08/2026)

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సేవకు అంకితమైన
మా ఆత్మీయురాలు కీ.శే. రాగం సుజాత యాదవ్ గారి దశదినకర్మ

తేదీ: 21-08-2026, శుక్రవారం
సమయం: ఉదయం 11:00 గంటల నుండి
స్థలం: స్వగృహం, విల్లా నెం. 224, వర్టెక్స్ కింగ్స్టన్ పార్క్ విల్లాస్,
నల్లగండ్ల, శేరిలింగంపల్లి, హైదరాబాద్.

Location

"మీరు భౌతికంగా దూరమైనా... మీ జ్ఞాపకాలు మా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి."
కావున అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు,
సామాజిక సంఘాల ప్రతినిధులు విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి నివాళులర్పించి,
మధ్యాహ్న భోజనం స్వీకరించి వెళ్ళగలరని కోరుచున్నాము.
"మీరు దూరమైనా.. మీ జ్ఞాపకాలు మా హృదయాల్లో నిలిచిపోతాయి."

శోకతప్త హృదయాలతో...
రాగం నాగేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్, శేరిలింగంపల్లి
కుమారులు: రాగం అనిరుధ్ యాదవ్ - రాగం జాగృతి సాయి యాదవ్,
రాగం అభిషేక్ యాదవ్, మరియు కుటుంబ సభ్యులు.

## అమ్మా.. నీ కన్నీళ్లు నాకు, ప్రియాంకకే తెలుసు

పంచుకోవడం ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా "పాపా తన అందమైన సోనియాను చూసి గర్వంగా నవ్వుతూ ఉండొచ్చు" అని రాహుల్ పేర్కొన్నారు.సోనియా తన జీవిత ప్రయాణంపై రాసిన ఆత్మకథను నాఫ్ ప్రచురణ సంస్థ నవంబరు 10న హార్డ్‌కవర్, ఈ-బుక్ రూపంలో విడుదల చేయనుంది. దీని ఆడియో ఎడిషన్‌ను పెంగ్విన్ రాండమ్ హౌస్ అందుబాటులోకి తీసుకురానుంది. తొలి ముద్రణలో లక్ష కాపీలను ముద్రించనున్నట్లు ప్రచురణకర్త తెలిపారు. మరోవైపు తన జీవితంలో జరిగిన కీలక ఘట్టాలు, విషయాలను పుస్తకంలో పంచుకున్నట్లు సోనియా తెలిపారు. ఇందులో రాజీవ్ గాంధీతో ప్రేమ, పెళ్లి వంటి విషయాలను పేర్కొన్నట్లు వెల్లడించారు. రాజకీయాల్లోకి రావడం, అందుకు దారితీసిన పరిస్థితులను పంచుకున్నట్లు ఆమె వివరించారు. తన కుటుంబం గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిపారు. ఇంకా ఎన్నో అంశాలను ఆమె అందులో పంచుకున్నారు. 'నా జీవితాన్ని రాయడం అంత సులభంగా అనిపించలేదు. లోపలే దాచుకున్న అనుభవాలను బయటపెట్టాల్సి వచ్చింది" అని సోనియా తెలిపారు.

## కూతురి వ్యాఖ్యలపై తనకు సంబంధం లేదట!

హైదరాబాద్(జనంసాక్షి): టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డీఏసీ వివరణ కోరిన విషయం తెలిసిందే. దీంతో కొండా సురేఖ స్పందిస్తూ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. "నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలు. సుస్మిత వ్యాఖ్యల వ్యవహారంలో నా ప్రమేయం లేదని గుర్తించాలి. సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. నాకు సంబంధం లేని అంశంలో నా వివరణ కోరడం సముచితం కాదు. కాంగ్రెస్ నాయకత్వం, పార్టీ నియమావళిపై నాకు గౌరవముంది. షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి"అని కొండా సురేఖ పేర్కొన్నారు.

## కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నిజామాబాద్(జనంసాక్షి): పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారెడ్డి, కొండా సుస్మిత వ్యాఖ్యలపై స్పందించారు. "కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నా. మంత్రి కొండా సురేఖ ఎన్నోఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. కుమార్తె వ్యాఖ్యలపై ఆమె వివరణ కోరాం. నిన్ననే షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చాక ఏం చేయాలో ఆలోచిస్తాం. పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడాం. పోచారం ఆవేదనను అర్థం చేసుకున్నాం. ఎవరికి టికెట్ ఇవ్వాలో ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుంది. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. 22ఏపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పిదాలను సరిదిద్దాలని సీఎం అధికారులను ఆదేశించారు" అని మహేశ్‌గౌడ్ తెలిపారు.

మంత్రి కొండా సురేఖ ఓఎస్డీపై కేసు నమోదు

తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైంది. సుమంత్ తనను బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని ఓ వ్యాపారి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వనందుకు తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మొదట మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు.

## ఆర్డీవో ఆక్రమాస్తులు రూ.100కోట్ల పైమాటే!

హైదరాబాద్(జనంసాక్షి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించారు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కిలోకు పైగా బంగారం, 8 ఖాళీ స్థలాలు, యాచారంలో 10 ఎకరాల భూమి, హస్తినాపురంలో మూడంతస్తుల భవనం, ఓ బార్‌లో కుమారుడి పేరిట రూ.86 లక్షల పెట్టుబడి, 7 బ్యాంకు ఖాతాల్లో రూ.8 లక్షలు, ఇంట్లో రూ.4 లక్షలు, 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లపైగానే ఉంటుందని ఏసీబీ అధికారుల అంచనా వేస్తున్నారు. గతంలో శ్రీనివాస్‌రెడ్డి మహేశ్వరం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.

### 22ఏ బాధితులకు బీఆర్ఎస్ న్యాయసహాయం:హరీశ్

హైదరాబాద్,ఆగస్ట్20(జనంసాక్షి): తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూ.సే) డిపార్ట్‌మెంట్,**
**కలెక్టరేట్, మహబూబ్‌నగర్**

**FORM - VII**

**డిక్లరేషన్**

(నియమం-25 యొక్క ఉప-నియమం (1)
మరియు 2013 నాటి చట్టం-30 యొక్క సెక్షన్ 19 (1) చూడండి)

నెం. Rev-G1/LAG/0010/2026-G-Section తేదీ: 03-08-2026

మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, మిడ్జిల్ గ్రామంలోని 'మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం' (MGKLIS) కింద 'డిస్ట్రిబ్యూటరీ - 48 MR1 కాలువ' తవ్వకం అనే ప్రజా ప్రయోజనం కోసం మొత్తం 1 ఎకరం 10 గుంటల భూమి అవసరమని తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్‌కు తోచింది.

కావున, పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, మిడ్జిల్ గ్రామంలో సుమారు 1 ఎకరం 10 గుంటల భూమిని (దీని వివరాలు కింద ఇవ్వబడ్డాయి) సేకరిస్తున్నట్లు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

గ్రామం : మిడ్జిల్ మండలం : మిడ్జిల్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | మెట్ట / ఐ.డి తడి | భూమి రకం | సేకరణకు ప్రతిపాదించిన ప్రాంతం (ఎకరాలలో) ఎక.గుం.లు | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 421 | మెట్ట | పట్టా | 0.04 | చౌట్ల పెద్ద జంగయ్య S/o బాల నాగయ్య | - | - | - | - | - | |
| 2 | 422 | మెట్ట | పట్టా | 0.22 1/2 | 1) బీర్ల అంజమ్మ W/o జంగయ్య 2) చౌట్ల పెద్ద జంగయ్య S/o బాల నాగయ్య | - | - | - | - | - | - |
| 3 | 406 | మెట్ట | పట్టా | 0.01 | నల్లవోలు సుమన్ రెడ్డి S/o శ్రీనివాస్ రెడ్డి | - | - | - | - | - | - |
| 4 | 411 | మెట్ట | పట్టా | 0.20 1/2 | నల్లవోలు సుమన్ రెడ్డి S/o శ్రీనివాస్ రెడ్డి | - | - | - | - | - | - |
| 5 | 410 | మెట్ట | పట్టా | 0.01 | నల్లవోలు సాత్విక్ రెడ్డి S/o జగన్ మోహన రెడ్డి | - | - | - | - | - | - |
| 6 | 412 | మెట్ట | పట్టా | 0.01 | నల్లవోలు సుమన్ రెడ్డి S/o శ్రీనివాస్ రెడ్డి | - | - | - | - | - | - |
| | మొత్తము : | | | 1.10 | | | | | | | |

2013 నాటి చట్టం నం. 30లోని సెక్షన్ 15 ప్రకారం, సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ జరిపిన తర్వాత ఈ ప్రకటన చేయడమైనది. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలనూ పునరావాసం కల్పించాల్సిన అవసరం లేదు.

అయితే, భూసేకరణకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ నిర్మాణ దశలో తవ్వాల్సిన, తొలగించాల్సిన లేదా ఉపయోగించాల్సిన అవసరం ఉన్న గనులు మరియు ఖనిజాల భాగాలను మినహాయించి, సదరు భూమి లేదా దానిలోని ఏదైనా నిర్దిష్ట భాగం కింద ఉన్న బొగ్గు, ఇనుప ఖనిజం (ఇనుప రాయి), స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు దీని పరిధిలోకి రావు.

భూమికి సంబంధించిన ప్రణాళికను (ప్లాన్‌ను) మహబూబ్‌నగర్‌లోని 'స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA R&R), యూనిట్-II, సాగునీటి ప్రాజెక్ట్' కార్యాలయంలో ఏదైనా పని దినం నాడు పరిశీలించవచ్చు.

సం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA R&R, యూనిట్ -II, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్ | సం/ అడిషనల్ కలెక్టర్, (Rev) మహబూబ్‌నగర్ | సం/ ఖుష్బూ గుప్తా, డిస్ట్రిక్ట్ కలెక్టర్, మహబూబ్‌నగర్

DIPR.Ro.No.722/LA-PP/ADVT/PUB/2026-27


# ఈ ప్రభుత్వంలో మీ పప్పులుడకవు

సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పాల్గొని పలు కీలక వ్యాఖ్యలు చేశారు.భూ రీ సర్వే ప్రక్రియ, భూ హక్కుల నమోదుపై తమకు ఉన్న సందేహాలు, సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ... భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో గత 25 రోజులుగా సుమారు 6 వేల ఎకరాల భూ రీ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉందని, మొత్తం భూమికి రీ సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. మిగిలిన మరో 6 వేల ఎకరాల భూమికి కూడా రీ సర్వే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రీ సర్వే ప్రక్రియ కారణంగా ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు లేదా లోపాలు కనిపిస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు మంత్రి సూచించారు. ఏదైనా తప్పు జరిగినా ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పొలాలకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దని, వాటిని రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పొలాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను పరిరక్షించాలని సూచించారు.చెరువులను తప్పనిసరిగా పరిరక్షించాలని, వాటికి అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు, కాంపౌండ్ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులను కూడా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. చెరువులను పరిరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.

భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉండగా, సుమారు 2,026 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయని, వాటిల్లో సుమారు 980 ఎకరాలను పేదలకు అందించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. ఇంకా సుమారు వెయ్యి ఎకరాల అసైన్డ్ భూముల్లో కొంతమంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు లేవని వివరించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు ఎక్కడా కోల్పోవని, అర్హులైన రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా నిచ్చారు. రైతులకు భూమిపై హక్కులు కల్పించే ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిజంగా భూమిపై ఉన్న రైతులకు హక్కులు దక్కలేదన్నారు. భూములు లేని కొంతమందికి కూడా రైతుబంధు ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 వరకు నకిలీగా గుర్తించిన పట్టాదారు పాస్ బుక్‌లు బయటపడ్డాయని వెల్లడించారు. భూమి రైతులకు అత్యంత భావోద్వేగంతో కూడుకున్న అంశమని, ఇది రాజకీయ అంశం కాదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం తమ ప్రజా ప్రభుత్వపు బాధ్యత అని అన్నారు.బేతుపల్లి గ్రామం తనకు కొత్త కాదని, ప్రత్యేక అనుబంధం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కూడా గ్రామంలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి, భూ హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రైతులు తుది టైటిల్స్ కోసం ఎదురుచూస్తున్నారని, రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేసి పూర్తి హక్కులు అందజేస్తామని తెలిపారు.ప్రజలకు, రైతులకు తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిజాయితీ ఏమిటో తెలుసని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం ధరణికి సంబంధించి నిబంధనలను పూర్తిస్థాయిలో రూపొందించకుండా అస్తవ్యస్తంగా మార్చిందని మంత్రి విమర్శించారు. భూభారతి చట్టానికి మాత్రం కేవలం మూడు నెలల్లోనే నిబంధనలు రూపొందించామని వెల్లడించారు. తాము తీసుకొచ్చిన చట్టం రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నానని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు త్వరలోనే వారికి మరోసారి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్థానిక నాయకులడు మట్ట దయానంద్ మాట్లాడుతూ... ధరణి కారణంగా అనేక మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సత్తుపల్లి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ధరణి సమయంలో భూములు లేని కొంత మంది నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు పొందినట్లు గుర్తించామని, అర్హత లేని పాస్‌బుక్‌లను రద్దు చేసి వాటి ఆధారంగా పొందిన రైతుబంధు మొత్తాలను రికవరీ చేయాలని దయానంద్ కోరారు. భూ రీ సర్వేలో రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.

## ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు: ఇరాన్



టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారీగా అప్పులు, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి స్వీయ సంక్షోభాల నుంచి దృష్టి మళ్లించే చర్యగా దీనిని పేర్కొంది. విఫలమైన విధానాలను కొనసాగించడం వల్ల ముమ్ముందు కూడా ఓటమిని, ఇరాన్ ప్రజల శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప ఏమీ సాధించలేరని తెలిపింది.అమెరికా 'ఆర్థిక ఉగ్రవాదం'.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అమెరికా అప్పులు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయనే సూచించే మీడియా నివేదికలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని అధ్యక్షుడు ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ.. ఆయన అనుసరించిన అనేక విధానాలు రుణ భారాన్ని మరింత పెంచాయని అవి పేర్కొన్నాయి. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి మిత్రదేశాలన్నీ తమతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ పెట్టారు.

## సీఎం రేవంత్ సాబ్.. జరా సోంచో!

బెదిరింపు, మీడియా సంస్థల ఆస్తులకు నష్టం వంటి చర్యలకు ఈ చట్టం కింద కఠిన నిబంధనలు ఉన్నాయి. అదే తరహాలో తెలంగాణలోనూ జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని మీడియా వర్గాలు కోరుతున్నాయి. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులపై దాడి చేసినా, విధులకు ఆటంకం కలిగించినా, బెదిరించినా ప్రత్యేక నేరంగా పరిగణించి వేగంగా చర్యలు తీసుకునేలా చట్టం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

**జర్నలిస్టు భద్రత.. ప్రజాస్వామ్యానికి రక్షణ**

జర్నలిస్టుపై దాడి అంటే కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు.. ప్రజలకు వాస్తవాలను చేరవేసే వ్యవస్థపై దాడి. మీడియా స్వేచ్ఛను కాపాడాలంటే జర్నలిస్టులకు భద్రత కల్పించడం అత్యవసరం. మహారాష్ట్ర తరహాలో తెలంగాణలోనూ ప్రత్యేక జర్నలిస్టు రక్షణ చట్టం తీసుకువచ్చి.. జర్నలిస్టుల భద్రతకు బలమైన భరోసా ఇవ్వాలి.

## ఢిల్లీలో పోలీసు చర్యపై ఉన్నతస్థాయి కమిటీ నియామకం

ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సమయంలో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులపై వారు దాష్టీకం చేశారన్న ఆరోపణలపై విచారణకు సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణకు చెందిన జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి నేతృత్వం వహించనున్నారు. పంజాబ్- హరియాణా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్.ఆర్.బిష్ణోయ్‌లు ఇతర సభ్యులుగా ఉన్నారు.విద్యార్థి ఉద్యమకారులపై పోలీసులు వ్యవహరించిన తీరు, మహిళలపై హింస, బాధితులకు వైద్య సహాయం, నష్టపరిహారం అందించడం వంటివి ఈ కమిటీ పరిశీలించనుంది. పోలీసు సిబ్బందిపై హింస, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం వంటి అధికారులు లేవనెత్తిన ఆరోపణలను కూడా పరిగణనలోకి తీసుకోనుంది. "బాధ్యులెవరినీ వదిలి పెట్టం. విషయాన్ని తీవ్రంగా పరిగణించి కొలిక్కి తీసుకొస్తాం. అందుకే ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తున్నాం. జులై 20న చలో పార్లమెంటు సమయంలో చోటుచేసుకున్న హింసకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాల రికార్డులను కమిటీకి అప్పగించాలని ఆదేశిస్తాం" అని ఇటీవల సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.



## బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రూల్

ఢాకా(జనంసాక్షి):బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రూల్ ఇస్లాం అలంగీర్ (78) ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (ఃఔఖ) సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన ఆయనకు 255 మంది పార్లమెంటు సభ్యుల మద్దతు లభించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆగస్టు 21న నూతన అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే, 35 ఏళ్ల అనంతరం దేశ అధ్యక్ష ఎన్నికలు జరగడం గమనార్హం.అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా మొత్తం 349 మంది చట్టసభ సభ్యులు రిజిస్టర్ చేసుకోగా.. 343 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆరుగురు మాత్రం పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఛైర్మన్, విపక్ష కూటమి అభ్యర్థి రిటైర్డ్ కర్నల్ ఓలి అహ్మద్‌కు 88 ఓట్లు వచ్చాయి.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మొహమ్మద్ షాబుద్దీన్.. అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల పదవీకాలం పూర్తి కాకముందే బాధ్యతల నుంచి వైదొలిన ఆయన.. ఆరోగ్య సమస్యలను కారణంగా చెప్పారు.

## ఝార్ఖండ్‌లో పరీక్షల రద్దుపై హైకోర్టు స్టే

**అవకతవకల కేసులో కీలక మలుపు**

**రాంచీ(జనంసాక్షి):**పలు నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయనే కారణంతో ఝార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన ఝార్ఖండ్ హైకోర్టు.. ఆ రద్దు ఉత్తర్వుల అమలుపై గురువారం స్టే విధించింది.పలు పరీక్షల్లో ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించిన నలుగురు విద్యార్థులు ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. తమ వాదన వినకుండా.. పరీక్షలు, నియామకాలను ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని వారు వాదించారు. పలువురు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరారని, తాజా నిర్ణయంతో తమ ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. ఇలా అందరినీ ఒకేసారి తొలగించడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాము నిజాయితీగా పరీక్షలు రాసి మెరిట్ జాబితాలో స్థానం పొందామని తెలిపారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. దీనిపై 15 రోజుల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.




# పేదోళ్లకూ సన్న బియ్యం.. కాంగ్రెస్ ఘనతే..

సూర్యాపేట (జనంసాక్షి):రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.గురువారం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బంది పడ్డారని మండిపడ్డారు.తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పౌరసరఫరాల శాఖను ప్రజల చెంతకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని దాదాపు 80 నుండి 90 శాతం మంది ప్రజలు తినలేకపోయేవారని గుర్తు చేశారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు.దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల 42 లక్షల మంది పేదలు లబ్ధి పొందుతున్నారని వివరించారు.16 లక్షల కొత్త కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చామని, గత పదేళ్లలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేశారని విమర్శించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చిందని, తద్వారా లబ్ధిదారుల సంఖ్యను పెంచామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.రాబోయే 15 రోజుల్లో సూర్యాపేట జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికీ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ రెండున్నరేళ్ల పాలన కాలంలో రైతుల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ఎలాంటి ఆలస్యం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 90 వేల కోట్లను జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. 1999 నుంచి ఒకే ప్రాంతం, ఒకే పార్టీ నుంచి తనను వరుసగా 6 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా మొత్తం 7 సార్లు గెలిపించి గుండెల్లో పెట్టుకున్న జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.తనతో పాటు తన సతీమణి పద్మావతి ఎల్లప్పుడూ జిల్లా ప్రజల సేవలో అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు.అనంతరం సర్వీస్ లో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, పెరిక కార్పొరేషన్ ఛైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిసిఓ మోహన్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్ రావు,అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణాది అభివృద్ధికి సహకరించండి

మహాబలిపురం, ఆగస్టు 20 (జనంసాక్షి):హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ( సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నారు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధిపై మాట్లాడారని ప్రశంసించారు

## ఇరాన్ మిత్రదేశాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్(జనంసాక్షి):**

ఇరాన్‌పై సైనిక దాడులు కొనసాగిస్తోన్న అమెరికా.. ఇప్పుడు ఆ దేశ ఆర్థిక జీవనాధారంపై దెబ్బకొట్టేందుకు సిద్ధమైంది. టెహ్రాన్‌ను ఏకాకిని చేయడమే లక్ష్యంగా మరో కొత్త ఎత్తుగడతో రంగంలోకి దిగింది. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్వయంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. మరి ఈ బెదిరింపుల ప్రభావం భారత్‌పై ఏ మేర ఉంటుంది..? ఇరాన్‌తో మన వాణిజ్యం ఎలా ఉంది..?ఏ దేశంపైనా ఇప్పటివరకు చేపట్టని అత్యంత తీవ్రమైన ఆర్థిక చర్యను తాను ఈ రోజు ఇరాన్‌పై ప్రకటిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "ఒప్పందం విషయంలో ఇరాన్‌కు నేనిచ్చినంత గొప్ప అవకాశం ఎవరూ ఇవ్వలేదు. కానీ, డీల్ చేసుకోవడంలో వారు విఫలమయ్యారు. అందుకే, ఈ రోజు నేను ఆ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటిస్తున్నా. ఇరాన్‌ను ఒంటరిని చేయడమే మా లక్ష్యం. ఇప్పటికే ఆ దేశ నౌకాదళం నాశనమైంది, వాయుసేన ధ్వంసమైంది. సైనిక కర్మాగారాలు శిథిలమయ్యాయి. వారి కరెన్సీ విలువ దారుణంగా పడిపోయింది. ఇక, ఇప్పుడు వారికి ఆర్థికంగానూ ఇబ్బందులు తప్పవు. ఏ దేశమైనా తమ ఆర్థిక సంస్థలు, వ్యాపారాలు, విమానాశ్రయాలు, ప్రభుత్వ సంస్థల ద్వారా ఇరాన్‌కు జీవనాధారాన్ని అందిస్తే గనుక.. ఆ దేశం తీవ్రమైన ఆర్థిక పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. చమురు స్మగ్లింగ్, నగదు బదిలీలు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, షిప్ రిజిస్ట్రీలు, ఫ్రంట్ కంపెనీలు.. ఇవన్నీ ఇప్పుడే ఆగిపోవాలి. అవన్నీ ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి అమెరికా మిత్రదేశాలన్నీ మాతో కలిసి నిలబడాలి. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదు" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు.ఇరాన్‌తో వ్యాపార సంబంధాలు సాగించే దేశాలన్నింటికీ ట్రంప్ ఈ హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌కు భారత్ కీలకమైన వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఇరాన్‌తో మనది మిగులు వాణిజ్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ఇటీవలి కాలంలో ఈ వ్యాపార లావాదేవీలు కాస్త తగ్గినప్పటికీ.. ట్రంప్ తన హెచ్చరికలకు అనుగుణంగా చర్యలు చేపడితే, భారత ఎగుమతిదారులకు కొంత ఇబ్బంది తప్పకపోవచ్చు.టెహ్రాన్‌లో భారత ఎంబసీ డేటా ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇరాన్‌కు మన దేశం నుంచి 1.25 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు వెళ్లాయి. ఇదే సమయంలో 370 మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను మనం టెహ్రాన్ నుంచి దిగుమతి చేసుకున్నాం. వాస్తవానికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇరాన్ వాణిజ్యం 17.03 బిలియన్ డాలర్లుగా ఉంది. అందులో మన దిగుమతులు 13.53 బిలియన్ డాలర్లు కాగా.. ఎగుమతులు 3.51 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయితే, గత కొన్నేళ్లు రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. అందువల్ల ట్రంప్ చర్యలు చేపట్టినా.. భారత్‌పై పడే ప్రభావం తక్కువేనని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు.

# గుండెపోటుతో కేటీకే-1 కార్మికుడు మృతి

▫ అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియా కేటీకే-1 ఇంక్లైన్ లో కోల్ కట్టర్ గా పనిచేస్తున్న గోపాల గోపి (39) బుధవారం రాత్రి షిఫ్టులో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. తోటి కార్మికులు గమనించి, తొందరూ ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహించిన కార్మికులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ గనిలో సీపీఆర్, ఆక్సిజన్ అందించలేదని, అంబులెన్స్ లో సిబ్బందిని పంపలేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఆస్పత్రికి వెళ్లి కుటుంబాన్ని, ఆందోళన చేస్తున్న కార్మికులను పరామర్శించారు. మైన్‌లలో అత్యవసర చికిత్సకు ప్రత్యేక అంబులెన్స్, డాక్టర్, టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని, అర్హతకు అనుగుణంగా



ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోపాల గోపి మృతి సీపీఐ, ఏఐటీయూసీకి లోటని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ అన్నారు. గోపి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపి మరణం పార్టీకి, కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. సిపిఐ శాఖ కార్యదర్శిగా, ఏఐటీయూసీ నాయకుడిగా ఆయన సేవలను గుర్తుచేశారు. విధి నిర్వహణలో మృతి చెందినందున సింగరేణి యాజమాన్యం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# కాకా విగ్రహావిష్కరణ.. రాజకీయ కాక

▫ మంచిర్యాల రాజకీయాల్లో అనూహ్య మార్పులు5

▫ అంతర్గత విభేదాలు కాక విగ్రహ ఆవిష్కరణతో బహిర్గతం

▫ కాక అభిమానిగా మారిన పిఎస్ఆర్ అనుచరుడు



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 20 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో రాజకీయాలు ఆసక్తికరంగా మారినవి . మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు నమ్మిన బంటుగా అన్ని పనులు చక్కబెడుతూ ప్రేమ్ సాగర్ రావు కుడి భుజంగా ఉన్న జగన్మోహన్ రావు నేడు కాక కుటుంబానికి విధేయుడుగా మారడంతో పాటు ఏకంగా కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ కాకా వెంకటస్వామి విగ్రహావిష్కరణ చేయడం ఆసక్తికరంగా మారింది. కొన్ని రోజులుగా మంచిర్యాల జిల్లాలో ఎమ్మెల్యే పిఎస్ఆర్ మంత్రి వివేక్ మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయి .అనే ప్రచారం కొనసాగింది .కాక వెంకటస్వామి విగ్రహం ఆవిష్కరణతో అంతర్గత విభేదాలు కాస్త బహిర్గతం అయినట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీని పట్టుకుని పార్టీ బలోపేతం చేసిన ప్రేమ్ సాగర్ రావు ను కాదని బిజెపి నుంచి కాంగ్రెస్ లో కి వచ్చిన వివేక్ వెంకటస్వామి కి మంత్రి పదవి రావడంతో మంచిర్యాల ఎమ్మెల్యే పిఎస్ఆర్ మంత్రి వివేక్ మధ్య దూరం పెరిగింది ..వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి వచ్చిన సందర్భంగా పీఎస్ఆర్ మంచిర్యాల నియోజకవర్గంలో ఓ సమావేశంలో నేనే రాజు నేనే మంత్రి నేనే అని చెప్పుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే పిఎస్ఆర్ మంచిర్యాల నియోజకవర్గంలో రాజకీయాలను తన కను సన్నల్లో నడిపిన పిఎస్ఆర్ కు ఇప్పుడు మాజీ అనుచరుడు మంతెన జగన్మోహన్ రావు వ్యవహార శైలి ఒక్కింత విస్మయానికి గురిచేస్తుంది. కాంగ్రెస్ కార్యకర్తలతో జగన్మోహన్రావు మాజీ మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య తో కలిసి కాక వెంకటస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాకా వెంకటస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నెల క్రితం మంచిర్యాల నియోజకవర్గంలో పెద్దపెల్లి ఎంపీ వంశీకృష్ణ తమ ట్రస్టు తరుపున దండేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో స్కూల్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసే కార్యక్రమానికి వస్తే ప్రేమ్ సాగర్ రావు అనుచరులు పెద్ద వివాదం సృష్టించారు. ఎమ్మెల్యే అనుచరులు కొంతమంది ఎంపీ వంశీకృష్ణకు వ్యతిరేకంగా నినాదాలు కూడా చేశారు. ఆ కార్యక్రమం కాస్త ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కాకా వెంకటస్వామి విగ్రహాన్ని గతంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అనుచరుడిగా ఉన్న జగన్మోహన్రావు విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు పాలాభిషేకం చేయడం ఆసక్తికరంగా మారింది.

**కాక విగ్రహావిష్కరణకు రాని తనయులు, మనవడు.**

పెద్దపెల్లి మాజీ పార్లమెంటు సభ్యుడు దివంగత నేత కాక వెంకటస్వామి విగ్రహం ఆవిష్కరణకు చెన్నూర్ నియోజవర్గం ఎమ్మెల్యే కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ , అలాగే పెద్దపెల్లి ప్రస్తుత ఎంపీ వంశీకృష్ణ తాతగారైన వెంకటస్వామి విగ్రహ విగ్రహం ఆవిష్కరణకు ఎందుకు. రాలేకపోయారని కాక అభిమానులు చర్చించుకుంటున్నారు . పీఎస్ఆర్ మాజీ అనుచరులు ఆయన మంతెన జగన్మోహన్రావు ,మాజీ మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యతో కాక వెంకటస్వామి విగ్రహావిష్కరణ చేయడం వెనుక మతలబు ఏమిటి అనే చర్చ కొనసాగుతుంది . ఏది ఏమైనప్పటికీ కాకా విగ్రహావిష్కరణ రాజకీయాల్లో కాక రేపుతోంది.

# ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న విద్య దేశ విదేశాంగ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రాలు ఉన్నారయ్య అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. ఫిలిప్పీన్స్ దేశ విదేశాంగ శాఖ అధికారులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. ఫిలిప్పీన్స్ దేశ విదేశాంగ శాఖ అధికారులు ఆ దేశంలో అమల్లో ఉన్న ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను తెలంగాణ రాష్ట్ర బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందానికి సారథ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి గల్ఫ్ కార్మికులకు ఎలా అండగా ఉండాలి అన్న అంశాలపై ఫిలిప్పీన్స్ విదేశాంగ శాఖ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్ దేశంలో అమలు చేస్తున్న వలస కార్మికుల విధానాన్ని తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో నివాసం ఉంటున్న సుమారు 15 లక్షల మంది కార్మికులకు అండగా ఉండేందుకు వసుపోతూ త్వరలో ఒక విధానపరమైన విధానాన్ని తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్, డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్ దేశ పర్యటనలో భారత విదేశాంగ శాఖ ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ ఈ బృందానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు.

# ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

▫ అడ్మిన్ శ్రీనివాసరెడ్డి నివాసంలో సోదాలు

**హైదరాబాద్, ఆగస్ట్20 (జనంసాక్షి) :** ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి చిక్కారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఉదయం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగాయి. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాస్ రెడ్డి నివాసంతో పాటు 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆస్తులు, పత్రాలు ఇతర కీలక ఆధారాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డి గతంలో మహేశ్వరం తహశీల్దార్‌గా పనిచేశారు.

# రైల్వే జంక్షన్, రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయండి

▫ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** కాజీపేట జంక్షన్,వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కొత్తగూడెం రైల్వే స్టేషన్లను (భద్రాచలం రోడ్) డివిజన్ కేంద్రాలుగా ప్రకటిస్తూ అభివృద్ధి చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.తెలంగాణలో సికింద్రాబాద్ రైల్వే జోనల్ కేంద్రం కాగా, హైదరాబాద్ ఒక్కటే డివిజన్ గా ఉందని,ఈ దృష్ట్యా కాజీపేట, కొత్తగూడెంలను డివిజన్లుగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్రిటీష్ వారి కాలంలో 1932లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఏర్పాటు జరిగిందని, దానికి భద్రాచలం రోడ్ స్టేషన్ అని నామకరణం చేశారన్నారు.అయితే, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీరామ చంద్ర స్వామి కొలువైన భద్రాచలం క్షేత్రంలో రైల్వే స్టేషన్ లేకపోవడం విచారకరమన్నారు. భద్రాచలంకు రైలు మార్గాన్ని పొడగిస్తూ ఒడిషా, ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు దీనిని విస్తరించడం ద్వారా ఆదివాసీ, గిరిజనులకు మేలు జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) పరిధిలోని పార్లమెంట్ మెంబర్స్ (ఎంపీలు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం,ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్,వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు,ప్రయాణీకుల పక్షాన శ్రీవాస్తవకు ఎంపీ వద్దిరాజు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తనతో పాటు పార్థసా రథి రెడ్డి,రేణుకా చౌదరి, రఘురామిరెడ్డి, బలరాంనాయక్ మొత్తం 5 గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పారు.ఈ జిల్లాలో రైల్వే శాఖ చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి తాము పలుమార్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తేవడం జరిగిందని,ఈ మార్గాన్ని భద్రాచలం వరకు పొడిగిస్తూ, భవిష్యత్తులో దానిని 5 రాష్ట్రాలకు కూడలిగా తీర్చిదిద్దాలని, భక్తజనుల సౌకర్యార్థం ఇక్కడ నుంచి తిరుపతికి రైళ్లు నడపాల్సిందిగా కోరారు.

# ఉర్దూ స్కూల్‌కు వితరణ



**హిందూపురం (జనంసాక్షి) :** చౌళూర్ ఉర్దూ స్కూల్ కు తాగునీటి ట్యాంకు అందజేసిన మెగా యూత్ ఫోర్స్ హిందూపురం పట్టణం లోని చౌళూర్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల కు మెగా యూత్ ఫోర్స్ఉమ్మడి అనంతపూర్ డిస్టిక్ జాయింట్ కన్వీనర్ కొండ్రెడ్డి వినయ్ అఖిలభారత చిరంజీవి పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్ మెగా యూత్ ఫోర్స్ టౌన్ జాయింట్ కన్వీనర్స్ అంబేద్కర్ నగర్ శివ దాదు పవర్ స్టార్ తదితరులఆధ్వర్యంలో పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సంధర్భంగా విద్యార్థుల తో కేక్ కట్ చేసి తినిపించిన తర్వాత ఆ పాఠశాల విద్యార్థులకు త్రాగునీటి ట్యాంకును అందజేసి ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు కవి రచయిత కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ శేఖర్ అకాడమీ శేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులుజరీన్ తాజ్, సోమశేఖర్, సుజాత, సుబ్బారాయుడు కూడా పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

▫ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మహబూబాబాద్ బ్యూరో, ఆగస్ట్ 20(జనం సాక్షి):** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురువారం ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల ను సందర్శించారు అనంతరం ఐడిఓసిలో ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై, ఎస్పీ డాక్టర్ శబరిష్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ చైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాద్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఛైర్మన్ సూచించారు. కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్మన్ సూచించారు. ప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చైర్మన్ సూచించారు.



# ఆర్ట్స్ కళాశాలతో టాస్క్ ఒప్పందం

**హనుమకొండ, ప్రతినిధి ఆగస్టు 20 (జనం సాక్షి) :** విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతికి టాస్క్ జిల్లా అభివృద్ధి అధికారి రామకృష్ణ మామిడాల అవగాహన ఒప్పంద పత్రాన్ని అందజేశారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టాస్క్‌తో కుదిరిన ఈ ఒప్పందం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల టాస్క్ సంచాలకులు డాక్టర్ గిరిప్రసాద్, సహాయ రిజిస్ట్రార్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతీ యువకులకు టీఆర్పీ వరం

▫ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో 100 రోజుల ఉచిత కోచింగ్....

▫ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు కరీంనగర్ కేంద్రంగా శిక్షణ తరగతులు...

▫ అప్లికేషన్ ఫారమ్‌లను విడుదల చేసిన పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న...



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిరుద్యోగ యువత భవిష్యత్తుకు బంగారు బాట వేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా వేదికగా 100 రోజుల ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రకటించారు. ఎస్ఐ, కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా నాణ్యమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తు ఫారమ్‌లను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా మనకొండూర్ మండలం కొండపల్కల గ్రామ ఉపసర్పంచ్ వాసాల బాను చెందర్ టిఆర్పీ పార్టీ విధానాలకు ఆకర్షణీయమై టిఆర్పీ పార్టీలో చేరుతానని రాగా వారికి కండువా కప్పి పార్టీలోకి తీన్మార్ మల్లన్న ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నిరుద్యోగులపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యం అని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో భారీ ఫీజులు చెల్లించి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగ సాధనలో తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మల్లన్న గారు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రతిభ ఉన్న యువత వెనుకబడకూడదనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇప్పటికే తమ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా విద్యా సేవలు అందిస్తోందని తెలిపారు. ఇప్పుడు ప్రత్యక్ష శిక్షణ ద్వారా మరింత మంది యువత ఉద్యోగాలు సాధించేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. తదనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు ఫారమ్‌ను నింపి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమం నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశంగా నిలిచి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అఖిల్ పాషా అన్నారు.

# కోతల్లేని కరెంట్ అందించాలి

▫ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే ధర్నా




**నల్లగొండ, ఆగస్ట్ 20 (జనంసాక్షి) :** నకిరేకల్ నియోజకవర్గంలో రైతులకు కోతల్లేని 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందజేయాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు నల్లగొండ లోని ట్రాన్సకో విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రైతన్నలతో కలిసి కాలిపోయిన బోరు మోటర్లతో పాటు ఎండిపోయిన వరి కట్టలతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు రైతులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో నీళ్లు, కరెంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని గుర్తు చేశారు. లో వోల్టేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# మక్తల్ అభివృద్ధికి రూ.1,600 కోట్ల నిధులు

▫ మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి

▫ 25 గ్రామాల్లో రూ.178.84 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**మక్తల్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ పరిధిలోని 25 గ్రామాలలో రూ.178.84 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. సరిగ్గా 25 ఏళ్ల క్రితం సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి-లలిత దంపతులను ఈ సందర్భంగా మంత్రి సీతక్క శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రిగా ఎదిగిన శ్రీహరి ప్రయాణం క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర ప్రజాసేవకు నిదర్శనమని కొనియాడారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, 2001 ఆగస్టు 20న సర్పంచ్‌గా మొదలైన తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజలు, కార్యకర్తలు అందించిన ఆశీర్వాదమే తన బలమని భావోద్వేగంగా పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు రూ.1,500 నుంచి రూ.1,600 కోట్ల విలువైన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. మక్తల్-నారాయణపేట రహదారిని రూ.237 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరిస్తున్నామని, నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించామని వివరించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి కొరత తీరుతుందని, భూసేకరణలో రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. ఆత్మకూర్, అమరచింత, ఉట్కూర్, నర్వ, కృష్ణ, మాగనూరు మండలాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది**

శ్రీమతి జక్కువార్ సవిత భర్త శ్రీ జక్కువార్ అర్జున్ నివాసం చింతకుంట వాడ, నిర్మల్. మా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ 1998/2019 నిర్మల్ టౌన్ ప్రాంతంలో బైక్ పై వెళ్ళేటప్పుడు ఎక్కడో పడిపోయింది. ఎవరికైన దొరికితే ఇవ్వగలరు.

ఇట్లు
జక్కువార్ సవిత
9948526773,7995757079

# భావప్రకటనా స్వేచ్ఛలో వెనుకబాటుతనం

ఒక దేశం ఎన్ని ఆకాశహర్మ్యాలు కట్టిందన్నది అభివృద్ధికి కొలమానం కాదు. ఎన్ని జాతీయ రహదారులు నిర్మించిందన్నది మాత్రమే ప్రగతి కాదు. ప్రశ్నించే పౌరుడిని ఎంత స్వేచ్ఛగా ఉండనిస్తోంది? అధికారాన్ని ప్రశ్నించే జర్నలిస్టును ఎంత నిర్భయంగా పనిచేయనిస్తోంది? అసమ్మతిని ఎంత గౌరవిస్తోంది? ఇవే నిజమైన ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి అసలు కొలమానాలు.

భారత్ వంటి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛ విషయంలో ఇంత వెనుకబడటం సిగ్గుపడాల్సిన పరిస్థితే. పత్రికా స్వేచ్ఛ బలహీనపడితే కేవలం జర్నలిస్టు హక్కు దెబ్బతినదు. ప్రజలకున్న తెలుసుకునే హక్కు దెబ్బతింటుంది. ప్రశ్నించే గొంతు బలహీనపడితే అధికారాన్ని జవాబుదారీగా నిలబెట్టే ప్రజాస్వామ్య వ్యవస్థే బలహీనపడుతుంది.

రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ విడుదల చేసిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ ర్యాంకు పతనం ఈ ఆందోళనను మరింత తీవ్రం చేస్తోంది. గత ఏడాది 2025లో 151వ స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది ఆరు స్థానాలు దిగజారి 157వ స్థానానికి చేరింది. అంతేకాదు, పత్రికా స్వేచ్ఛ విషయంలో భారత్‌ను 'చాలా తీవ్రమైన' పరిస్థితి ఉన్న దేశాల జాబితాలోనే ఉంచడం మరింత ఆందోళన కలిగించే విషయం.

సంపాదకీయం

జనంసాక్షి

ఇది కేవలం ఒక ర్యాంకు తగ్గడం కాదు. దాని వెనుక ఉన్న పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉంది. జర్నలిస్టులపై చట్టపరమైన వేధింపులు, జాతీయ భద్రతా చట్టాల దుర్వినియోగం, మీడియా యాజమాన్యాలు రాజకీయ, ఆర్థిక శక్తుల చేతుల్లో కేంద్రీకృతం కావడం వంటి అంశాలు పత్రికా స్వేచ్ఛను బలహీనపరుస్తున్నాయని నివేదికలో పేర్కొన్న అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అధికారాన్ని పొగిడే మీడియా ఉండటం ప్రజాస్వామ్యానికి బలం కాదు. అధికారాన్ని ప్రశ్నించే మీడియా నిర్భయంగా ఉండటమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం.

జాతీయ భద్రత, చట్టం, పరువు, వ్యవస్థ వంటి పేర్లతో విమర్శించే గొంతులను భయపెట్టే పరిస్థితి ఏర్పడితే అది అభివృద్ధి చెందిన సమాజానికి సంకేతం కాదు. ప్రజలు ప్రశ్నించడానికి భయపడితే.. జర్నలిస్టులు రాయడానికి భయపడితే.. మేధావులు మాట్లాడటానికి వెనుకాడితే.. ఆ దేశం ఎంత సంపన్నంగా కనిపించినా ప్రజాస్వామ్య ఆరోగ్యం మాత్రం ప్రశ్నార్థకమే.

మీడియా యాజమాన్యం కొద్దిమంది రాజకీయ, ఆర్థిక శక్తుల చేతుల్లో కేంద్రీకృతమైతే వార్తల వైవిధ్యం క్రమంగా క్షీణిస్తుంది. చివరకు ప్రజలకు కనిపించేది నిజం కాదు.. చూపించాలనుకున్న నిజం మాత్రమే అయ్యే ప్రమాదం ఉంది. ఇది వ్యక్తుల సమస్య కాదు.. ప్రజాస్వామ్య మౌలిక సూత్రానికే సవాలు.

భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఇష్టమైనది మాట్లాడే అనుమతి మాత్రమే కాదు. అసౌకర్యమైన నిజాలను చెప్పే హక్కు.. అధికారానికి నచ్చని ప్రశ్నలు అడిగే హక్కు.. భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు కూడా. ఏ ప్రభుత్వం అయినా, ఏ వ్యవస్థ అయినా విమర్శకు అతీతం కాదనే భావన నుంచే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం మొదలవుతుంది.

ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో నార్వే వరుసగా పదో ఏడాది కూడా మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. నెదర్లాండ్స్, ఎస్టోనియా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పారదర్శకత, సంస్థాగత స్థిరత్వం, పౌర హక్కులు, స్వతంత్ర మీడియాకు ఇచ్చే ప్రాధాన్యత వంటి అంశాలు అక్కడి ప్రజాస్వామ్య సంస్కృతికి బలంగా నిలుస్తున్నాయి.

దీనికి భిన్నంగా భావప్రకటనా స్వేచ్ఛను అణచివేసే దేశాలు సూచీలో దిగువన నిలవడం యాదృచ్ఛికం కాదు. స్వేచ్ఛను కాపాడే వ్యవస్థలు బలపడితే ప్రజాస్వామ్యం బలపడుతుంది; స్వేచ్ఛను కట్టడి చేసే వ్యవస్థలు బలపడితే ప్రజాస్వామ్యం క్రమంగా బలహీనపడుతుంది.

అభివృద్ధి అంటే ప్రజలకు మెరుగైన రోడ్లు, భవనాలు ఇవ్వడం మాత్రమే కాదు. వారికి స్వేచ్ఛగా ఆలోచించే హక్కు, ప్రశ్నించే ధైర్యం, భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే హక్కు, అధికారాన్ని నిలదీసే స్వేచ్ఛ కల్పించడం కూడా అభివృద్ధే.

భవనాలు ఎత్తుగా ఎదుగుతూ.. ప్రశ్నించే గొంతులు కిందకు పడిపోతే అది అభివృద్ధి కాదు. ఆర్థిక వ్యవస్థ బలపడుతూ.. భావప్రకటనా స్వేచ్ఛ బలహీనపడితే అది సంపూర్ణ ప్రగతి కాదు. దేశం నిజంగా అభివృద్ధి చెందాలంటే రోడ్లు మాత్రమే కాదు.. ఆలోచనలు కూడా విస్తరించాలి.

భారత్ ఆర్థికంగా ఎదగాలి. ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా నిలవాలి. కానీ అదే సమయంలో ప్రజల గొంతు, పత్రికా స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కు కూడా అంతే బలంగా ఉండాలి. ప్రజల గొంతుకు స్వేచ్ఛ ఉన్నప్పుడే దేశానికి నిజమైన అభివృద్ధి ఉన్నట్టు. దేశం ఎంత ఎత్తుకు ఎదిగిందన్నది కాదు.. ఆ దేశ పౌరుడు ఎంత స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నాడన్నదే అసలైన అభివృద్ధికి కొలమానం.

# ఆయనొక పుట్టు పోరాట యోధుడు



## ఎంటీ ఖాన్ జీవితం స్ఫూర్తిదాయకం

*పౌర హక్కుల నాయకుడు ఎమ్‌టి ఖాన్ గారికి జోహార్లు....పౌరహక్కుల సంఘం తెలంగాణ.... తెలంగాణ సాయుధ పోరాటం నుండి నక్సల్బరీ,పౌర హక్కుల ఉద్యమం వరకు... ఎమ్‌టీ ఖాన్ జీవితం !!*

1969లో మొదటి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. శ్రీకాకుళ నక్సల్బరి ఉద్యమాల ప్రభావంతో 1970లో ఏర్పడ్డ విప్లవ రచయితల సంఘంలో వ్యవస్థాపక సభ్యుడైనాడు. 1972లో పిలుపు పేరుతో పత్రికను స్థాపించి నడిపించిన వారు. ఒక ఆదర్శ ముస్లిం, ఒక ఆదర్శ కమ్యూ నిస్టు, ఒక ఉపాధ్యాయుడుగా ఎలా ఉండాలని ఎవరైనా అడిగితే ఎం.టి.ఖాన్ జీవితంలా ఉండాలని అంటారు. కర్తవ్య నిర్వహణకు పురస్కారాలు ఉండవు. ఒక వేళ పురస్కారం వంటిదేదైనా ఉంటుం దంటే అలాంటి అత్యున్నత పురస్కారాలు ఖాన్ గారికి వంగి సలాం చేయాల్సిందే. తానొక పుట్టు పోరాట యోధుడు. పూర్తి పేరు మహమ్మద్ తాజుద్దీన్ ఖాన్. నివాసం హైదరాబాద్ లోని అబూ హాషీం మదాని దర్గా ప్రాంతం. ఈ రోజు ఎం.టి.ఖాన్ గారి స్మృతి దినం !

ఎం.టి. ఖాన్ అసలు పేరు మహమ్మద్ తాజుద్దీన్ ఖాన్. పౌరహక్కుల ఉద్యమనాయకుడు, విప్లవ రచయిత, అధ్యాపకుడు, పాత్రికేయుడు. మార్క్సిస్టు ముల్లా. హైదరాబాద్‌లో పురానాపుల్ వంతెన దగ్గర మియాపైసా దర్గా, అబుహాషిమ్ మదానీ దర్గా. వీరిద్దరూ నిజాంల కాలం నాటి సూఫీ సాధువులు. వీరి వారసుడే ఎం.టి. ఖాన్. ఈ సూఫీ ఫకీర్ల వలెనే ఖాన్ సాబ్ కూడా ఫకీర్ జీవితమే గడిపారు. దర్గాల ముత్తవలి (ధర్మకర్త) అయిన ఖాన్ సాబ్ మగ్దూం మొహియుద్దీన్ తో ప్రభావితుడై కమ్యూనిస్టు అయినారు. దర్గా లకు, మసీదు లకు దూరమైనా మార్క్సిస్టు ముల్లాలాగా జీవించారు. ఖాన్ సాబ్ పూర్వీకులు 400 ఏండ్ల క్రితం గుల్‌బర్గా నుంచి వలస వచ్చారు. గుల్‌బర్గాలోని బందే నవాజ్ (భక్తుల పెన్నిధి) దర్గా ముత్తవలి హుసేన్ షా వలీని కుతుబ్‌షా నవాబు ఇబ్రహీం కులి గోల్కొండ కు రప్పించి తన కూతురు ఖైరతున్నీసాను ఇచ్చి పెళ్ళి చేశారు. పసి వయసులోనే తల్లి చనిపోతే గొల్ల స్త్రీ పోషణలో ఖాన్ సాబ్ పెరిగారు. ఫలితంగా ఇస్లామ్, హిందూ మతాల సంస్కృతుల పట్ల గౌరవం పెంచుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రభావంతో మగ్దూం, రాజబహదూర్ గౌర్‌ల శిష్యరికంలో తెలంగాణ కామ్రేడ్స్ సంఘంలో చేరారు. మగ్దూం ప్రభావంతో ఉర్దూ, పార్సీ సాహిత్యం అధ్యయనం చేశారు. యాకుత్‌పురాలోని ధర్మవంత్ కాలేజీలో ఆయన ఇంగ్లీష్ టీచర్. 'ఇంగ్లీషు ఏ గాడిదైనా నేర్పుతుంది. ముందు మీరు మానవత్వం నేర్చుకోండి. నీతి నేర్చుకోండి' అని మార్క్సిస్టు పాఠాలు నేర్పేవారు. ఉర్దూ, పార్సీ, అరబ్బీ, హిందీ, మరాఠీ, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో అపార ప్రావీణ్యం గల ఖాన్ సాబ్ న్యూస్ టైమ్‌లో సియాసత్‌లో సంపాదకీయాలు రాశారు. ఎం.టి. ఖాన్ గుండెపోటుతో హైదరాబాదులో ఆగష్టు 20, 2014 న మరణించారు.

తెలంగాణ సాయుధ పోరాటం నుండి నక్సల్బరీ వరకు... ఎమ్ టీ ఖాన్ జీవితం !

– ఎన్.నారాయణరావు,

ఉద్యమాలతోనే ప్రజలు స్వేచ్ఛా హక్కును సాధించుకుంటారనే బలమైన విశ్వాసం ఎం.టి ఖాన్‌ది. అదే అతన్ని చివరికంట ఉద్యమాలతో, హక్కుల ఉద్యమాలతో ఐక్యంగా ఉండేలా చేసింది. హైదరాబాద్ పాత బస్తీలోని పురాణాపూల దగ్గర సంప్రదాయక ముస్లింలైన దర్గా ముత్తావలి (ధర్మకర్త) కుటుంబంలో 1933లో ఎం.టి.ఖాన్ జన్మించారు. ఎం.టి. ఖాన్ గుండెపోటుతో హైదరాబాదులో ఆగష్టు 20, 2014 న మరణించారు.

తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమకాలంలో కూడా రజాకార్ల ఆగడాలను తీవ్రంగా వ్యతిరేకించాడు.

మతోన్మాదులు ఎవరైన ఒక్కటే అనే భావనతో హిందూ ముస్లిం మతోన్మాద దాడులను వ్యతిరేకించాడు. 60, 70 దశకంలో యువత నక్సల్బరి, శ్రీకాకుళ ఉద్యమాలకు ప్రేరేపించబడ్డట్టుగా ఖాన్‌సాబ్ కూడా ఆ ఉద్యమాలతో పెల్లుబికిన అనేక ప్రజా ఉద్యమాలలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాడు. 1969లో మొదటి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. శ్రీకాకుళ నక్సల్బరి ఉద్యమాల ప్రభావంతో 1970లో ఏర్పడ్డ విప్లవ రచయితల సంఘంలో వ్యవస్థాపక సభ్యుడైనాడు. 1972లో పిలుపు పేరుతో పత్రికను స్థాపించి నడిపించినారు.

విరసం చెరబండ రాజు, ఎంటిఖాన్ 18 మే1974 న సికిందరాబాదు కుట్ర కేసులో అరెస్టయ్యారు. 1975 జనవరి 10 న చెరబండరాజు ఖాన్ సాబ్ బెయిల్ పై విడుదలయ్యారు.

1975 ఎమర్జెన్సీ కాలంలో అరెస్టు అయిన తొలి హైదరాబాదీ ఖాన్‌సాబ్. జైళ్ళు నుండే పిలుపు పత్రికను ఆయన భార్య కైసర్ బేగమ్ సహకారంతో నడిపించాడు. సికింద్రాబాద్ కుట్ర కేసులో కొండపల్లి సీతారామయ్య తదితరులతో అరెస్టయినాడు. అప్పటికే వివిధ సంఘాల కార్యాచరణలో ఉన్న ఖాన్‌సాబ్, 1980లో ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం హైదరాబాద్ శాఖకు ఉపాధ్యక్షుడయినాడు.

అప్పుడు డా॥ రాజ్ గోపాలన్, కోదండరాంలు అధ్యక్ష, కార్యదర్శులుగా కొనసాగారు. 80 దశకం నుండి 90 దశకం వరకు హైదరాబాద్‌లో జరిగిన మత ఘర్షణలలో 93 మంది చనిపోగా, 64 మంది కత్తిపోట్లకు గురైయ్యారు. 350 మంది హింసా కారకులుగా జైళల్లో నిర్బంధించబడ్డారు. ఈ స్థితిలో మత ఘర్షణల నివారణ కోసం హైదరాబాద్ ఏక్తా సంస్థలో చాలా కాలం పని చేసారు.

1991లో కరీంనగర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 7వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యత తీసుకున్నాడు. ఆ తర్వాత 1993లో జరిగిన 8వ రాష్ట్ర మహాసభల్లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో ఎదురైన సంక్షోభ సమయంలో కన్నాభిరాన్ స్థానంలో అందరికీ ఆమోదనీయుడైన వాడిగా సంస్థకు అధ్యక్షుడయినాడు ఖాన్‌సాబ్. అప్పటి నుండి ఐదేండ్ల పాటు పౌరహక్కుల సంఘానికి అధ్యక్షుడుగా ఉండి 1998లో హైదరాబాద్‌లో జరిగిన సంస్థ 10వ రాష్ట్ర మహాసభల నాటి నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పౌరహక్కుల సంఘంలోనే కొనసాగాడు. ఖాన్‌సాబ్ సంస్థకు అధ్యక్షుడుగా ఉన్న 1993 నుంచి 1998 కాలంలో పౌరహక్కుల ఉద్యమ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత, ప్రాధాన్యత కలిగిన సంఘటనలు జరిగాయి.

ఎన్‌కౌంటర్ హత్యలు పెద్ద ఎత్తున జరిగిన కాలమది. 1993 జనవరి 30న ఎమ్వీఎల్ఏ బాలరాజ్, ఒక ఐఎఎస్ అధికారితో పాటు ఎనిమిది మందిని నక్సలైట్లు తూర్పు గోదావరి జిల్లా గుర్తేడులో కిడ్నాప్ చేసిన కాలమది. అప్పటి 23 ఏళ్ళ నక్సలైట్ చరిత్రలో మొట్టమొదటి ఐ.పి.ఎస్ ఆఫీసర్, వ్యాస్ హత్య జరిగిన కాలమది. అదే కాలంలో నిజామాబాద్, తెలంగాణ రీజనల్ సెక్రటరీ శంకర్ అలియాస్ దొంత మార్కెండేయ ఎన్‌కౌంటర్ హత్యకు గురయ్యాడు. ఖాన్‌సాబ్ అధ్యక్షుడుగా ఉన్నంత కాలం రాజ్యహింస, ఆచరణ విషయాల పట్ల పౌరహక్కుల ఉద్యమం అవలంబించాల్సిన హక్కుల దృక్పథాల పట్ల తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. ప్రజాతంత్ర పోరాటాలు బలంగా సాగినప్పుడు చారిత్రక ప్రజాస్వామ్య భావ సంఘర్షణ జరిగింది. ఇంత ఘర్షణలో ఖాన్‌సాబ్ ఎక్కడా తన సంయమనాన్ని కోల్పోలేదు. తీవ్రమైన వాదోపవాదాల్లో పాల్గొంటూ తన అధ్యక్ష గౌరవాన్ని కాపాడుకున్నాడు.

అది ఖాన్‌సాబ్‌కు జీవితం ఇచ్చిన పరిణతి. ఎన్‌కౌంటర్ హత్యలు పెద్ద ఎత్తున సాగిన కాలంలో అప్పట్లో ఎన్‌కౌంటర్లో ఎవరు చనిపోయారో ప్రకటించేవారు కాదు. రాత్రికి రాత్రే ఇంట్లో నుంచి యువకుల్ని ఎత్తుకెళ్ళి కాల్చి చంపి, ఎన్‌కౌంటర్‌గా గుర్తు తెలియని శవంగా ప్రకటించడం జరుగుతుండేది. శవాలను బంధుమిత్రులకు అప్పగించే బాధ్యత ప్రభుత్వం నిర్వహించేది కాదు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన శవం దరి దాపుల్లోకి ఎవరినీ రానిచ్చేవారు కాదు.

అటువంటి కాలంలో 1994 లో సూర్యం ఎన్‌కౌంటర్ కేసు హైకోర్టులో న్యాయవాదులు న్యాయస్థానంలో పోరాటం చేయడానికి ఎటువంటి సంకోచం లేకుండా ఆ కేసులో పిటిషనర్‌గా ఖాన్‌సాబ్ నిలబడ్డాడు. మొదటి సారిగా రీ పోస్టుమార్టం చేయించడం ద్వారా లభ్యమైన సాక్ష్యాధారాలతో ఎన్‌కౌంటర్ల బూటకత్వాన్ని కోర్టు ముందు ప్రశ్నించి నేరాన్ని నిర్ధారించడం ఆ కేసుతోనే మొదలై ఆ తరువాత వెల్లువలా హైకోర్టులో కేసులు వేసి శవాలను భద్రపరచాలని, బంధు మిత్రులకు అప్పగించాలని, వారి వారి కుటుంబ ఆచారాల ప్రకారంగా, రాజకీయ విశ్వాసాలపరంగా అంతిమ యాత్రకు అనుమతించాలని పలు ఆదేశాలు పొందడం మొదలైంది. న్యాయస్థానాల్లో న్యాయపోరాటంగానే కాక, కోర్టు బయట కూడా ప్రజా ఉద్యమాన్ని కొనసాగించింది. ఏ ఎన్‌కౌంటర్ హత్యలతో శ్మశాన భయానక వాతావరణం సృష్టించాలని పాలకులు, ప్రభుత్వాలు పెద్ద ఎత్తున బూటకపు ఎన్‌కౌంటర్లు చేయించారో అందుకు ప్రతి ఘటనగా ప్రతి ఎన్‌కౌంటర్ సందర్భమూ మార్చురీలను, ఊర్లను స్మశానాలను సైతం సరికొత్త పోరాట కేంద్రాలుగా మార్చారు.

ఆప్తులను కోల్పోయిన బంధు మిత్రులు, గ్రామ ప్రజలే పాటలతో, సభలతో ఊరేగింపులతో సరికొత్త ఎన్‌కౌంటర్ల నిరసన రూపాలను సష్టించారు. ఈ కదలికను, పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని ముందుండి నడిపిన పురుషోత్తం, గద్దర్లపై హత్యా ప్రయత్నాలు జరిగితే ఎన్‌కౌంటర్ శవాల స్వాధీన కమిటీ కన్వీనర్‌గా ఆ బాధ్యతను స్వీకరించి కొనసాగించాడు ఖాన్‌సాబ్.

ఎన్‌కౌంటర్ హత్యలకి వ్యతిరేకంగా వచ్చిన నాటి విశాల ప్రజా ఉద్యమాల నేపథ్యం లేకుండా 1997 లో మొదటిసారిగా హైకోర్టు మధుసూదన్ రాజ్ ఎనౌకౌంటర్ కేసులో హత్యానేరం నమోదు చేయాలనే తీర్పు ఇచ్చేది కాదు. అటు కోర్టులో న్యాయ పోరాటంలో ఇటు బయట ప్రజా పోరాటంలో ముందుండి నాయకత్వం వహించింది ఎమ్.టి. ఖాన్.

1993లో జాతీయ మానవహక్కుల కమిషన్ ఎన్‌హెచ్‌ఆర్‌సి ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎనౌకౌంటర్ హత్యలను పోలీసు కస్టడీ హత్యలను అప్పటివరకు సవివరంగా సేకరించి విపులంగా వివరిస్తూ 1994లో ఎపిసిఎల్‌సి అధ్యక్షులు ఎమ్.టి. ఖాన్ ఫిర్యాదుదారుడిగా కేసు వేస్తే ఆ విచారణకు స్వయాన ఎన్‌హెచ్ఆర్‌సి చైర్మన్ రంగనాథ్ మిశ్రా రాష్ట్రానికి వచ్చారు.

కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్ సమక్షంలోనే ఎమ్.టి. ఖాన్ బాలగోపాల్, కన్నభిరాన్లపై మఫ్టీ పోలీసులు, మాజీలు కలిసి గూండాల్లా దాడి చేసారు. దాంతో హైద్రాబాద్ లేక్ వ్యూ గెస్టు హౌస్‌లో ఎన్‌హెచ్‌ఆర్‌సి తదుపరి విచారణ ముగించింది. ఆ విధంగా బహిరంగ విచారణనైతే రాష్ట్ర పోలీసులు అడ్డుకోగలిగారు గానీ, ఎన్‌హెచ్‌ఆర్‌సి ముందే బరితెగించిన వారి హక్కుల ఉల్లంఘన చర్యలను వారే బహిరంగపరుచుకున్నారు.

ఫలితంగా 1997లో ఎన్‌హెచ్‌ఆర్‌సి ఎన్‌కౌంటర్ హత్యలు, కస్టడీ మరణాల విషయంలో హత్య కేసులు నమోదు చేయాలని, విచారణను నిందిత పోలీసులు కాక ఇతరేతర పోలీసులు చేయాలని శవ పరీక్షను వీడియోలో చిత్రీకరించి భద్రపరచాలని ఆదేశాలను దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు గైడ్ లైన్స్ గా ఇచ్చింది. ఇందుకు మూలం ఖాన్‌సాబ్ ఆధ్వర్యంలో ఎపిసిఎల్‌సి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదే.

1994- 95 సంవత్సరాలలోనే చరిత్రాత్మకమైన జైలు ఖైదీల పోరాటం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా నక్సలైట్ ఖైదీలు, జీవిత ఖైదీలు వివిధ జైళ్ళలో చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష నెల రోజులు దాటడంతో వారికి సంఘీభావంగా బయట 72 ప్రజా సంఘాల మద్దతుతో జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ జెఎసిడిఆర్ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తూ మొదటి రోజు ఆయనే దీక్షలో పాల్గొన్నాడు.

సుదీర్ఘమైన జైలు జీవితాన్ని చూసిన ఖాన్ సాబ్ ఆనాటి ఖైదీల పోరాటం విజయవంతంగా నడిపి 42 డిమాండ్లు సాధించుకోవడంలో, అప్పటి హోం మంత్రి, స్వయాన ఖాన్‌సాబ్ విద్యార్థి అయిన ఇంద్రా రెడ్డితో చర్చలు నడిపించడంలో ఎంతో చురుకైన పాత్ర పోషించారు. 2000 సంవత్సరంలో పురుషోత్తం హత్య ఆ తరువాత ఆజాం అలీ హత్యలతో మాజీలను చేరదీసి హక్కుల సంఘాలు, ప్రజా ఉద్యమాలపై సరికొత్త హంతక దాడిని మొదలు పెట్టిన చంద్రబాబు ప్రభుత్వ పాశవిక నిర్బంధ కాలంలో ఎంతో ధైర్యంగా ముందుకువచ్చి సర్కారీ హంతక ముఠాల వ్యతిరేక కమిటీకి కన్వీనరుగా ఉండి రాష్ట్రంలో దేశంలో హక్కులడిగితే హత్యలా అని పాలకులను ప్రశ్నించాడు.ఆ రకంగా తెలుగు సమాజంలో ప్రతి ఉద్యమంలో ప్రత్యేకించి హక్కుల ఉద్యమాలు అత్యంత భయానక దాడికి గురైన సందర్భంలోనే ఆయన పెద్ద దిక్కుగా, హక్కుల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిల్చి అందరినీ నడిపించారు. ఖాన్ సాబ్.. హైద్రాబాద్లో మత ఘర్షణలు జరిగినపుడు రెండు మతాల స్వార్థపర నాయకులను ఎండ గట్టాడు. రెండు మతాల ఉన్మాదానికి ఆజ్యం పోసే బిజెపి,ఎమ్ ఐ ఎమ్ కుట్రలను ధైర్యంగా ఎదిరించాడు. వీటికి ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాలు పాతబస్తీలో రావాలని జీవితాంతం ఆకాంక్షించాడు. చార్మినార్ నుంచి చార్మినార్ వరకు పాత బస్తీ చుట్టివచ్చే విధంగా జరిగిన పెద్ద ఊరేగింపును, ఉర్దూ ఘర్‌లో సభను ఖాన్ సాబ్ చొరవతోనే ఎపిసిఎల్‌సి నిర్వహించింది.

సరిగ్గా సంవత్సరం క్రితం హైదరాబాద్ సరోజినీదేవి హాల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 16వ రాష్ట్ర మహా సభలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేపథ్యంలో పౌర హక్కుల సంఘంగా జరిగిన పేరు మార్పును ఆహ్వానిస్తూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవాన్ని చూసిగాని చనిపోను అన్న ఖాన్ సాబ్, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా అనారోగ్యంగా ఉన్నా గన్ పార్క్ వద్దకు వచ్చి తెలంగాణ అమరులకు జోహర్లు అర్పించారు.

నిండైన జీవితం, మెండైన అనుభవం కలబోసిన ఆయనది అరుదైన వ్యక్తిత్వం. నిఖార్సయిన ప్రజాస్వామిక జీవనం. ఆ సద్గుణాలే ఆయన సుదీర్ఘ జీవితంలో ఆయనతో ప్రయాణించిన వారందరికీ ఆయన తమవాడే అనిపించేట్లు చేసింది. అందుకే కావటానికి ఆయన పౌరహక్కుల సంఘం సారథి ఆయినా ఈనేల మీద సాగిన అన్ని ప్రగతిశీల ప్రజా ఉద్యమాల వారధి. ఆయన గురించి, ఆయనతో పంచుకున్న అనుభవాలను మనందరం స్మరించుకోవడం కోసం ఈ తరం వారికి తెలియజేయడం కోసం ఖాన్‌సాబ్ జీవితాన్ని ఆగస్టు 20 అతను మరణం రోజునైన గుర్తు చేసుకుందాం.



**ఎన్. నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# భారతీయ సమాజంలో విలువల సంక్షోభం


**యువతను నిందించడం కాదు, అర్థం చేసుకోవాలి**

భారతీయ సమాజం అనగానే ప్రపంచానికి గుర్తొచ్చే అంశాలు కుటుంబ విలువలు, పెద్దల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత, గురువుల పట్ల గౌరవం, మానవత్వం, సహనం. వేల ఏళ్ల నాగరికత వ్యక్తి స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతను, హక్కులతో పాటు కర్తవ్యాన్ని ప్రాధాన్యం ఇచ్చింది. కానీ ఇటీవలి కాలంలో కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణలు, తల్లిదండ్రులపై పిల్లల దాడులు, ఉపాధ్యాయులపై విద్యార్థుల హింస, చిన్న వయసులోనే వ్యసనాలు, కోపాన్ని నియంత్రించుకోలేకపోవడం వంటి ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి.

తల్లి చదువు గురించి చెప్పినందుకు కుమారుడు హత్యకు పాల్పడిన ఘటన, నల్లగొండలో 10వ తరగతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలిపై కత్తులతో దాడి చేసిన సంఘటన వంటివి మనసును కలచివేస్తున్నాయి. ఇవి వ్యక్తిగత నేరాలుగా కనిపించినా, వరుసగా చూస్తే కుటుంబం, విద్యాసంస్థ, స్నేహితుల వర్గం, వ్యసనాలు, మానసిక ఒత్తిడి, డిజిటల్ సంస్కృతి, విలువల విద్య మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అయితే ప్రతి యువకుడు హింసాత్మకంగా మారుతున్నాడని చెప్పడం వాస్తవానికి విరుద్ధం. కోట్లాది మంది యువత విద్య, పరిశోధన, ఉద్యోగం, వ్యవసాయం, సైన్యం, క్రీడలు, సేవా రంగాల్లో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. కొన్ని దారుణ సంఘటనల ఆధారంగా మొత్తం యువతను నిందించడం సరైనది కాదు. సమస్య యువతలోని ఒక వర్గంలో పెరుగుతున్న ప్రమాదకర ప్రవర్తనను గుర్తించి దాని మూలాలను అర్థం చేసుకోవడంలో ఉంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 10--19 సంవత్సరాల వయస్సు వ్యక్తిత్వం, భావోద్వేగ నియంత్రణ అభివృద్ధి చెందే కీలక దశ. ప్రపంచవ్యాప్తంగా ఈ వయస్సు గల ప్రతి ఏడుగురిలో ఒకరు ఏదో ఒక మానసిక ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో కూడా వ్యసనాల పరిస్థితి ఆందోళనకరం. 2019 జాతీయ సర్వే ప్రకారం 10--75 సంవత్సరాల వారిలో 14.6 శాతం మద్యం వినియోగిస్తున్నారు. చిన్న వయస్సులోనే కొన్ని మాదక పదార్థాలకు పరిచయం అవుతున్న ప్రమాదం కూడా ఉంది. వ్యసనం కేవలం ఆరోగ్య సమస్య కాదు; అది కుటుంబ



సంబంధాలను, విద్యను, ఉపాధిని ప్రభావితం చేసే సామాజిక సమస్య.

కుటుంబం ఈ సమస్యలో కీలకం. పిల్లవాడు మొదట మానవత్వాన్ని ఇంట్లోనే నేర్చుకుంటాడు. తల్లిదండ్రులు ఒకరినొకరు ఎలా గౌరవించుకుంటారు, కోపం వచ్చినప్పుడు ఎలా స్పందిస్తారు అనేది పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. అతిగా నియంత్రించే ధోరణి, కేవలం ఫలితాల కోసం ఒత్తిడి కూడా సమస్యగా మారుతోంది. క్రమశిక్షణకు ప్రేమ, సంభాషణ తోడుకావాలి.

పాఠశాలలు కేవలం మార్కులు ఇచ్చే కేంద్రాలుగా ఉండకూడదు. కోప నియంత్రణ, వివాద పరిష్కారం, సహానుభూతి, వ్యసనాల ప్రమాదం, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను విద్యలో భాగం చేయాలి. ఉపాధ్యాయుల భద్రత కూడా అంతే ముఖ్యం. విద్యార్థికి ప్రశ్నించే హక్కు ఉంది కానీ గురువుపై హింసకు ఎటువంటి సమర్థన లేదు.

సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని కూడా విస్మరించలేం. సమాచారం పెరిగింది కానీ దాన్ని విశ్లేషించే సామర్థ్యం అంతే స్థాయిలో పెరగలేదు. హింసను వినోదంగా చూపించే కంటెంట్, అసభ్య భాష, తక్షణ ప్రతిస్పందనకు అలవాటు యువత ప్రవర్తనపై ప్రభావం చూపుతున్నాయి. సాంకేతికత స్వతహాగా చెడ్డది కాదు; దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే ముఖ్యం.

పరిష్కారం కేవలం పోలీసుల చేతుల్లో లేదు. నేరం జరగకముందే అడ్డుకోవడానికి కుటుంబం, పాఠశాల, ఆరోగ్య వ్యవస్థ, సమాజం కలిసి పనిచేయాలి. ప్రతి పాఠశాలలో శిక్షణ పొందిన సలహాదారు ఉండాలి. వ్యసన నివారణలో కేవలం భయపెట్టే ప్రచారం సరిపోదు. క్రీడలు, సాహిత్యం, కళలు, స్వచ్ఛంద సేవ, నైపుణ్య శిక్షణ వంటి సానుకూల వేదికలు పెంచాలి.

భారతీయ సమాజం పూర్తిగా మానవత్వాన్ని కోల్పోలేదు. కోట్లాది కుటుంబాల్లో తల్లిదండ్రులు పిల్లల కోసం త్యాగాలు చేస్తున్నారు. లక్షలాది యువకులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సమస్య ఏమిటంటే మంచి పనులు వార్తలు కావు; ఒక హత్య మాత్రమే దేశవ్యాప్త చర్చకు వస్తుంది.

నేటి ప్రధాన ప్రశ్న "యువత మానవత్వాన్ని కోల్పోయిందా?" అనేది కాదు. "యువతకు మానవత్వాన్ని నేర్పుతున్న సమాజం మన దగ్గర ఎంత బలంగా ఉంది?" అనేదే అసలు ప్రశ్న. పిల్లలకు మార్కులు నేర్పుతున్నాం; కానీ ఓటమిని ఎలా స్వీకరించాలో నేర్పుతున్నామా? పోటీ నేర్పుతున్నాం; కానీ ఓడిపోయినవారిని గౌరవించడం నేర్పుతున్నామా?

యువతను నిందించడం కాదు-అర్థం చేసుకోవాలి. భయపెట్టడం కాదు-మార్గనిర్దేశం చేయాలి. మార్కులు మాత్రమే కాదు-మానవ విలువలను కూడా విద్యలో భాగం చేయాలి. పిల్లల చేతిలో మొబైల్ పెట్టే ముందు వారి చేతిలో బాధ్యతను పెట్టాలి.

మానవత్వం ఒక తరానికి వారసత్వంగా వచ్చేది కాదు; ప్రతి తరం దాన్ని తిరిగి నిర్మించుకోవాలి. రహదారులు, భవనాలు, సాంకేతికత దేశాన్ని అభివృద్ధి చేయవచ్చు; కానీ మానవ త్వం మాత్రమే సమాజాన్ని నాగరికంగా ఉంచుతుంది. యువత చేతిలో దేశ భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తును మానవీయంగా తీర్చిదిద్దే బాధ్యత మొత్తం సమాజానిదే.




**ప్రొఫెసర్ సుంకరి జ్యోతి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## మనస్సు పరిమళం

ఒకరి మనసు దగ్గరికి
నడవడానికి
ఎంత దూరం కావాలి?
యేజనాలు నడవక్కరలేదు
అహంకారాన్నో,కోపాన్నో
దాటితే చాలదా??
చేతిని పట్టుకోవడం కోసం
నేనున్నానని చెప్పడం కోసం
ఎన్ని మెట్లు దిగితే తప్పేంటీ!?
కొన్నిసార్లు శ్వాసించడం
గాలికోసం కాదేమో!!
మనకోసం తపిస్తున్న
ప్రాణం కొరకు కావచ్చు
శ్వాసలోనూ ప్రియమైన వారి
ఉనికి
వెతుక్కోవడం నిశ్శబ్ద తపనేగా!!
మైలురాళ్ళను దాటడమే
ప్రయాణం కాదు!
అడుగుల వెనుక వదిలిన
మానవత్వపు పరిమళాలే
అసలైన జ్ఞాపకం!
గమ్యం అంటే మనం
చేరుకున్న
చోటు కాదు,
ప్రయాణపు దారిలో నిలువెత్తు
మనిషితనం కలిగివుండటమే!!
భవిష్యత్తుపై నమ్మకంతో
వేసే ప్రతి అడుగు,
బంధాల వెచ్చదనంలో
సేదతీరే మరోఅడుగు,
ఒంటరితనాన్ని జయించే
భరోసాకై నిలబడే ప్రతి
అడుగు
స్నేహానికి, ప్రేమకు నిలువెత్తు
సాక్ష్యం!
కుల,మతాల సరిహద్దులను
దాటుకుని,
లోకమంతా మానవత్వపు
పరిమళాలు వెదజల్లాలి!
మనిషితనం విరబుయాలి
మనుషుల మధ్య
మమకారాలు చిగురించాలి.
ఎందుకంటే?!
మనిషిలోని మానవత్వమే
భగవంతుడు
మానవత్వమే మనిషికి
తొలి వేదం!!

**అనిత కృష్ణ గండమళ్ళ**
9490876621



# ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ రైడ్స్

- ఏవో శ్రీనివాసరెడ్డి ఇండ్లపై సోదాలు
- అర్ధరాత్రి వరకు కొనసాగనున్న తనిఖీలు
- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో విచారణ
- రెవెన్యూ శాఖలో తీవ్ర అలజడి
- రూ.100 కోట్లకు పైగా ఆస్తులా..?
- ఏసీబీ సోదరులతో ఆర్డీవో కార్యాలయం ఖాళీ

**రంగారెడ్డి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా రెవెన్యూ శాఖలో మరో భారీ అవినీతి తిమింగలం ఏసీబీకి చిక్కింది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై గురువారం ఉదయం నుంచి అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏక కాలంలో దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే బలమైన ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ నేతృత్వంలో కేసు నమోదు చేసుకున్న అధికారులు ఈ విస్తృత తనిఖీలను చేపట్టారు. హైదరాబాద్ నగరంలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో ఉన్న సంతోషిమాత కాలనీలోని శ్రీనివాస రెడ్డి ప్రధాని నివాసంతోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఆయన బంధువులు, అత్యంత ఆప్తులు, స్నేహితులకు చెందిన మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ ప్రత్యేక బృందాలు ఏకకాలంలో సోదాలు జరుపుతున్నాయి. ఈ అధికారి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ వంటి కీలక ప్రాంతాల్లో తహశీల్దార్‌గా సుదీర్ఘకాలం విధులు నిర్వహించారు. ఆయా సమయాల్లో కూడా ఆయనపై అనేక ల్యాండ్ సెటిల్‌మెంట్లు, భారీ అవినీతి ఆరోపణలు వెల్లువెత్తినట్టు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.

### 15 బృందాలతో ముమ్మరం సోదాలు..

ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో రంగంలో దిగిన ఏసీబీ అధికారులు అత్యంత అక్కడ బందీగా ఈ దాడులను నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే ప్రారంభమైన ఈ దాడుల్లో దాదాపు 15 ఏసీబీ ప్రత్యేక బృందాలు ఏక కాలంలో రంగంలోకి దిగాయి. శ్రీనివాసరెడ్డికి చెందిన నివాసాల్లో లభించిన కీలక భూపత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, నగదు, బంగారు



ఆభరణాలకు సంబంధించిన వివరాలపై ఏసీబీ అధికారులు ప్రస్తుతం సుదీర్ఘంగా ఆరా తీస్తున్నారు.

### కెరీర్ అంతా వివాదాస్పదమే..

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి శ్రీనివాస రెడ్డి రెవెన్యూ శాఖలో అనేక వివాదాస్పద పోస్టింగ్‌లలో పని చేశారు. గతంలో రంగారెడ్డి జిల్లాలోని అత్యంత ఖరీదైన భూములు ఉండే మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్‌లలో తహశీల్దార్‌గా పని చేసిన కాలంలోనే ఈయనపై ఎక్కువ ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ వింగ్‌లో తహశీల్దార్‌గా కూడా ఈయన బాధ్యతలు స్వీకరించారు.

### మే నెలలో ఇబ్రహీంపట్నం..

కలెక్టర్ కార్యాలయం నుంచి 2026మే నెలలో డిప్యూటేషన్‌పై ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయానికి శ్రీనివాస రెడ్డి బదిలీ అయ్యారు. ప్రస్తుతం అక్కడ ఆయన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఈ స్వల్ప వ్యవధిలోనే ఆయనపై మళ్లీ ఆదాయానికి మించిన ఆస్తుల ఫిర్యాదులు అందాయి. వీటి ఆధారంగానే అధికారులు చర్యలు తీసుకున్నారు.

రాత్రి వరకూ జరగనున్న సోదాలు...

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని శ్రీనివాసరెడ్డి బంధువులు, స్నేహితుల ఇండ్లు సహా మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. శ్రీనివాసరెడ్డి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో పనిచేసినప్పుడు కూడా ఆయనపై వచ్చిన ఆరోపణ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని సైతం ఫిర్యాదులను పరిశీలిస్తున్నారు. ఇంకా ఆస్తులు వివరాలను కనుకునే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఏకకాలంలో 15 ప్రాంతాల్లో విచారణ జరగడం ఆ సమాచారం అంతా క్రోడీకరించి ఆస్తుల వివరాలు పక్క సమాచారం రావాలంటే అర్ధరాత్రి వరకు ఈ దాడులు కొనసాగే అవకాశం ఉంది.

### రూ.100 కోట్లకు పైగా ఆస్తులా..?

ఏసీబీ సోదాల్లో శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన ఆస్తుల విలువ రూ.100 కోట్లకు పైగా ఉండొచ్చని అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే ఈ ఆస్తుల పూర్తి విలువ, వాటి చట్టబద్ధత, ఆదాయ వనరులపై అధికారికంగా తుది నిర్ధారణ రావాల్సి ఉంది. సోదాల్లో బయటపడిన ఆస్తుల పత్రాలు, ఇతర ఆధారాలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### 10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి

రంగారెడ్డి జిల్లాలో శ్రీనివాస్ డ్డికి 10 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి వివరాలు ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ భూములు, ఇళ్ల స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, లావాదేవీల వివరాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు.

### ఆర్డీవో కార్యాలయం ఖాళీ..

ఇబ్రహీంపట్నం ఆర్ డి ఓ కార్యాలయ ఓ శ్రీనివాస్ రెడ్డి కి సంబంధించిన ఆస్తులపై ఏసీబీ దాడుల నేపథ్యంలో రెవెన్యూ శాఖలో అలజడి మొదలైంది. ఉదయం 9 గంటల సమయంలోనే ఏసీబీ అధికారులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికి ఉద్యోగస్తులు ఎవరు విధులకు రాకపోవడంతో వెనుతిరిగారు. ఉదయం 10 గంటల తర్వాత కార్యాలయ ఉద్యోగులు ఒక్కొక్కరు రావడంతో 10:30 గంటల సమయంలో కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు నేరుగా ఏవో శ్రీనివాసరెడ్డి చాంబర్ ను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆయనకు సంబంధించిన కంప్యూటర్‌లో నిక్షిప్తమైన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు అందుకు ఆ కార్యాలయం ఆపరేటర్ను సహాయంగా తీసుకున్నారు. ఈ తరుణంలోని కార్యాలయంలోని ఆయా శాఖలో పనిచేస్తున్న సిబ్బంది విధులకు ఎగనామం పెట్టారు. ఒకరు ఇద్దరు కార్యాలయం ఉద్యోగులు తప్ప మిగతా ఏ విభాగంలో సిబ్బంది లేక కుర్చీలు విలవిలబోయాయి.

## నీట్-పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు
- 19 కేంద్రాల్లో 7,357 మంది అభ్యర్థులు..




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 (జనంసాక్షి) :** నీట్ – పీజీ 2026 పరీక్షను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో నీట్--పీజీ పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆగస్టు 30న నీట్--పీజీ 2026 పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకే షిఫ్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7,357 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కీసర, మల్కాజిగిరి డివిజన్ల ఆర్‌డీఓలు పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నేషనల్ బోర్డ్ సూచించిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ఫ్రిస్కింగ్, ఎస్కార్ట్ సదుపాయాల కోసం మల్కాజిగిరి, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య కిట్లు, అంబులెన్స్ సదుపాయాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టీఎస్‌ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల రాకపోకలకు తగినన్ని బస్సులు నడపాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అధికారులు తాగునీటి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు వీల్‌చైర్ సౌకర్యం కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అవసరమైన చోట్ల అగ్నిమాపక సిబ్బందిని మోహరించి భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఫైర్ అధికారికి సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## బీఎల్‌ఓల పెండింగ్ రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



**శామీర్‌పేట్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** మూడుచింతలపల్లి మండలంలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) విధులు నిర్వహించిన సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న రెమ్యునరేషన్‌ను తక్షణమే విడుదల చేయ్యాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు జి.సునీత డిమాండ్ చేశారు. గురు వారం మండల రెవెన్యూ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలనతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన బాధ్యతలను సకాలంలో నిర్వర్తించి నప్పటికీ, గత మూడేళ్లకు సంబంధించిన రెమ్యునరేషన్ ఇప్పటికీ అందకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్ బకాయిల వివరాలను పరిశీలించి నిధులను వెంటనే విడుదల చేయాలని, బీఎల్‌ఓల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయ్యాలని కోరారు. చెల్లింపుల గడువుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంజుల, సంధ్యారాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## సీఎం భాష మార్చుకోవాలి

**హైదరాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అనే విషయాన్ని మరిచిపోయి గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని తలసాని విమర్శించారు. కరోనా సమయంలో ఆక్సిజన్, బెడ్లు అందుబాటులో లేక ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాల కోసం నాటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం సనత్‌నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఆయా ఆస్పత్రుల పనులు 60 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను తామే నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం అవివేకమని అన్నారు. ఆస్పత్రిలో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే విషయాన్ని మరిచి వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల సమక్షంలో సీఎం నోటికొచ్చినట్లు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడితే.. వాటికి రేవంత్‌రెడ్డి రిబ్బన్ కటింగ్‌లు చేస్తున్నారని తలసాని ఎద్దేవా చేశారు. ఎదుటివారి పట్ల గౌరవం, సంస్కారం లేకుండా మాట్లాడటం మానుకోవాలని సూచించారు.

కమిషన్ల కోసమే 22-ఏ

### పేదల ఇళ్లు, ప్రైవేట్ భూములను 22-ఏలో చేర్చే అధికారం ఎవరిచ్చారు..?

కమిషన్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22-ఏ నిబంధనను తీసుకొచ్చిందని తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. పేద ప్రజల ఇళ్లు, ప్రైవేట్ భూములను 22-ఏలో చేర్చే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 22-ఏను అడ్డుపెట్టుకుని భూముల యజమానులను భయపెట్టి 30 శాతం నుంచి కమిషన్లు వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని



నిలదీశారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం తప్పిదాలు చేసి, ఆ నెపాన్ని అధికారులపై నెట్టి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేషన్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గందే నాగులు, టి. శ్రీహరి, కిషోర్, దాడి ప్రవీణ్‌రెడ్డి, లక్ష్మీపతి, ప్రేమ్, కొండాపురం మహేష్‌యాదవ్, శేఖర్, ఆరీఫ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, అబ్బాస్, నాగలక్ష్మి, కౌసల్య, సీమ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వికాసానికి విద్య దోహదపడాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 20 (జనం సాక్షి) :** విద్యార్థుల వికాసానికి చదువు దోహదపడాలంటే పిల్లల మానసిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో కలెక్టర్ పాల్గొని ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఎఫ్ఎల్ ఎన్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, విద్యకు సంబంధించిన వివిధ అంశాలపై ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరిగేలా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులను ప్రయోగపూర్వకంగా బోధనోపకరణాలను తయారుచేసి, ఏఐ వంటి సాంకేతికతను వినియోగించి బోధించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తన, పాఠ్యాంశాలను అర్థం చేసుకునే తీరు గమనిస్తూ ఉండాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చదువులో వారు రాణించేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు ఇంకా పెరగాలని, యుడైస్‌లో విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్



చేయాలని ఆదేశించారు. పోషణ్ యాప్‌లో నమోదు చేసే వివరాలు పక్కాగా ఉండాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు తప్పనిసరిగా పేర్కొన్నారు. అవసరమైన పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించామని, అన్ని విద్యాసంస్థల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ కార్యకలాపాలన్నీ పకడ్బందీగా జరిగేందుకు ఉపాధ్యాయులు అందరూ తమ వంతుగా సహకరించాలని,వివిధ విద్యాంశాల్లో జిల్లా ర్యాంక్ మెరుగుపడేలా తోడ్పడాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌ఎల్‌ఎన్ రాష్ట్ర పరిశీలకులు అభిషేక్, డిఈఓ విజయలక్ష్మి, గద్వాల ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు విష్ణు, సిఆర్పి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, ఆగస్టు 20 (జనం సాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని .. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ దేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట తో పాటు బూరుగుపల్లి లక్ష్మాపూర్ గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. బూరుగుపల్లి గ్రామంలో ఆహార ధాన్యాల గోదాము నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైతుల సంక్షేమం గ్రామీణ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. బూరుగుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 30 లక్షల రూపాయలతో ఆహార ధాన్యాల నిల్వ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను నిలువ చేసుకునేందుకు ఈ గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయని, వర్షాలు ఇతర ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం పాడవకుండా రక్షణ లభిస్తుందని వివరించారు. పెద్ద శంకరంపేటలోని మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులు అర్పించారు. భారతదేశాన్ని ఆధునిక



యుగం వైపు నడిపించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రస్తుతం దేశంలో యువత అనుభవిస్తున్న టెలికాం కంప్యూటర్ ఐటీ విప్లవానికి నాంది పలికిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్, మురళి పంతులు ఆర్ఎన్ సంతోష్ కుమార్, సుభాష్ గౌడ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్. పేట సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్. ఉపసర్పంచ్ రాజు గౌడ్. ఆయా గ్రామాల సర్పంచ్ లు. నాయకులు శ్రీనివాస్ వెంకట్రావు. సుభాష్ కుంట్ల రాములు.. తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయం




**షాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** శాంతి భద్రతల పరిరక్షణ దేయంగా విధులు నిర్వహిస్తున్న అధికారులకు మేము ఎప్పుడు తోడుగా ఉంటామని కొమరబండ మాజీ సర్పంచులు ఏశాల చంద్రశేఖర్, ఆవంచ దేవేందర్ రెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ లక్ష్మిరెడ్డి, ఎస్సై చిన్నారెడ్డి ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాంతి భద్రతల పట్ల పోలీసు వారితో అనునిత్యం సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మెత్తల మహేందర్, గిర్మని కుమార్ పాల్గొన్నారు.

# ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

**ముషీరాబాద్, ఆగస్టు 29 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్దగల ధర్నా చౌక్ లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్ అధ్యక్షత న ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యోగ ఖాళీలపై సర్వేలు నిర్వహించి, నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ సమస్యపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. యువత ఎన్నో ఆశలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రెండు కోట్ల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి అందించాలని కోరారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడు నరేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఉద్యోగాల విషయంలో నిరుద్యోగులను నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని ఆశించి ఓట్లు వేసిన నిరుద్యోగులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చినా అమలు దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. మహేందర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.డీ. జావేద్ మాట్లాడుతూ గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం కోర్టు వివాదాలకు దారితీసే విధంగా నోటిఫికేషన్లు జారీ చేసి నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం



రెండు కోట్ల ఉద్యోగాల హామీతో ప్రజల నుంచి ఓట్లు పొందిందని, కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, కే.ఎన్. రాజన్న, ఎం. మహేందర్, జిల్లా కమిటీ సభ్యులు జె. కుమారస్వామి, జి. కిరణ్, జి. నరేష్, సి. మల్లేష్ తదితరులు నాయకత్వం వహించారు.

# పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలి

- ఎస్ఐఆర్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా ఎలక్ట్రోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 20 (జనం సాక్షి) :** కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సంబంధిత అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని వ్యవసాయ, సహకార శాఖల రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరోల్ అబ్జర్వర్ సురేంద్రమోహన్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో ఎస్ఐఆర్ పై జిల్లా ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి పరిశీలకులు ప్రసంగించారు. అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు ఓటరుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా కాపీలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినందున బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో క్షేత్రస్థాయిలో సంబంధిత ఎన్నికల అధికారులకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇది మొదటి పర్యటనగా పేర్కొంటూ, మరో పర్యటనలో పోలింగ్ స్టేషన్లను కూడా సందర్శిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అప్పట్లోగా జిల్లా ఎన్నికల అధికారులు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ ముందుకెళ్లాలని ఈ సందర్భంగా పరిశీలకులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.25 లక్షల మంది ఓటర్లు అనామలీస్ జాబితాలో ఉన్నారని తెలిపారు. మ్యాపింగ్ జరగని ఓటర్లు 22,000 గా పేర్కొంటూ వీరందరికీ నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. మండలాలతో పాటు మున్సిపాలిటీలలో ఏఈఆర్వోలు నిర్దేశిత తేదీల్లో అవసరమైన ఓటర్లందరికి నోటీసులు ఇచ్చేందుకు టామ్ టామ్ చేయించడం, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం ఇస్తామన్నారు. సంబంధిత ఎన్నికల అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ఓటర్లందరూ ఓటు హక్కును కలిగి ఉండేందుకు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కూడా పూర్తి కావడంతో జిల్లాలో ప్రస్తుతం 594 పోలింగ్ బూత్ లు ఉన్నాయన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎస్ఐఆర్ ను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులతో తరచూ గూగుల్ మీట్ లు, ఇతర సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే క్రమం తప్పకుండా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం పరిశీలకులు మండలాల, మున్సిపాలిటీల వారీగా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యకలాపాలపై సమీక్షించారు. అంతకుముందు పరిశీలకులు కలెక్టర్ తో కలిసి ఉద్యానవన, సహకార శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలపై ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

- ప్రజా పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం
- యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- ఫర్టిలైజర్స్ షాప్‌ల చుట్టూ రైతుల పడి గాపులు
- రాష్ట్ర ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహం




**మనోహరాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** మనోహరాబాద్ లో యూరియా కోసం జాతీయ రహదారి పై రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. యూరియా సరఫరాలో నూతన యాప్‌ల పేరు చెప్పి ఎరువులు అందకుండా చేయటం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు యూరియా సరఫరా లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం ఫర్టిలైజర్ షాపుల చుట్టూ రైతులు పడి కాపులు కాయాల్సిన దుస్థితి రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకంగా రైతులు నినాదాలతో హోరెత్తించారు తక్షణమే యూరియాను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రజాప్రాలనలో రైతులను ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిరసన కారణంగా వాహనాలు ఎక్కడి అక్కడ నిలిచిపోయాయి.

## పాలిటెక్నిక్ అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**సంగారెడ్డి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** శక్తి (యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ)లో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను విలీనం చేయాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి ఆధ్వర్యంలో 15 మంది సిబ్బంది మధ్యాహ్నం 2 గంటల నుంచి 2.20 గంటల వరకు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. 'శక్తిని తొలగించాలి – పాలిటెక్నిక్‌ను కాపాడాలి' అంటూ నినాదాలు చేశారు. జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను శక్తి పరిధిలో విలీనం చేయకూడదని డిమాండ్ చేశారు. పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించే పాలిటెక్నిక్ కళాశాలలను పరిరక్షించాలని, శక్తిని ప్రత్యేక ఉపాధి ఆధారిత నైపుణ్య కేంద్రంగా స్వతంత్రంగా కొనసాగించాలని కోరారు.

# రీ సర్వే పారదర్శకంగా, కచ్చితత్వంతో చేపట్టాలి

- విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలి
- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి) :** జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరచింత, పెద్దమందడి మండలాల్లో పర్యటించిన ఆయన భూముల రీసర్వే ప్రక్రియతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమరచింత మండలం చింతరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి రీసర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూముల సరిహద్దులు, రికార్డులు తదితర అంశాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా, కచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

### మైనారిటీ గురుకుల పాఠశాలలో తనిఖీ

అనంతరం పెద్దమందడి మండలం జగత్పల్లిలోని మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వసతి గృహం, భోజనశాలను పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న వసతులు, రోజువారీ నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచి, పౌష్టికాహార ప్రమాణాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని హాస్టల్ నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల, వసతి గృహంలోని అన్ని వసతులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**మెదక్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం తొగిట గ్రామంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ జీవ ఎరువుల పంపిణీ మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గ్రామం సమీపంలో గల రామానాయుడు ఎకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం కేవీకే, తునికి ఆధ్వర్యంలో యుఎన్‌డిపి బయోఫిన్ ప్రాజెక్టు కింద మెదక్ జిల్లా,హవేలీ గన్‌పూర్ మండలం తోగిట గ్రామంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన శిక్షణ కార్యక్రమంతో పాటు జీవ ఎరువుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎం. శ్రీనివాస్, శాస్త్రవేత్త హార్టికల్చర్, కేవీకే మెదక్, ఉద్యాన పంటల్లో సమగ్ర పురుగుల యాజమాన్యం ఐపీఎం మరియు సమగ్ర పోషక యాజమాన్యం ఐ ఎన్ ఎం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎం. శ్రీకాంత్, శాస్త్రవేత్త, కేవీకే మెదక్, సేంద్రియ వ్యవసాయంలో జీవ ఎరువుల ప్రాధాన్యత, వరి మరియు కూరగాయల పంటల్లో జీవ ఎరువుల వినియోగ విధానాలను రైతులకు ప్రదర్శించి వివరించారు. జీవ ఎరువుల వినియోగం ద్వారా భూసారం, సూక్ష్మజీవుల చురుకుదనం పెరిగి పంటల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు జీవ ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 50 మంది రైతులు, ఎఫ్ పి ఓ చైర్మన్ యన్ శ్యామ్ సుందర్,సర్పంచ్ సౌమ్య శశికాంత్ , మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డా. రామానాయుడు ఎకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం, తునికి, మెదక్ వారు యు ఎన్ డి పి బయోఫిన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం

- డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి
- మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు విగ్రహానికి ఘన నివాళులు



**సంగారెడ్డి ఆగస్టు 20 (జనం సాక్షి) :** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను ఆమె స్మరించుకున్నారు. దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ, సమాచార సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల విస్తరణకు రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలు భవిష్యత్ భారత నిర్మాణానికి బాటలు వేశాయని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి కీలక నిర్ణయాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ కృషి చేశారని ఆమె గుర్తుచేశారు. దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, కౌన్సిలర్ లు గడ్డం రాజు, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బాలికను వేధించిన నిందితుడికి మూడేళ్ల జైలు

- రూ.20 వేల జరిమానా
- జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 20 (జనం సాక్షి) :** బాలికను వేధిస్తూ, అసభ్యకరమైన ఫొటోలు పంపాలని కోరడంతోపాటు బెదిరింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించిందని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం.. దాసరి స్వామి (26) అనే వ్యక్తి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ఫోన్ నంబర్ ఇవ్వాలని తరచూ వేధించేవాడు. బాలిక స్నేహితుల వద్ద నుంచి ఆమె నంబర్ తీసుకుని ఫోన్ చేసి, పాఠశాల వద్దకు వస్తానని, తనను కలవాలని ఒత్తిడి చేసేవాడు. బాలిక అతడిని కలవకుండా ఇంటికి వెళ్లడంతో "నువ్వు రాకపోతే పెట్రోల్ పోసుకుని చచ్చిపోతా" అంటూ బెదిరించాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో ఇకపై బాలిక జోలికి రానని నిందితుడు రాతపూర్వకంగా హామీ ఇచ్చాడు. అయితే రెండేళ్ల తర్వాత వేసవి సెలవుల్లో మళ్లీ బాలికకు తన స్నేహితురాలిగా వాట్సాప్‌లో రెండు రోజులపాటు సందేశాలు పంపించాడు. అనంతరం ఇన్‌స్టాగ్రామ్‌లో తనకు నగ్న చిత్రాలు పంపాలని కోరుతూ బాలికను వేధించాడు. 24-05-2024న బాలిక తండ్రికి ఫోన్ చేసి తన కుమార్తెను ఇంటికి పంపాలని, లేకపోతే ఆమె మేజర్ అయిన తర్వాత లేపుకుపోతానంటూ బెదిరించాడు.బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శివంపేట పోలీసులు అప్పటి ఎస్ఐ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి పూర్తి సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు, కోర్టు వ్యవహారాల్లో కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కృష్ణగౌడ్, సీడీఓ ఆనంద్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## కన్నాన్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్‌పై సమగ్ర సర్వే చేయాలి

- కలెక్టర్‌కు గ్రామ యువకుల ఫిర్యాదు



**జోగిపేట, ఆగస్టు 20 (జనం సాక్షి) :** కన్నాన్‌పల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపల చెరువులు, మట్టి తవ్వకాలు, కాలువల నిర్మాణం, ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపు జరుగుతున్నాయంటూ గ్రామ యువకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు అసలు హద్దులు, శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధి, సంబంధిత సర్వే నంబర్లను అధికారికంగా నిర్ధారించాలని కోరారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. చెరువు నుంచి ప్రైవేట్ చేపల చెరువులకు నీటి తరలింపునకు అనుమతులు ఉన్నాయా, కాలువలు, మోటార్ల ఏర్పాటుకు నిబంధనలు పాటించారా అనే అంశాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెరువు హద్దులను గుర్తించి హద్దు రాళ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు.

# నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

- భూత్పూర్ సర్కిల్ కార్యాలయం వార్షిక తనిఖీ నిర్వహించిన
- జిల్లా ఎస్పీ డి.జానకి




**భూత్పూర్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు. గురువారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగాఎస్పీ పరిశీలించి, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు తదితర అంశాలను సమీక్షించారు. ఇన్‌స్పెక్టర్ స్థాయిలో దర్యాప్తు చేస్తున్న కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి, నాణ్యమైన ఆధారాలతో కేసులను కోర్టులో సమర్థవంతంగా నిరూపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు.సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల వారీలతో క్రమం తప్పకుండా నేర సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న నేరాలపై విశ్లేషణ చేయాలని సూచించారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, పాత నేరస్తులు, రౌడీషీటర్లు మరియు అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం మరింత పెరిగేలా బాధ్యతాయుతమైన, ప్రజా అనుకూల పోలీసింగ్‌ను కొనసాగించాలని తెలిపారు. మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూత్పూర్ సర్కిల్ పరిధిలో భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్, దేవరకద్ర, సీసీ కుంట పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, వీటి పరిధిలో చీఎ-44 భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్ మీదుగా, చీఎ-167 దేవరకద్ర, సీసీ కుంట మీదుగా వెళ్తున్నందున జాతీయ రహదారులపై నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. అదేవిధంగా బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఈ వార్షిక తనిఖీలో భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, భూత్పూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగన్న, భూత్పూర్ సబ్ ఇన్‌స్పెక్టర్-2 విద్యా, అడ్డాకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళి, దేవరకద్ర సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శక సేవలందించాలి

- డీఐజీ అంబర్ కిషోర్ ఝా
- మహదేవపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయ తనిఖీ



**మహదేవపూర్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** ప్రజలకు పారదర్శక సేవలందించాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని కాళేశ్వరం జోన్ డిఐజి అంబర్ కిషోర్ ఝా సమగ్ర తనిఖీ నిర్వహించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా కాళేశ్వరం జోన్ డిఐజి అంబర్ కిషోర్ ఝా మహదేవపూర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయాన్ని సమగ్ర తనిఖీ చేసి కార్యాలయ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరుపై సిబ్బంది టర్న్ అవుట్ క్రమశిక్షణ, యూనిఫామ్ నిర్వహణ, తదిత అంశాలను డీఐజీ క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ డిఐజికి ఘనస్వాగతం పలికారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో ముఖాముఖిగా సమావేశం ఏర్పాటుచేసి పోలీస్ వారి విధి నిర్వహణ పనితీరు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో సిసిటీవీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సీసీటీవీ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణతోపాటు ప్రజల భద్రతను మరింత బలోపితం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డిఐజి అంబర్ కిషోర్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సమర్థవంతమైన జవాబుదారితనంతో కూడిన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల నివారణ విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు ,ట్రాఫిక్ నియంత్రణ ,రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని మహిళలు చిన్నారులు వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా సేవలందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్. డీఎస్పీ సూర్యనారాయణ సీఐ వెంకటేశ్వర్లు. ఎస్సై సాంబమూర్తి ఉన్నారు.

# అర్హులందరికీ పెన్షన్లు అందిస్తాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల పై అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో ఇప్పటివరకు అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రగతి నివేదికను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 289 మందికి నెలకు రూ.6.92 లక్షల మేర పెన్షన్లు అందుతున్నాయన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మించాలని, స్మశానవాటిక ఏర్పాటు చేయాలని, మహిళా సంఘాలకు వీఓ భవనాలు నిర్మించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. పాఠశాల ప్రాంతంలో వీఓ భవనం నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు.

**నీటి సంరక్షణ, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి**

జలసిరి కార్యక్రమం కింద ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రతి పొలంలో ఫామ్ కుంటలు నిర్మించుకోవాలని రైతులకు సూచించారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. తిమ్మాపూర్ గ్రామంలో కొత్తగా 14 ఫామ్ కుంటలు మంజూరైనట్లు తెలిపారు.

**అర్హులందరూ పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి**

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ బాధితులు, తలసేమియా బాధితులు, దివ్యాంగులు తదితర అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో సర్పంచ్లు కేశాపూర్ మోత్కుపల్లి శ్రీకాంత్ రెడ్డి .బొంత రమేష్ ముప్పు మానస మహేందర్, చక్రవర్తి స్రవంతి రాజు రవీందర్ద్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ సీఈవో , జిల్లా అధికారులు, వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హైరిస్క్ లక్షణాలున్న గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- మాతృ మరణాలపై డీఎంహెచ్ఓ సమీక్ష



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 20 (జనం సాక్షి) :** క్రమం తప్పకుండా గర్భిణీలకు పరీక్షలు,హై రిస్క్ లక్షణాలున్న వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా మాతృ మరణాలను నివారించవచ్చని హనుమకొండ డీ ఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయం లో ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన 3 మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ విశ్లేషణల ద్వారా కారణాలను తెలుసుకుని ,లోపాలను గుర్తించి ,ఇక ముందు మాతృ మరణాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవచ్చని అభిప్రాయ పడ్డారు.ఒక్కో కేసును గైనకాలజిస్ట్, అనెస్థటిస్ట్, వైద్యాధికారి, సూపర్వైజర్, ఏఎన్ఎం లు,ఆశాలతో గర్భిణి నమోదు,ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో చెకప్ లు, 108 సేవలు,ఉన్నత స్థాయి ఆసుపత్రిలో అందించిన సేవలు, మరణం నివారించ గలిగినదా లేదా వంటి పలు అంశాలను చర్చించారు. గర్భ నిర్ధారణ జరిగిన మొదటి త్రైమాసికం లోనే పేరు నమోదు చేయాలని, వైద్యాధికారి 2 చెకప్ లు,3వ 4 వ చెకప్ లు అనుసంధానించిన జీఎంహెచ్ లాంటి ప్రత్యేక నిపుణులున్న ఆసుపత్రిలో తప్పని సరిగా చేపించడం ద్వారా ఇలాంటి సమస్యలు నివారించవచ్చని నిపుణులు అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓడాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి పరకాల అనస్తటిస్ట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధి కారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ మునీర్, డాక్టర్ హైదర్ , జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మి, డాక్టర్ మౌనిక, హెల్త్ సూపర్వైజర్లు పద్మజ ,మరియా థామస్, అమృత సంబంధిత ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

- 'జనంసాక్షి' కథనానికి స్పందన..
- గ్రంథాలయాన్ని మరింత బలోపేతం చేస్తామని హామి..
- మౌలిక వసతులపై ఆరా..






**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించారు. వినూత్నంగా గోడలకు పేయింట్ వేసిన గ్రంథాలయంపై ఇటీవలె "గోడలపైనే జ్ఞానం.." పేరుతో 'జనంసాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. కాగా స్పందించిన కలెక్టర్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించి, గోడలపై ఉన్న పేయింటింగ్ ను పరిశీలిస్తున్నారు. గ్రంథాలయానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేసి, మరింత బలోపేతం చేస్తామని హామి ఇచ్చారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, డిజిటల్ లైబ్రరీ ఏర్పాట్లు, మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. మీరు ఏయే ఉద్యోగాల సాధనకు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు, సన్నద్ధతకు అవసరమైన పుస్తకాలు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా చదువుతూ, నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా సూచించారు. అభ్యర్థులకు అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచడంతో పాటు కంప్యూటర్స్ సదుపాయం, ఆర్ఓ వాటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంథాలయాలను మరింత బలోపేతం చేసేందుకు, అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులు క్రమశిక్షణతో చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిరంతర సాధనతో పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం గ్రంథాలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



## ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

**జైనూర్, ఆగస్టు20 (జనం సాక్షి) :** జైనూర్ మండలం గూడమామడ గ్రామంలో బుధవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఉప సర్పంచ్ సలీం తనయుడు రహేల్ మృతి చెందారు.విషయం తెలుసుకున్న కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క గురువారం గూడమామడ గ్రామంలోని రహేల్ నివాసానికి వెళ్లారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ తో కలిసి రహేల్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రహేల్ మృతి పట్ల ఆమె తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు పెందోర్ ప్రకాష్, ఆర్జీఎస్ జిల్లా కోర్డినేటర్ కోవ ఇందిరా,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ రషీద్,సర్పంచుల సంఘం అధ్యక్షులు మాడవి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో ఫారెస్ట్ ట్రైనింగ్ అధికారుల సందడి



**వెంకటాపూర్(రామప్ప),ఆగస్టు20(జనం సాక్షి):** వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని గురువారం ఫారెస్ట్ ట్రైనింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి ఆధ్వర్యంలో ట్రైనీ అధికారులు సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలకగా, వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వ ఈవో ఇమ్మడి భాస్కర్,డిప్యూటీ రేంజ్ ఆఫిసర్ మధుబాబు, ఫారెస్ట్,దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# మెడికల్ కాలేజీకి 'పెద్ది' పేరు పెట్టాలి

- బిఆర్ఎస్ డిమాండ్



**నర్సంపేట ఆగస్టు 20 (జనం సాక్షి) :** నర్సంపేట అభివృద్ధి ప్రదాత పెద్ది సుదర్శన్ రెడ్డి పై కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజమైన గౌరవం, చిత్తశుద్ధి ఉంటే విగ్రహాల రాజకీయాలు చేయకుండా నర్సంపేట మెడికల్ కళాశాల, జిల్లా ఆసుపత్రికి ఆయన పేరు పెట్టాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు ఘటనలో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేకపోతే స్థానిక వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త పొన్నాల ప్రకాష్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేయడం ఎలా జరిగిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బి ఆర్ టి ఎస్ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు రాయిడి కీర్తి దుశాంత్ రెడ్డి, మండల శ్రీదేవి శ్రీనివాస్, శివరాత్రి స్వామి, దోమ్మటి రమ్య సంతోష్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, మాజీ కౌన్సిలర్ నాగిశెట్టి ప్రసాద్, బండి ప్రవీణ్, పెండం వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి రాంప్రసాద్, నాయిని వేణుచంద్, సంపంగి సాలయ్య, మంద ప్రసాద్, పైసా ప్రవీణ్, బైరి నాగరాజు, మోతే తిరుపతి రెడ్డి, బీరం నాగిరెడ్డి, బొల్లెపెల్లి కమల్, పల్నాటి సందీప్, వాసం నాగరాజు, సుందరగిరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్‌పై దాడి కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

- భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు



**చిట్యాల, ఆగస్టు 20( జనం సాక్షి):** చిట్యాల మండల కేంద్రానికి చెందిన ఆర్‌బీ (=డీ) న్యూస్ రిపోర్టర్ చిరు అలియాస్ రవీందర్‌పై ఇంట్లోకి చొరబడి దాడి చేసి, ఇంటి సామాగ్రి ధ్వంసం చేసిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కైలాపూర్ గ్రామ శివారులో నిందితులను అదుపులోకి తీసుకుని, దాడికి ఉపయోగించిన ఒక స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు వెల్లడించారు. అనంతరం నిందితులను న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి పరకాల జైలుకు తరలించారు. ఈ సందర్భంగా డిఎస్పి సంపత్ రావు మాట్లాడుతూ చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన బొజ్జం వేణుకు, అబ్బెంగుల రాజయ్యకు మధ్య నవాబుపేట శివారులోని భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ వివాదంపై రిపోర్టర్ రవీందర్ కథనాలు ప్రసారం చేస్తూ, సోషల్ మీడియా గ్రూపులలో ప్రచారం చేస్తున్నాడనే కక్షతో వేణు అతనిపై పగ పెంచుకున్నాడు.ఈ క్రమంలో ఆగస్టు 17న భూపాలపల్లిలోని మెడికల్ కాలేజీ సమీపంలో జరిగిన ఒక వెంచర్ ప్రారంభోత్సవం అనంతరం, బొజ్జం వేణు తన స్నేహితులతో కలిసి మందు పార్టీ చేసుకొని రిపోర్టర్‌పై దాడి చేసేందుకు పథకం వేశాడు. అదే రోజు రాత్రి వేణు తన మేనమామ మెంగని నటరాజ్‌ను కలుపుకుని, మరో రెండు కార్లలో మొత్తం ఎనిమిది మంది నిందితులతో కలిసి చిట్యాలలోని రవీందర్ ఇంటికి చేరుకున్నారు. రవీందర్ తలుపు తీయగానే ఇంట్లోకి చొరబడి విచక్షణారహితంగా కొట్టి, గొంతు నులిమి, తలను గోడకేసి కొట్టడంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. అడ్డుకోబోయిన అతని భార్యను బెదిరించి, ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, గ్యాస్ స్టవ్ మరి కొన్ని వస్తువులు ధ్వంసం చేసి అక్కడి నుంచి పారిపోయారు.దాడి అనంతరం పరారీలో ఉంటూ వివిధ ప్రాంతాల్లో తప్పించుకు తిరుగుతున్న ఈ నిందితులను చిట్యాల ఎస్సై సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని పరకాల జైలుకు తరలించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితులైన మధువంశి, మహేష్, రాజేష్, ప్రశాంత్, ఆరిఫ్‌ల కోసం దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భౌతిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో చిట్యాల సీఐ డి. మల్లేష్, చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**కాసిపేట ఆగస్టు 20 (జనంసాక్షి) :** విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలలో ఆయన పర్యటించారు. కస్తూరిబా గాంధీ, బాలికల విద్యాలయాన్ని, మరియు రేగులగూడ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే చర్యలలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని తెలిపారు. అదనంగా నిర్మిస్తున్న గదులు, భోజనశాల పనులను త్వరగా పూర్తి చేయాలని, వంటశాలలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, విద్యార్థుల గైర్హాజరును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన/ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు, బోధన విధానంపై వివరాలు తెలుసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, పల్లంగూడ సర్పంచ్ దుస్సా విజయ చందు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్-కాజీపేట రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించాలి

- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీల సమీక్ష



**కాజీపేట ఆగస్టు 20 ( జనం సాక్షి) :** వరంగల్–కాజీపేట రైల్వే అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలోని సమన్వయ్ సమావేశ మందిరంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అధ్యక్షతన నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే ఎంపీల సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే రంగ అభివృద్ధికి సంబంధించిన 19 కీలక అంశాలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్ – కాజీపేట ప్రాంతం దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత కీలకమైన రైల్వే కేంద్రంగా ఉందని, ప్రయాణికుల రద్దీతో పాటు బొగ్గు, సిమెంట్, ఎఫ్‌సీఐ, ఎరువులు, గ్రానైట్ తదితర పారిశ్రామిక సరుకు రవాణాలో ఈ ప్రాంతం గణనీయమైన పాత్ర పోషిస్తోందని ఎంపీ డా. కడియం కావ్య వివరించారు. ఈ ప్రాంతానికి రైల్వే పరంగా మరింత ప్రాధాన్యత కల్పించి, మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. రైల్వే జోన్ల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లు కొత్తగా ఏర్పడనున్న విశాఖపట్నం జోన్‌కు వెళ్లే పరిస్థితిలో దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే మిగిలే అవకాశం ఉందని ఎంపీ వివరించారు. ఈ నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయడం అత్యంత ప్రాధాన్యమని ఎంపీ పేర్కొన్నారు. కాజీపేట–వరంగల్ ప్రాంతం భారీ సరుకు రవాణా ఆదాయాన్ని అందిస్తున్న కీలక రైల్వే హబ్ అని, సుమారు 48.6 శాతం వరకు సరుకు రవాణా ఆదాయంలో ఈ ప్రాంతం వాటా ఉందని తెలిపారు. కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు, రైల్వే లింక్, ఇతర మౌలిక వసతుల పనుల ప్రస్తుత స్థితిని ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ పూర్తిస్థాయి ఉత్పత్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఏ రకమైన కోచ్‌లు లేదా రైల్వే యూనిట్లు తయారు చేయనున్నారు, ఈ ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఉద్యోగాలు లభిస్తాయి, కాజీపేట–వరంగల్ ప్రాంత యువతకు ఎలాంటి ఉద్యోగ, నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పిస్తారనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. వాగన్ వర్క్‌షాప్ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌లను దాటేందుకు రోడ్ ఓవర్ బ్రిడ్జి/ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి స్థానిక ప్రజల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరో రెండు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, భవిష్యత్ పారిశ్రామిక మరియు రైల్వే ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకుని కాజీపేట టౌన్ స్టేషన్‌కు దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కోరారు. స్టేషన్‌ను ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ముఖ్యమైన రైళ్లకు కాజీపేట టౌన్‌లో హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేటలో ఉన్న పిట్‌లైన్లు, నిర్వహణ సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా కాజీపేట నుంచి మరిన్ని ఆరిజినేటింగ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. అలాగే ప్రస్తుతం వారంలో ఐదు రోజులు మాత్రమే నడుస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజూ నడపాలని కోరారు. దీనివల్ల తిరుపతి వెళ్లే భక్తులు, ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలగడంతో పాటు రైల్వే ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. కాజీపేట రైల్వే సబ్–డివిజనల్ ఆసుపత్రి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీ కోరారు. పెండింగ్‌లో ఉన్న మొదటి అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. గైనకాలజిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్ తదితర స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలి. అవసరమైన వైద్య, సహాయక సిబ్బందిని నియమించాలి. లాలాగూడ రైల్వే ఆసుపత్రి తరహాలో క్లినికల్ ల్యాబ్, డయాగ్నస్టిక్ పరికరాలను ఆధునీకరించాలి. ఇన్‌పేషెంట్, సర్జికల్, ఎమర్జెన్సీ సేవలను ఏర్పాటు చేయాలి. మెరుగైన వైద్య సేవల కోసం టెర్షియరీ కేర్ ఆసుపత్రులతో రిఫరల్/ఎంప్యానెల్‌మెంట్‌ను విస్తరించాని ఈ పనులకు అవసరమైన నిధులను కేటాయించి అభివృద్ధిని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ కోరారు.

## సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పని తీరు బాగుంది

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట, ఆగస్టు 20 (జనంసాక్షి) :** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని , మార్కెట్ కమిటి ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి యాక్టివ్ గా పని చేస్తున్నారని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ లో రూ. 3.86 కోట్లతో చేపట్టనున్న గాల్ వ్యాల్యూమ్ షెడ్డు, రూఫ్ టాప్ సోలార్ పీవీ పవర్ ప్లాంట్, క్యాటిల్ ర్యాంప్స్, ఇతర అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ నందు రైతులకు ఉచితంగా అల్పాహారం, రూ.5లకే మధ్యాహ్న భోజన వసతి కల్పించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రికి చెప్తానని అన్నారు. మార్కెట్ లో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి ఏకరూప దుస్తులు అందజేయడం, కూల్ వాటర్ సౌకర్యం కల్పించడం పట్ల అభినందనలు తెలిపారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ పని తీరు బాగుందని, తాను మరలా ఒకసారి వచ్చి మార్కెట్ ను పరిశీలిస్తానని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో అభివృద్ధి పనుల కోసం 95 లక్షల రూపాయలు అందజేస్తామని, మామిడి మార్కెట్ కు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సెక్రటరీ ఫసియుద్దిన్, ఆర్డీఓ వేణుమాధవ్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్లలో గంజాయి ముఠాపై పోలీసుల ఉక్కుపాదం

- ఆరుగురు నిందితుల అరెస్ట్
- 2 కిలోల గంజాయి స్వాధీనం

**హుజూర్‌నగర్ క్రైం, ఆగస్టు 20 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు గతంలో గంజాయి వినియోగించిన మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మొత్తం ఆరుగురు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. దాచారం గ్రామ శివారులోని ఎన్‌ఎస్‌పి కాలువ వద్ద గంజాయితో అనుమానాస్పదంగా ఉన్న ఇంజమూరి రోహిత్ అలియాస్ దినేష్, కందుల శ్రీరాం లను నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 2 కిలోల గంజాయి లభించడంతో పాటు ఒక సెల్‌ఫోన్, ఒక మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి విక్రయించేందుకు తీసుకెళ్తున్నారు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ఇంజమూరి రోహిత్ గంజాయిని కొనుగోలు చేసి కందుల శ్రీరాం కు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఇద్దరిని ప్రధాన నిందితులుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఇదే సమయంలో గంజాయి విక్రయాలు, వినియోగంపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి గతంలో గంజాయి సేవించిన



మరో నలుగురిని కూడా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారికి సంబంధిత పరీక్షలు నిర్వహించగా గంజాయి వినియోగించినట్లు నిర్ధారణ కావడంతో వారిని డీ-అడిక్షన్ కేంద్రానికి పంపించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీయడంతో పాటు కుటుంబాలపై, సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మాదకద్రవ్యాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు, సరఫరా, వినియోగానికి పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు నిఘా కొనసాగిస్తున్నామని, ఎక్కడైనా మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, కొనుగోలు చేస్తున్న వ్యక్తులు, విక్రయాల వెనుక ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించి పూర్తి నెట్‌వర్క్‌ను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. నేరేడుచర్ల పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు వాహనాల తనిఖీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా, సమాచారం సేకరణ వంటి చర్యలను ముమ్మరం చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు భయపడకుండా పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం వంటి ముఖ్యమైన అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని పోలీసులు సూచించారు. ఈ కేసులో పట్టుబడిన ఆరుగురి పాత్ర, గంజాయి సరఫరా మార్గాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలు, గంజాయి విక్రయాలకు సంబంధించిన నెట్‌వర్క్‌పై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజ్జె చరమంద రాజు, హుజూర్‌నగర్ ఎస్‌ఐ చలికంటి నరేష్ , నేరేడుచర్ల ఎస్‌ఐ గోపాల్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. నేరేడుచర్ల పోలీసుల చర్యలతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా మరింత కఠినతరం చేసినట్లు స్పష్టమవుతుంది. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్, నేరేడుచర్ల ఎస్‌ఐలు పోలీసులు పాల్గొన్నారు.

## జీపీఎస్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

- ఉద్దీపకం వర్క్‌బుక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఐటీడీఏ పీవో బి. రాహుల్

**బూర్గంపహాడ్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసాన్ని మరింత బలోపేతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి చిన్నారికి ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలు పూర్తిగా అర్థమయ్యేలా బోధించాలని ఆదేశించారు. గురువారం బూర్గంపహాడ్ మండలంలోని ఉప్పుసాక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని రాజీవ్‌నగర్ జీపీఎస్ పాఠశాలను పీవో రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మమేకమైన ఆయన కొంతసేపు ఉపాధ్యాయుడిగా, అనంతరం విద్యార్థి పాత్రలో వారితో మాట్లాడి ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలపై ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చతుర్వేద ప్రక్రియలు,



గుణకారాలు, భాగహారాలు తదితర అంశాలను వెంటనే సమాధానం చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్దీపకం వర్క్‌బుక్-1, 2 ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని రాహుల్ తెలిపారు. వర్క్‌బుక్-3లో పోటీ పరీక్షలకు ఉపయోగపడే సాధారణ అంశాలతో పాటు మహనీయుల జీవిత చరిత్రలు, వ్యాసాలు, కంప్యూటర్ పరిజ్ఞానం, చంద్రయాన్, రోబోటిక్స్, భారతీయ సంస్కృతి, వ్యవసాయ విధానాలు, అధికారుల వివరాలు వంటి అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా పొందుపరిచినట్లు చెప్పారు. ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థులు స్వయంగా సమాధానాలు నమోదు చేసేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

### ఒక్క విద్యార్థి కూడా బడికి దూరం కాకూడదు

విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని పీవో సూచించారు. ప్రతిరోజూ పిల్లలు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు అవసరమైతే ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లాలని అన్నారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరవుతూ, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్దీపకం వర్క్‌బుక్‌ను కేవలం రాయించడం కాకుండా, అందులోని అంశాలను విద్యార్థులు అర్థం చేసుకుని స్వయంగా రాసేలా వారిని ప్రోత్సహించాలని రాహుల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ శ్రీదేవి, హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి



**కల్లూరు, ఆగస్టు 20 (జనం సాక్షి) :** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, టిజిఐడిసి చైర్మన్ మువ్వ విజయబాబులతో కలసి గురువారం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. దేశంలో ఆధునిక సాంకేతికతకు, యువత అభివృద్ధికి, విద్యా రంగంలో సంస్కరణలకు బలమైన పునాది వేసిన స్వర్గీయరాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం అని ఆ మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నారాయణపురం లోని తన స్వగృహంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకుని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సిపి సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పలు మండలాల తాసిల్దార్లు, పంచాయతీరాజ్ ,మున్సిపాలిటీ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, పోలీస్ తదితర శాఖల అధికారులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పలువురు మున్సిపాలిటీ కౌన్సిలర్లు పలు గ్రామాల సర్పంచులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## నేడు విద్యాసంస్థల బంద్‌కు ట్రస్మ పిలుపు



**నారాయణపేట, ఆగస్టు 20 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా కొండమల్లెపల్లి మండలం జేపి కాలనీలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కె.రూపా రెడ్డిని ఈ నెల 11న అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు అతి దారుణంగా హత్య చేసిన ఘోర సంఘటనను ట్రస్మ నారాయణపేట జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కే.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయడంతో పాటు పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం డీఈఓ గోవిందరాజులను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులలో మార్పు తీసుకుని రావడానికి తల్లిదండ్రులు, సమాజం కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్ కుమార్, ఈసీ నెంబర్ మహేష్, పట్టణ అధ్యక్షులు ఖదీర్ పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై ఆలె నరేంద్ర విగ్రహం ఏర్పాటు చేయాలి

- మాజీ ఎంపీ బుర్ర నర్సయ్య గౌడ్
- ఘనంగా టైగర్ ఆలె నరేంద్ర జయంతి వేడుకలు..

**ముషీరాబాద్ ఆగస్టు 20 (జనం సాక్షి) :** టైగర్ ఆలె నరేంద్ర విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన పోరాట స్ఫూర్తి, ధైర్యం, ప్రజా ఉద్యమాల్లో చేసిన కృషిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందర విజ్ఞాన కేంద్రంలో టైగర్ ఆలె నరేంద్ర 80వ జయంతి వేడుకలు ఘనంగా



నిర్వహించారు. “జీవితమే ఒక సందేశం” అనే నినాదంతో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆలె నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బుర్ర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ టైగర్ నరేంద్ర ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక శక్తి అని కొనియాడారు. బీసీ వర్గాల హక్కుల కోసం పోరాడుతూ ప్రజలకు భరోసాగా నిలిచారని అన్నారు. ఢిల్లీలో నరేంద్ర మోదీ ఉంటే.. తెలంగాణలో తమకు మరో నరేంద్ర టైగర్ ఆలె నరేంద్రమే అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆచరణను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఆలె నరేంద్ర కుమారుడు జితేంద్ర, కార్యక్రమ కన్వీనర్ మార్కండేయ, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కోళ్ల భాస్కరరావు, గడ్డం శ్రీనరసింహ గౌడ్, దొంతు ఆనందం, పూస నరసింహ బెస్త, నేరెళ్ల దేవేందర్, గంధం మల్ల ఆనంద్‌కుమార్ గౌడ్, పుల్కా లక్ష్మీనారాయణ, బొంగు ప్రసాద్ గౌడ్, కత్తుల సుదర్శన్, కత్తి వెంకటస్వామి, రామకృష్ణ యాదవ్, కప్పర ప్రసాద్, బుజ్జ సత్యం, దాసు సురేష్, కొట్టే జానయ్య యాదవ్, గడ్డం జగనాథం, కందగళ్ల స్వామి, పుట్టం పురుషోత్తం, ఆర్కే సాగర్, వాసుకే, చిక్క దేవదాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో అవగాహన కార్యక్రమం

**హయత్‌నగర్, ఆగస్టు 20 (జనం సాక్షి) :** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు పిలుపునిచ్చారు. కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ ఎస్ ఎస్) యూనిట్-1, యూనిట్-2, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగాల ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్షయ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకుని శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం కంట్రోల్ బోర్డ్ ఆఫీసర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని లక్షణాలు ఏమిటి, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన చికిత్స తదితర అంశాలను విద్యార్థులకు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు వివరించారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి బాధితులు పూర్తి స్థాయిలో చికిత్స తీసుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్



డాక్టర్ ఈ. యాదగిరిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజంలో ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం తీసుకురావడం ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ఆరోగ్యకరమైన జీవన విధానం పాటించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్. శారదాదేవి, ప్రియాంక, టిబి కంట్రోల్ మెడికల్ ఆఫీసర్, అబ్దుల్లాపూర్‌మెట్, టిబి కంట్రోల్ బోర్డ్ సిబ్బంది విల్సన్, రవి, కళాశాల గ్రంథపాలకులు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం/ సత్తుపల్లి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని, రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లి మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై నిర్వహించిన రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భేతుపల్లి, రామానగరం, తాళ్లమడ, గంగారం, నారాయణపురం,రామగోవిందపురం, పాకాలగూడెం గ్రామాల పంచాయతీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూ రీ సర్వే ప్రక్రియ, భూ హక్కుల నమోదుపై తమకు ఉన్న సందేహాలు, సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ భేతుపల్లి రెవెన్యూ



గ్రామంలో గత 25 రోజులుగా సుమారు 6 వేల ఎకరాల భూ రీ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉందని, మొత్తం భూమికి రీ సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. మిగిలిన మరో 6 వేల ఎకరాల భూమికి కూడా రీ సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. రీ సర్వే సందర్భంగా రైతులకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు లేదా లోపాలు కనిపిస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. రీ సర్వేలో ఏదైనా తప్పు జరిగితే రైతులు ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయ భూములకు వెళ్లే దారులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పొలాలకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దని, దారులను రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను పరిరక్షించాలని సూచించారు. చెరువులను తప్పనిసరిగా పరిరక్షించాలని మంత్రి అన్నారు. చెరువులకు అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు, కాంపౌండ్ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులను కూడా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, ఆర్ అండ్ బి ఎస్‌ఇ యుగంధర్ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాస చారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో 1260 గ్రాముల గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్ట్



**తాండూరు, అగస్టు 20 (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తాండూరులోని విలియం మూన్ స్కూల్ గ్రౌండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులతో తిరుగుతుండటాన్ని పోలీసులు గమనించారు. అనుమానం రావడంతో వారిని అదుపులోకి తీసుకుని వారి బ్యాగులను తనిఖీ చేయగా, వారి వద్ద 1,260 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై సంబంధిత ఎడిపిఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్ట్ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీలు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా మరియు వారి బృందం, తాండూర్ పట్టణ సిఐ పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# విపణి



## హైదరాబాద్‌లో కొత్త హబ్‌ను ప్రారంభించిన గైడ్‌హౌస్

### వెయ్యికి పైగా ఉద్యోగాల కల్పన లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి): గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ 'గైడ్‌హౌస్' హైటెక్ సిటీ లోని హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో కొత్త హబ్ ను ప్రారంభించింది. ఈ సందర్భంగా గైడ్‌హౌస్ పార్ట్‌నర్, గ్లోబల్ మేనేజ్డ్ సర్వీసెస్ లీడర్ అలీ బొఖారీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మా విస్తరణ భారతదేశంలోని ప్రతిభ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, గైడ్‌హౌస్ దీర్ఘకాలిక వృద్ధిలో భారత్ పోషించే కీలక పాత్రపై మాకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ కేంద్రం మా ఉద్యోగులు, క్లయింట్లు, మా గ్లోబల్ డెలివరీ మోడల్ భవిష్యత్తు కోసం చేసిన పెట్టుబడి అన్నారు. ప్రముఖ టెక్నాలజీ, వ్యాపార కేంద్రంగా హైదరాబాద్‌కు ఉన్న గుర్తింపు, ఇక్కడి బలమైన విద్యా వ్యవస్థ, నైపుణ్యం కలిగిన నిపుణుల లభ్యత భారతదేశంలో గైడ్‌హౌస్ నిరంతర వృద్ధికి సహజసిద్ధంగా సరిపోతాయన్నారు. రాబోయే 12 నెలల్లో హెల్త్‌కేర్, ఫైనాన్షియల్ సర్వీసెస్ క్లయింట్‌లకు సేవలందించే లక్ష్యంతో మేనేజ్డ్ సర్వీసెస్, టెక్నాలజీ, అనలిటిక్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాలలో వెయ్యి మందికి పైగా కొత్త నిపుణులను నియమించుకోవాలని యోచిస్తున్నామన్నారు. ఈ నూతన కేంద్రం నిరంతర సహకారం, సురక్షితమైన కార్యకలాపాలు, విస్తృత క్లయింట్ డెలివరీ కోసం ప్రత్యేకంగా రూపొందించామని తెలిపారు.

# ఏడు రోజుల నష్టాలకు బ్రేక్..


### భారీ లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబై(జనంసాక్షి): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. దీంతో వరుసగా ఏడు రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం సెషన్‌లో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా బాండ్ల రాబడులు తగ్గడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. రియల్టీ, ప్రైవేట్ బ్యాంక్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,909.68) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,611.11 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 628.04 పాయింట్ల లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30లో టైటాన్, హెచ్‌సీఎల్, ఇండిగో, టాటా స్టీల్ కంపెనీ షేర్లు తప్ప మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 93.94డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ మార్కెట్ సూచీలు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి.శియోమీ జె11 : ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ మొబైల్ కంపెనీ షియోమీ అనుబంధ సంస్థ ఐకూ తన 'జెడ్' సిరీస్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్ విడుదల చేసింది. ఐకూ జెడ్11 పేరిట ప్రత్యేకంగా విద్యార్థుల అవసరాలను దృష్టి పెట్టుకుని ఫీచర్లను జోడించి అందుబాటులోకి తెచ్చింది. మీడియా టెక్ డైమెన్సిటీ ప్రాసెసర్, 7050ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తోంది. జెడ్ సిరీస్‌లో తొలిసారి 3,800 స్క్వేర్ ఎంఎం వేపర్ ఛాంబర్ కూలింగ్ సిస్టమ్ అమర్చారు. మూడేళ్ల ఓఎస్+ ఐదేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో వస్తోంది. మరి ఫీచర్లు పరిశీలిస్తే..

ఏడో రోజూ నష్టాలే

దేశీయ సూచీలు, వరుసగా ఏడో రోజు ప్రతికూలంగానే ముగిశాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, ముడి చమురు ధర పెరగడం, విదేశీ మార్కెట్ల నుంచి అందుతున్న ప్రతికూల సంకేతాలే ఇందుకు కారణం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ పైసా పెరిగి 95.73 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.04% పెరిగి 91.97 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు తగ్గాయి. హాంకాంగ్ సూచీ సానుకూలంగా ముగిసింది. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.09 లక్షల కోట్లు తగ్గి రూ.488.70 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 77,218.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,235.46 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఈ సూచీ 77,347.81 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 76,822.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 325.78 పాయింట్లు నష్టపోయి 76,909.68 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 76.60 పాయింట్లు తగ్గి 24,078.30 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,172.85 – 24,025.65 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 21 నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ 2%, బజాజ్ ఫైనాన్స్ 1.31%, ఎల్ అండ్ టీ 1.27%, ఐటీసీ 1.18%, హెచ్‌యూఎల్ 0.98%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.90% తగ్గాయి. హెచ్‌సీఎల్ టెక్ 1.35%, ఎటర్నల్ 1.33%, కోటక్ బ్యాంక్ 1.23%, సన్ ఫార్మా 1.15% పెరిగాయి. రంగాల వారీ సూచీలకొస్తే విద్యుత్, భారీ యంత్ర పరికరాలు, యుటిలిటీస్, పారిశ్రామిక, హెస్పిటల్స్, ఇంధన, కమొడిటీస్ రంగాలు డీలాపడ్డాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, మిడ్‌క్యాప్ ప్రైవేట్ బ్యాంక్స్ సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. బీఎస్‌ఈలో 2,572 షేర్లు ప్రతికూలంగా, 1,728 షేర్లు సానుకూలంగా కదలాడాయి. 221 షేర్లలో మార్పు లేదు. షిప్‌కాలెట్ షేరు ఇష్యూ ధర రూ.97తో పోలిస్తే, బీఎస్‌ఈలో 33.50% లాభంతో రూ.129.50 వద్ద నమోదైంది.




## నానోమెడిసిన్‌లో భారత ఆవిష్కరణకు చారిత్రాత్మక ఆమోదం

అమీర్ పేట (జనంసాక్షి): నానోమెడిసిన్ రంగంలో భారతీయ ఆవిష్కరణకు కీలక గుర్తింపు లభించింది. వల్స్ ఫార్మాస్యూటికల్స్ అభివృద్ధి చేసిన నానో-క్యారియర్ ఆధారిత విటమిన్ డి3 ఓరల్ డిస్పర్షన్‌కు నియంత్రణ సంస్థ ఆమోదం లభించింది. ఈ తరహా ఆమోదం ప్రపంచంలోనే తొలిసారని సంస్థ తెలిపింది. క్లినికల్ అధ్యయనాల్లో సంప్రదాయ ఫార్ములేషన్లతో పోలిస్తే ఈ నానోక్యారియర్ ద్వారా సీరం విటమిన్ డి స్థాయిలు 50–60 శాతం అధికంగా నమోదైనట్లు పేర్కొంది. 2010 నుంచి నానో ఫార్మాస్యూటికల్ డ్రగ్ డెలివరీ రంగంలో పనిచేస్తున్న సంస్థ, లిపోఫిలిక్ సమ్మేళనాలను నీటి ఆధారిత మాధ్యమాల్లో సమర్థంగా అందించే 'అక్వియోల్' సాంకేతికతను అభివృద్ధి చేసింది. విటమిన్ కె2-7, బి12, ఐరన్‌తో పాటు పారాసెటమాల్, డైక్లోఫెనాక్, ఇబుప్రోఫెన్ వంటి మందులకూ ఈ సాంకేతికతను విస్తరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భారత్, అమెరికా, రష్యా, మెక్సికో, ఆస్ట్రేలియాల్లో సంస్థకు ఐదు పేటెంట్లు ఉన్నాయి. సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ కె.వి. రాంబాబు మాట్లాడుతూ, రోగులకు ఉపయోగపడే ఆచరణాత్మక పరిష్కారాలే తమ లక్ష్యమన్నారు.



## ఏజెంటిక్ ఏఐ, భారత్-దుబాయ్ వాణిజ్య బలోపేతానికి ఒప్పందాలు



ఖైరతాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) : ఏజెంటిక్ ఏఐ, డీప్‌టెక్ సహకారం, భారత్-దుబాయ్ వాణిజ్య, పెట్టుబడుల బలోపేతం కోసం దుబాయ్ ఛాంబర్స్, నాస్కామ్, ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌కేసీసీఐ)తో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని దుబాయ్ ఛాంబర్స్ (ప్రెసిడెంట్, సీఈఓ హెచ్.ఈ. మహమ్మద్ అలీ రషీద్ లూతా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల తన నేతృత్వంలోని ప్రతినిధి బృందం నాస్కామ్ డీప్‌టెక్, సీఐఐ కర్ణాటక, ఎఫ్‌కేసీసీఐ, ఫిక్కీ కర్ణాటకతో సమావేశమైనట్లు చెప్పారు. నా స్కామ్‌తో ఒప్పందం ఏజెంటిక్ ఏఐ, డీప్‌టెక్ సహ కారం, నాలెడ్జ్ షేరింగ్, అవిష్కరణలు, వ్యాపార విస్తరణకు, ఎఫ్‌కేసీసీఐతో ఒప్పందం 'వర్చువల్ దుబాయ్ డెస్క్', మార్కెట్ ఎంట్రీ మార్గదర్శకత్వం, బిజినెస్ బెంచ్‌మార్కింగ్‌కు తోడ్పడనుందని తెలిపారు. దుబాయ్ ఏజెంటిక్ ఏఐపై దృష్టి భారతీయ టెక్నాలజీ కంపెనీలు, ఆవిష్కర్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తోందని అన్నారు.

## గోల్డ్ లోన్ రంగంలోకి ఆదిత్య బిర్లా కంపెనీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్ బంగారం రుణాల వ్యాపారంలోకి అడుగుపెడుతోంది. రాబోయే 3 ఏళ్లలో మొత్తం 1,000 బంగారం రుణాల శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027 చివరి నాటికి తొలిదశలో భాగంగా 300 శాఖలు ప్రారంభిస్తామని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలో బంగారు రుణాలు బలమైన వృద్ధిని నమోదుచేస్తున్నాయని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ సింగ్ తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా ఈ రంగంలోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు. పట్టణాల్లో, నగరాల్లో మార్కెట్‌ను విస్తరిస్తామని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫాం, రిటైల్ స్టోర్‌లలో బంగారు రుణాలు కొత్త వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని అన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా బంగారానికి డిమాండ్ పెరిగిందన్నారు

# హర్మూజ్‌లో అమెరికా రహస్య షిప్పింగ్ కారిడార్




వాషింగ్టన్(జనంసాక్షి): హర్మూజ్ జలసంధిలో అమెరికా సైన్యం రహస్య షిప్పింగ్ కారిడార్‌ను నిర్వహిస్తోంది. దీని నుంచి గుట్టుగా నౌకలను జలసంధి దాటిస్తున్నట్లు అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. కాల్పుల విరమణ కొనసాగించేందుకు ట్రంప్ నిరాకరించిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొన్ని వారాల నుంచి అమెరికా దళాలు రాత్రి సమయంలో రహస్యంగా 15–20 వరకూ ట్యాంకర్లను సురక్షితంగా హర్మూజ్‌ను దాటిస్తున్నాయి. ఒమన్ తీరానికి సమీపంలోని దక్షిణ ఛానెల్ మార్గాన్ని దీనికి వినియోగిస్తున్నాయి. ఈ లెక్కన రోజుకు కనీసం కోటి బ్యారెళ్ల చమురు అందుబాటులోకి వస్తోంది. యుద్ధానికి ముందు సరఫరా అయ్యే చమురులో ఇది సగానికి సమానం. దీంతోపాటు భారీ ట్యాంకర్లు తిరిగి గల్ఫ్ దేశాల్లో రేవులకు వెళ్లి చమురు నింపుకొని వచ్చేందుకు అమెరికా సైన్యం సాయం చేస్తోంది. ఈ మొత్తం ఆపరేషన్‌ను అమెరికాలోని నార్త్ కరోలినా ఫోర్ట్ బ్రాగ్‌లోని అమెరికా టాస్క్ ఫోర్స్ సమన్వయం చేస్తోంది. దీనికి గల్ఫ్‌దేశాల నుంచి సహకారం లభిస్తోంది. టాస్క్ ఫోర్స్ నిర్దేశిత సమయాల్లోనే ట్యాంకర్ల కాన్వాయ్‌లు కదులుతున్నాయి. ఇటీవల రెండు వారాలపాటు జరిపిన దాడుల్లో ఇరాన్ మారిటైమ్ రాడార్, నిఘా వ్యవస్థలను అమెరికా దారుణంగా దెబ్బతీసింది. ఒమన్ వైపు సముద్రంపై నిఘా పెట్టే సామర్థ్యాన్ని దెబ్బతీసినట్లైంది. తాజాగా నౌకలపై డ్రోన్ దాడులను అడ్డుకొనేందుకు అమెరికా వాయుసేన ఫైటర్ జెట్స్ రక్షగా వెళ్తున్నాయి. మరోవైపు హర్మూజ్‌పై ఇరాన్ పట్టు 80% జారినట్లేనని అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. గత రెండు వారాలుగా ఒమన్ మార్గంలోనే 80శాతానికి పైగా నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లెర్ డేటా వెలువడింది.

## గూగుల్ ఆఫర్

### కాలేజీ విద్యార్థులకు ఏడాది పాటు 'ఏఐ ప్లస్' ఫ్రీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ భారతీయ కాలేజీ విద్యార్థులకు శుభవార్త చెప్పింది. 'గూగుల్ ఏఐ ప్లస్' సబ్‌స్క్రిప్షన్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నట్లు ప్రకటించింది. గూగుల్ ఏఐ అసిస్టెంట్, సెర్చ్ ద్వారా ఎడ్యుకేషనల్ టూల్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అమెరికాలోని కాలేజీ విద్యార్థుల కోసం గూగుల్ ఏఐ ప్రో ప్లాన్‌ను ఉచితంగా అందిస్తుండగా.. ఇప్పుడు భారతీయ కాలేజీ విద్యార్థుల కోసం 'గూగుల్ ఏఐ ప్లస్'ను ఏడాది పాటు ఉచితంగా తీసుకురానుంది. జీ-మెయిల్, డాక్స్‌లో జెమినై సేవలు లభించనున్నాయి. రీసెర్చ్, అనాలసిస్ కోసం నోట్‌బుక్ ఎల్‌ఎమ్ కూడా వాడుకోవచ్చు. దీంతో పాటు ఫొటోలు, డ్రైవ్, జీమెయిల్ కోసం 400 జీబీ స్టోరేజీని ఉచితంగా పొందొచ్చు. సాధారణంగా గూగుల్ ఏఐ ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధరను నెలకు రూ.399గా (ఏడాదికి రూ.4,788) కంపెనీ నిర్ణయించింది. గూగుల్ ఏఐ ప్లస్‌లో భాగంగా స్టడీ నోట్‌బుక్స్, ఫ్లాష్‌కార్డులను క్రియేట్ చేయడం, ప్రాక్టీస్ క్విజ్‌లు వంటి ఇతర సదుపాయాలను గూగుల్ కల్పించింది. జెమినై లైవ్ కూడా అందుబాటులో ఉంటుంది. విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై 70 శాతం డిస్కౌంట్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. గూగుల్ ఏఐ ప్రో సబ్‌స్క్రిప్షన్‌తో యూట్యూబ్ ప్రీమియం లైట్ కూడా పొందొచ్చు. అర్హత కలిగిన విద్యార్థులు పర్సనల్ గూగుల్ అకౌంట్‌తో గూగుల్ వన్‌లో సైన్ అప్ కావొచ్చు. విద్యార్థుల అర్హతను గూగుల్ వ్యాపవనిఏఐ ప్లాట్‌ఫామ్ ద్వారా వెరిఫై చేయనుంది.




## అప్లైడ్ ఏఐతో భారత్‌లో కార్యకలాపాలు

### విస్తరించనున్న 'ఫీనామ్'

### మరో రెండు వేల మందికి ఉద్యోగావకాశాలు

### డిసెంబర్ 17న 'ఐయామ్ ఫీనామ్ ఇండియా 2026'




హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి): అప్లైడ్ ఏఐ రంగంలో 'ఫీనామ్' సంకేత అడుగులు వేస్తుంది. హెచ్‌ఆర్, వర్క్‌ఫోర్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ కోసం భారతదేశంలో కార్యకలాపాలు విస్తరిస్తుంది. టెక్నాలజీ, ప్రతిభ, ఆవిష్కరణల్లో పెట్టుబడులు పెడుతుంది. తెలంగాణలో తన కార్యాలయాలను విస్తరిస్తూ భవిష్యత్తులో భారత్‌లో రెండు వేలకు పైగా అదనపు ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వివరాలు తెలిపేందుకు బేగంపేటలో ఉన్న టీజీ కాకతీయలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీనామ్ సీఈఓ, కో-ఫౌండర్ మహే బయిరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 17, 2026న హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో జరగనున్న 'ఐయామ్ ఫీనామ్ ఇండియా 2026' సదస్సులో కంపెనీ తన భారత వృద్ధి ప్రణాళికలను ప్రధానంగా ప్రదర్శించనున్నారు. హెచ్‌ఆర్, ఐటీ విభాగాల్లో అప్లైడ్ ఏఐ కోసం ప్రత్యేక వేదికగా నిలవనున్న ఈ సదస్సు నియామకాలు, ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, వారిని సంస్థలో నిలుపుకోవడంలో ఏఐ ఎలాంటి ఫలితాలను అందించగలదో చర్చించేందుకు హెచ్‌ఆర్ నిపుణులు, టాలెంట్ అక్విజిషన్ లీడర్లు, హెచ్‌ఆర్‌టెక్ బృందాలు, ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లను ఒకే వేదికపైకి తీసుకు రానుందన్నారు. ఆయా కంపెనీలు తమ ఉద్యోగులపై చేసే పెట్టుబడులే భవిష్యత్తు పని తీరును (ఫ్యూచర్ ఆఫ్ వర్క్) నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. కేవలం ఏఐతో ప్రయోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగుల పని తీరు, అభివృద్ధి, ఎదుగుదలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా లీడర్లకు 'ఐయామ్ ఫీనామ్ ఇండియా' మార్గదర్శనం చేస్తుందని తెలిపారు. భారతదేశ సాంకేతిక నైపుణ్యం, అపారమైన ప్రతిభ, అకౌంట్లకు ఈ మార్పును ముందుండి నడిపించేందుకు శక్తిసామర్థ్యాలను కలిగి ఉన్నాయని చెప్పారు.

## బీమాపై అవగాహన పెరుగుతోంది

### ఐసీఐసీఐ ప్రు.ఇన్సూరెన్స్ సీడీవో అమిష్ బాంకర్

హైదరాబాద్: సంప్రదాయ పొదుపు సాధనంగానే కాకుండా, కుటుంబాల దీర్ఘకాల ఆర్థిక భద్రతకు భరోసానిచ్చే సాధనంగా బీమా పాలసీలను ప్రజలు పరిగణనలోకి తీసుకుంటున్నారని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ (సీడీవో) అమిష్ బాంకర్ వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో బీమా పాలసీలపై దేశ సగటుకన్నా ఎక్కువ అవగాహన ఉందని, దీనికి అనుగుణంగా కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు బుధవారం ఇక్కడ చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 13, తెలంగాణలో 11 శాఖలతో సేవలు అందిస్తున్నట్లు.. కొత్తగా మరో 4 శాఖలు ఏర్పాటు చేస్తామని వివరించారు. తెలంగాణలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ పాలసీల్లో 60.7% వార్షిక వృద్ధి కనిపించిందన్నారు. ఇక్కడ మొత్తం 6.56 లక్షల మందికి జీవిత బీమా రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. గత ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,192 కోట్ల విలువైన జీవిత బీమా పరిహారాన్ని నామినీలకు చెల్లించినట్లు పేర్కొన్నారు. 'యువత తమ కుటుంబ భద్రత కోసం టర్మ్ పాలసీలు తీసుకుంటున్నారు. 45–50 ఏళ్ల వయసులోనే రిటైర్ అవ్వాలని భావించే వారు పెరుగుతుండటంతో, పదవీ విరమణ పాలసీలకూ గిరాకీ పెరుగుతోంది. కృత్రిమ మేధ, డిజిటల్ సేవల వినియోగం అత్యంత సులభంగా మారవడంతో.. బీమా తీసుకునే పద్ధతులూ మారుతున్నాయి.

## ఆ దేశంలో పాక్ ప్రయాణికులపై వివక్ష..!

### ఎంపీ అసద్ ఖైసర్

ఇస్లామాబాద్(జనంసాక్షి): విమానం రద్దు కావడంతో యూఏఈలో హోటల్ వసతి కోరిన పాకిస్థానీ ప్రయాణికుల పట్ల వివక్ష చూపారని ఆ దేశ ఎంపీ అసద్ ఖైసర్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఆయన ఆ దేశ నేషనల్ అసెంబ్లీలో ప్రస్తావించారు. విమానం రద్దు కావడంతో తాను కూడా హోటల్‌లో బస చేసేందుకు ప్రయత్నించానని చెప్పారు. అయితే పాకిస్థానీయుల పట్ల హోటల్ సిబ్బంది వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. భారత్, అమెరికా పాస్‌పోర్టులు ఉన్న ప్రయాణికులకు మాత్రమే వసతి కల్పిస్తామని అక్కడ ఏర్పాటు చేసిన ప్రకటనలో పేర్కొన్నారని తెలిపారు. ఇలాంటి వ్యవహారంపై యూఏఈ అధికారులతో దౌత్య మార్గాల్లో చర్చించాలని పాక్ విదేశాంగ శాఖను కోరారు. యూఏఈ తమకు సోదర దేశమని ఖైసర్ పేర్కొన్నారు. ఆ దేశ అభివృద్ధిలో పాకిస్థానీయులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు దైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనను కలిసిన ఓ ప్రతినిధి బృందం కూడా ఇలాంటి అనుభవాలపై ఫిర్యాదు చేసిందని తెలిపారు.

## ఐటీకి ఏఐ డిఫ్లేషన్..

### కంపెనీల ఆదాయం - లాభాల తాతంపై ఒత్తిడి పెరుగుతున్న ఖర్చుల భారం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆర్థిక వ్యవస్థలో ధరలు పెరగడాన్ని ద్రవ్యోల్బణం గా వ్యవహరిస్తే, ధరలు తగ్గడాన్ని ప్రతి ద్రవ్యోల్బణం (డిఫ్లేషన్)గా వ్యవహరిస్తారు. ఇటీవల వరకు ఐటీ కంపెనీల లాభదాయకతను పెరగడమే కానీ, తగ్గడం అనేది లేదు. కానీ కృత్రిమమేధ (ఏఐ) ఈ పరిస్థితిని మార్చేస్తోంది. ప్రాజెక్టుల ధరల తగ్గుతున్నందున, ఐటీ సేవల్లో నిమగ్నమైన దిగ్గజ దేశీయ ఐటీ కంపెనీల లాభదాయకత దిగివస్తున్నాయి. ఫలితంగా.. ఐటీ సేవలకు ఏఐ డిఫ్లేషన్ ఏర్పడిందని పరిశ్రమ పేర్కొంటోంది. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ఐటీ రంగంలోని ఉద్యోగులతో పాటు కంపెనీల్లోనూ భయాందోళన నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాలను పరిశీలిస్తే, దేశీయ ఐటీ దిగ్గజాల లాభదాయకతలపై పడిన ప్రతికూల ప్రభావం స్పష్టమవుతోంది. క్లయింట్ల టెక్నాలజీ బడ్జెట్లు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, ఏఐ కారణంగా సేవల ధరలు తగ్గడమే ఇందుకు కారణం. 5 ప్రధాన ఐటీ కంపెనీల్లో మూడింటి లాభాలు తగ్గాయి. పైగా వ్యయాలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కృత్రిమ మేధ సాంకేతిక వల్ల ఐటీ ఉత్పత్తులు, సేవల రూప కల్పనకు పట్టే సమయం - ఖర్చు తగ్గుతోంది. గతంలో ఎక్కువ మంది ఉద్యోగులతో, అధిక సమయం పట్టిన పనులు.. (కోడింగ్, టెస్టింగ్) ఇప్పుడు ఏఐ టూల్స్ సాయంతో చాలా తక్కువ మందితో, వేగంగా, తక్కువ వ్యయంతో పూర్తి చేస్తున్నారు. దీనివల్ల ప్రాజెక్టు ధరలు తగ్గడాన్ని విశ్లేషకులు 'ఏఐ డిఫ్లేషన్'గా పేర్కొంటున్నారు. హైటెక్ రంగంలోని క్లయింట్లు ఏఐ వినియోగంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటంతో, వారు తమ పాత సేవల సొంతంగా 'ఇన్-హౌస్' ఏఐ మోడల్స్ అభివృద్ధి చేసుకుని, గతంలో ఔట్‌సోర్సింగ్ ఇచ్చిన సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులను ఉపసంహరిస్తున్నాయి. గూగుల్ తన వార్షిక కాంట్రాక్టులో హెచ్‌సీఎల్ టెక్‌కు చెల్లించే మొత్తంలో సుమారు రూ.470 కోట్లు (50 మి. డాలర్లు) కోత విధించింది. దాదాపు రూ.1900 కోట్ల (200 మి. డాలర్లు) విలువైన ఈ ఒప్పందం విలువ ఏకంగా 25% తగ్గించింది. ఈ నిర్ణయం ఏఐ ప్రభావంతో వైపు గూగుల్ మళ్లించింది. ఖర్చులను తగ్గించుకోవాలనే ఈ వ్యూహం, ఐటీ సేవల సంస్థల రాబడిని గణనీయంగా దెబ్బతీస్తోంది. మార్కెట్లో కొత్త ఒప్పందాల కోసం పోటీ పడుతున్న ఐటీ సేవల కంపెనీలను, ప్రాజెక్టు వ్యయాల్లో 20–30% రాయితీ ఇవ్వాలని క్లయింట్లు ఒత్తిడి తెస్తున్నారు. టెలికాం, ఎస్ఏఎస్, ఆర్థిక సేవల రంగాల క్లయింట్లు మరింత కఠినంగా ఉంటున్నారు. అంతర్జాతీయ దిగ్గజమైన మెటా, విప్రోకు ఇచ్చిన కాంట్రాక్టులో రూ.143 కోట్ల నుంచి రూ.190 కోట్ల వరకు కోత విధించింది. కాకుండా, యాక్సెంచర్, టెలిపెర్ఫార్మెన్స్ వంటి ఇతర సంస్థలతో ఉన్న డీల్స్ పరిమాణాన్ని తగ్గించింది.

## సఫారీలో హెలికాప్టర్ కూలి.. ఇంటిలెజెన్స్ చీఫ్ దుర్మరణం

నైరోబీ: కెన్యాలో వీవీఐపీల ప్రయాణిస్తోన్న ఓ హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. వారిలో ఐదుగురు అమెరికన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఈక్వెడార్ జాతీయ ఇంటిలిజెన్స్ చీఫ్ మిషెల్ సెన్నీ కొంటెగా, ఆయన భార్య ఉన్నట్లు వెల్లడించారు. ప్రముఖ స్పానిష్ టెలివిజన్ ఛానెల్ 'టెలిముండో' అధికారి జోస్ సువారెజ్ కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఉత్తర కెన్యాలోని శాంబురు కౌంటీలో ఈ ప్రమాదం జరిగింది. విహారయాత్రలో భాగంగా వారు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుండగా.. ఉన్నట్టుండి అది కుప్పకూలింది. కొండల ప్రాంతంలో కూలిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగినట్లు తెలుస్తోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
21 ఆగస్టు 2026



## ఇథనాల్ విధానంపై చర్చ

పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచడం ద్వారా చమురు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ విధానం నేపథ్యంలో చెరకు వినియోగంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. చక్కెర తయారీకి వెళ్లాల్సిన చెరకులో కొంత భాగం ఇథనాల్ ఉత్పత్తి వైపు మళ్లడం వల్ల దేశీయ చక్కెర లభ్యతపై ప్రభావం పడుతోందన్న వాదన ఉంది. అయితే ప్రస్తుత ధరల పెరుగుదలకు ఇథనాల్ మళ్లింపే ఏకైక కారణం కాదని, ఉత్పత్తి, వాతావరణ పరిస్థితులు, నిల్వలు, పండుగల డిమాండ్ వంటి పలు అంశాలు కలిసి ప్రభావం చూపుతున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# చక్కెర కిలో 70

## సామాన్యుడి వంటింటికి షాక్!

### నెల రోజుల్లోనే రూ.20-25 పెరుగుదల

- పండుగల వేళ డిమాండ్ పెరుగుదల.. దేశీయ సరఫరాపై ఒత్తిడి
- ఇథనాల్ మళ్లింపు, ఉత్పత్తి తగ్గుదలతో మార్కెట్‌లో బిగుతు
- ధరల కట్టడికి 10 లక్షల టన్నుల సుంకం లేని దిగుమతులకు కేంద్రం అనుమతి

**పండుగల సంబరాలకు ముందే చక్కెర ధర సామాన్యుడి నోట చేదు రుచిని మిగుల్చుతోంది. ఒకప్పుడు కిలో రూ.45-50కే లభించిన చక్కెర ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో రూ.70కు చేరడం వంటింటి బడ్జెట్‌ను కుదిపేస్తోంది. నెల రోజుల్లోనే కిలోపై రూ.20-25 వరకు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడింది. టీ, కాఫీ, పాలు, స్వీట్లు, బేకరీ పదార్థాలు.. ఇలా నిత్య వినియోగంలో చక్కెర తప్పనిసరి కావడంతో ధరల పెరుగుదల ప్రభావం ప్రతి ఇంటికీ తాకుతోంది. పండుగల సీజన్ ముందుండటంతో రాబోయే రోజుల్లో ధరల పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.**

**కిలో రూ.70 అంటే మా కుటుంబ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం**

చక్కెర ధర ఇంత వేగంగా పెరగడం ఎప్పుడూ చూడలేదు. టీ, కాఫీకి మాత్రమే కాదు.. పిల్లలకు, ఇంట్లో రోజువారీ వాడకానికి చక్కెర తప్పనిసరి. నెలకు 4-5 కిలోలు కొనాల్సి వస్తుంది. కిలోపై రూ.20-25 పెరగడంతో నెలవారీ ఖర్చు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం వెంటనే ధరలను అదుపులోకి తీసుకురావాలి.

**గీత (గృహిణి) తాండూరు**

**పండుగల ముందు ధరలు పెరగడం మరింత భారమే**

వినాయక చవితి, దసరా, దీపావళి పండుగలు రాబోతున్నాయి. ఈ సమయంలో చక్కెర ధర పెరగడంతో స్వీట్లు, పిండి వంటలు చేసుకోవాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. చక్కెర ధర పెరిగితే స్వీట్ షాపులు, బేకరీలు కూడా ధరలు పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వం మార్కెట్‌ను పర్యవేక్షించి సామాన్యుడిపై భారం పడకుండా చూడాలి.

**- సందీప్, వినియోగదారుడు తాండూరు**

**హైదరాబాద్/ తాండూరు, ఆగస్టు 20 (జనంసాక్షి):**
చక్కెర ధరల పెరుగుదల వెనుక ఒక్క కారణం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశీయ చక్కెర ఉత్పత్తి తగ్గడం, కొన్ని ప్రాంతాల్లో వాతావరణ ప్రతికూలతలతో చెరకు దిగుబడిపై ప్రభావం పడటం, గత సీజన్ నిల్వలు తగ్గిపోవడం, మరోవైపు పండుగల డిమాండ్ పెరగడం వంటి అంశాలు కలిసి మార్కెట్‌లో సరఫరా-డిమాండ్ సమతుల్యతను దెబ్బతీశాయి. సరఫరా బిగుతుగా ఉన్న సమయంలో డిమాండ్ పెరగడంతో హోల్‌సేల్ ధరలు కూడా వేగంగా ఎగబాకి, ఆ ప్రభావం రిటైల్ మార్కెట్‌కు చేరింది.

**కేంద్రం ముందున్న అసలు సవాల్..**

చక్కెర ధరలను అదుపులో ఉంచడం ఒకవైపు.. చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం మరోవైపు.. ఇథనాల్ విధాన లక్ష్యాలను కొనసాగించడం ఇంకోవైపు.. ఈ మూడు అంశాల మధ్య కేంద్ర ప్రభుత్వం సమతుల్యత సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇథనాల్ ఉత్పత్తి ద్వారా ఇంధన దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలన్న దీర్ఘకాలిక లక్ష్యంతో పాటు దేశీయ ఆహార అవసరాలకు తగినంత చక్కెర అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. తాజాగా దిగుమతుల నిర్ణయం ధరల నియంత్రణ దిశగా తక్షణ చర్యగా కనిపిస్తున్నా.. దాని ప్రభావం రిటైల్ మార్కెట్‌లోకి ఎంత వేగంగా చేరుతుందన్నదే కీలకం.



**పండుగల డిమాండ్.. మరింత ఒత్తిడి**

వినాయక చవితి, దసరా, దీపావళి వరుసగా రానుండటంతో చక్కెర వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. స్వీట్ షాపులు, బేకరీలు, హోటళ్లు, ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థలు ముందస్తు కొనుగోళ్లు ప్రారంభించడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ అదనపు డిమాండ్ రాబోయే వారాల్లో మార్కెట్‌పై మరింత ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

**నిల్వలపై కేంద్రం నిఘా**

ధరల పెరుగుదల నేపథ్యంలో నిల్వల నియంత్రణపై కేంద్రం దృష్టి సారించింది. బల్క్ వినియోగదారులు అవసరానికి మించి చక్కెర నిల్వ చేయకుండా పరిమితులు విధిస్తూ కృత్రిమ కొరతకు అడ్డుకట్ట వేసే చర్యలు చేపట్టింది. డీలర్లు, వ్యాపారుల నిల్వలపైనా నిఘా పెంచాలని ఆదేశించింది. మార్కెట్‌లో సరఫరా సజావుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

**10 లక్షల టన్నుల దిగుమతికి అనుమతి**

దేశీయ మార్కెట్‌లో సరఫరా పెంచి ధరలకు కళ్లెం వేయాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 31 వరకు దిగుమతులకు అవకాశం కల్పించడం ద్వారా దేశీయ మార్కెట్‌లో సరఫరా పెంచి ధరల ఒత్తిడిని తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. దిగుమతి చేసిన ముడి చక్కెరను దేశీయ మిల్లుల్లో శుద్ధి చేసి మార్కెట్‌కు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**సామాన్యుడికి ఉపశమనం ఎప్పుడో?**

కిలో చక్కెర రూ.70కు చేరడంతో ఇప్పటికే కుటుంబాల నెలవారీ వంటింటి బడ్జెట్‌పై భారం పడింది. పండుగల సీజన్‌లో ధరలు మరింత పెరిగితే స్వీట్లు, బేకరీ ఉత్పత్తులతో పాటు ఇతర ఆహార పదార్థాల ధరలపైనా పరోక్ష ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే దిగుమతుల ప్రయోజనం వెంటనే వినియోగదారుడికి చేరేలా చూడాలని, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. చక్కెర ధర తగ్గితేనే కేంద్రం తీసుకున్న చర్యలకు అసలు ఫలితం వచ్చినట్టని.. కాగితాలపై నిర్ణయాలు కాకుండా మార్కెట్‌లో కిలో ధర తగ్గడమే సామాన్యుడికి కావాల్సిన ఉపశమనమని వినియోగదారులు స్పష్టం చేస్తున్నారు.

## అల్లీపురంలో రూ.12 కోట్లతో ఆర్‌అండ్‌బి డబుల్ రోడ్లకు శంకుస్థాపన

**రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హుజూర్ నగర్, ఆగస్టు 20 (జనంసాక్షి) :** నియోజకవర్గంలోని మఠంపల్లి మండలం అల్లీపురం గ్రామంలో రూ .12 కోట్లతో అమరవరం నుండి కొత్త తండా వరకు ఆర్ అండ్ బి డబుల్ రోడ్లకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ తో కలసి రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గం లోని అన్ని గ్రామాలను కలుపుతూ తారు రోడ్లు వేయించడం జరుగుతుందని, గ్రామాలలో కొత్తగా వేసిన తారు రోడ్లపై వ్యవసాయ పనులు నిమిత్తం ట్రాక్టర్లకు బిగించిన ఫుల్ వీల్స్, ఆఫ్ వీల్స్ తిప్పరాదని, ఇలా తిప్పడం వలన రోడ్లు తొందరగా పాడైపోతాయని కావున గ్రామ ప్రజలు రోడ్లను కలకాలం ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. అలాగే ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచించినందున, రైతులు వాస్తవ పరిస్థితులను తెలుసుకొని వ్యవసాయ శాఖ వారు సూచించిన సూచనలు పాటించి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, అల్లీపురం సర్పంచ్ భోగాల జ్యోతిపిచ్చిరెడ్డి, అల్లపురి శీను, మల్రెడ్డి వీరారెడ్డి, గోలి జానకి రాములు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం అభివృద్ధికి రూ.25 కోట్ల నిధుల వినతి

కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కీసర, ఆగస్టు 20 (జనంసాక్షి) :** నాగారం డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ నాయకులు రూ. 25 కోట్ల అభివృద్ధి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించి చర్చించారు. మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో జరిగిన సమావేశంలో నాగారం డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్య వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నిధులు కేటాయించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ లక్ష్యమని, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నాగారం డివిజన్ అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ అధ్యక్షుడు ఎల్లసాని భూమయ్య యాదవ్, ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, కౌకుట్ల జీవన్ రెడ్డి, నల్లోలు కుమార్, అన్నంరాజు సురేష్, గండి ఓంప్రకాశ్ గౌడ్, దొడ్డి బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

## యూఎల్‌సీ పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ వేగవంతం చేయాలి

**22ఏ భూముల వివరాలు పరిశీలించి జీవోలు అప్‌లోడ్ చేయాలి : కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 జనంసాక్షి :** 22ఏ నిషేధిత భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) పరిధిలోని దరఖాస్తుల క్లియరెన్స్‌కు సంబంధించిన రీటైనెబుల్ భూముల వివరాలను పరిశీలించి ప్రభుత్వ జీవోల ప్రకారం అప్‌లోడింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని యూఎల్‌సీ విభాగాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తూ యూఎల్‌సీకి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి హాల్‌లో వివిధ మండలాల నుంచి వచ్చిన సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేసి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని ఆదేశించారు. అవసరమైతే రాత్రి వేళల్లో కూడా విధులు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. యూఎల్‌సీ ఆన్‌లైన్ డేటా క్లియరెన్స్‌ను త్వరగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల దరఖాస్తులు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.

## మర్రిగూడలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఐదుగురు పట్టుబడగా నగదు, వాహనాలు స్వాధీనం**

**మర్రిగూడ, ఆగస్టు 20 (జనం సాక్షి):** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మర్రిగూడ, చింతపల్లి, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన సుమారు పది మంది రహస్యంగా పేకాట ఆడుతుండగా పోలీసులు ఒక్కసారిగా అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. సంఘటనా స్థలంలో నగదుతో పాటు ఆటోలు, బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిలో కొందరు పేకాటకు అలవాటుపడిన వారిగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పేకాట, జూదానికి బానిసై అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్న నేపథ్యంలో ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పట్టుబడిన వ్యక్తుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న నగదు, వాహనాల ఖచ్చితమైన వివరాలపై పోలీసుల అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఫీజుల బకాయి - బీజేపీ లడాయి

**పెండింగ్‌లో ఉన్న రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి**

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని రామచంద్రరావు విమర్శ**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి) :**రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన “ఫీజుల బకాయి – బీజేపీ లడాయి” ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ. 12 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం తో అనేక మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలేజీలకు బకాయిలు రాకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడి కొన్ని విద్యాసంస్థలు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. గల్లీ నుంచి అసెంబ్లీ వరకు విద్యార్థుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, బకాయిలు పూర్తిగా విడుదలయ్యే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్, జిల్లా ఇన్‌చార్జ్ శాంత కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావుతో పాటు కార్పొరేటర్లు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్ సర్కిల్‌లో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పర్యటన

**పలు అభివృద్ధి పనుల పరిశీలన.. నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశాలు**

**కరీంనగర్ టౌన్, (జనం సాక్షి):**
టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి గురువారం కరీంనగర్ సర్కిల్‌లో పర్యటించి పలు విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా కొత్తగా నిర్మించనున్న హుజురాబాద్ డివిజన్ కార్యాలయాన్ని పరిశీలించిన సీఎండీ, అవసరమైన అనుమతులు మంజూరు చేసి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ చౌక్‌లో నిర్మాణంలో ఉన్న నూతన ఇండోర్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, భద్రతా నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పర్యటనలో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ (ఆపరేషన్స్) రవీందర్, డీఈ రాజం, డీఈ/కన్స్ట్రక్షన్ చంద్రమౌళి, ఈఈ సివిల్ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై ఆలె నరేంద్ర విగ్రహం ఏర్పాటు చేయాలి

- వివిధ బీసీ సంఘాల నాయకుల డిమాండ్
- టైగర్ నరేంద్ర ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి
- మాజీ ఎంపీ బుర్ర నర్సయ్య గౌడ్
- ఘనంగా టైగర్ ఆలె నరేంద్ర జయంతి వేడుకలు.




**ముషీరాబాద్ ఆగస్టు 20 (జనం సాక్షి):**
టైగర్ ఆలె నరేంద్ర విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన పోరాట స్ఫూర్తి, ధైర్యం, ప్రజా ఉద్యమాల్లో చేసిన కృషిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని సుందర విజ్ఞాన కేంద్రంలో టైగర్ ఆలె నరేంద్ర 80వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. “జీవితమే ఒక సందేశం” అనే నినాదంతో మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆలె నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బుర్ర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ టైగర్ నరేంద్ర ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఒక శక్తి అని కొనియాడారు. బీసీ వర్గాల హక్కుల కోసం పోరాడుతూ ప్రజలకు భరోసాగా నిలిచారని అన్నారు. ఢిల్లీలో నరేంద్ర మోదీ ఉంటే.. తెలంగాణలో తమకు మరో నరేంద్ర టైగర్ ఆలె నరేంద్రమే అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ఆచరణను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా సామాజిక తెలంగాణ సాధన ఇంకా పూర్తికాలేదన్నారు. బహుజన వర్గాలకు చెందిన మహనీయుల చరిత్రను మరుగున పడకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన పోరాటాల స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.
మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం టైగర్ నరేంద్రను స్మరించుకోవడానికే పరిమితం కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమంగా నిలవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొండా లక్ష్మణ్ బాపూజీ, కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి మహనీయుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఆలె నరేంద్ర కుమారుడు జితేంద్ర, కార్యక్రమ కన్వీనర్ మార్కండేయ, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కోళ్ల భాస్కరరావు, గడ్డం శ్రీనరసింహ గౌడ్, దొంతు ఆనందం, పూస నరసింహ బెస్త, నేరెళ్ల దేవేందర్, గంధం మల్ల ఆనంద్‌కుమార్ గౌడ్, పుల్కా లక్ష్మీనారాయణ, బొంగు ప్రసాద్ గౌడ్, కత్తుల సుదర్శన్, కత్తి వెంకటస్వామి, రామకృష్ణ యాదవ్, కప్పర ప్రసాద్, బుజ్జ సత్యం, దాసు సురేష్, కొట్టె జానయ్య యాదవ్, గడ్డం జగనాథం, కందగళ్ల స్వామి, పుట్టం పురుషోత్తం, ఆర్కె సాగర్, వాసుకే, చిక్క దేవదాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




## జీవో నం.97ను వెంటనే రద్దు చేయాలి

- పాలిటెక్నిక్‌ను ఐటీఐ-ఏటీసీలతో అనుసంధానానికి వ్యతిరేకంగా నిరసనలు
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ ఆరోపణ

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 20 (జనం సాక్షి):** పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐటీఐ-ఏటీసీలతో అనుసంధానం చేస్తూ ప్రభుత్వం తీసుకువస్తున్న విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, జీవో నం. 97ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జ్యోతిష్మతి, ట్రినిటీ, వాగేశ్వరి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో బంద్ నిర్వహించి తిమ్మాపూర్ స్టేజ్ వద్ద ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ ప్రత్యేక సాంకేతిక విద్యను ఇతర శిక్షణా కోర్సులతో కలపడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని, ఎస్‌బీటీఈటీని బలోపేతం చేయాలని, మౌలిక వసతులు, అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.
బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు పొన్నం అనిల్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ఎదుట నిరసన చేపట్టారు. శక్తి స్కీమ్, జీవో 97ను రద్దు చేయాలని, పీపీపీ విధానంలో ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించకూడదని, ఫీజుల భారం పెరగకుండా చూడాలని కోరారు. లేటరల్ ఎంట్రీ అవకాశం కోల్పోతారని, మహబూబాబాద్‌లో విద్యార్థులపై పోలీసుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవోను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి
- రెండో విడతకు లబ్ధిదారుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 20 (జనం సాక్షి) :** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 407 మందికి ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వారికి వెంటనే ప్రొసీడింగ్‌లు అందించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన ప్రతిపాదనలను ఇందిరమ్మ కమిటీల ద్వారా వెంటనే పంపించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా పైకప్పు మార్పిడి (రూఫ్ రీప్లేస్‌మెంట్) కోసం ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రూఫ్ రీప్లేస్‌మెంట్ కోసం ప్రభుత్వం రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించను న్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, గృహ నిర్మాణ శాఖ పీడీ గంగారం, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు

- సింగరేణి నీటితో పంట పొలాలు ముంపునకు గురికాకుండా ముందస్తు ప్రణాళిక
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు వేగవంతం : కలెక్టర్ కోయ శ్రీహర్ష
- మంథని పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- పాత సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



**మంథని, ఆగస్టు 20 (జనంసాక్షి):** క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం మంథని ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన ఆయన కన్నాల గ్రామంలోని వ్యవసాయ భూములను పరిశీలించారు. అడవి సోమనపల్లిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను, సోమనపల్లిలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంథని మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. సింగరేణి నీటి కారణంగా వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో కన్నాల గ్రామంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. ఇప్పటివరకు పెద్దస్థాయిలో ముంపు జరగలేదని తెలిపారు. భవిష్యత్తులో సింగరేణి నీటి కారణంగా వ్యవసాయ భూములు ముంపునకు గురికాకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. అడవి సోమనపల్లిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రారంభించేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనుల పురోగతికి నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులకు స్పష్టం చేశారు. సోమనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం మంథని మున్సిపల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వాహనాలు, ఇతర సౌకర్యాల కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. పాత సీసీ రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణం, అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాల్లో మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో విజయాలపై విద్యార్థులకు అవగాహన

- శాస్త్రవేత్తతో మూడుగంటల ప్రత్యేక సదస్సు
- చంద్రయాన్, మంగళయాన్, గగనయాన్ మిషన్లపై వివరణ
- విద్యార్థుల సందేహాలకు డా. గంజి వెంకట నారాయణ సమాధానాలు
- శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కార్యక్రమాలు అవసరం



**8వ కాలనీ , ఆగస్టు 20 (జనంసాక్షి ) :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన విజయాలు, అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రామగుండం ఏరియా–2 పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీ సెక్టార్–3లో ఉన్న సింగరేణి పాఠశాలను ప్రముఖ ఇస్రో శాస్త్రవేత్త డా. గంజి వెంకట నారాయణ సందర్శించారు. అనంతరం పాఠశాల సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో 'ఇస్రోపై అవగాహన' అంశంపై సుమారు మూడు గంటలపాటు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రయాన్, మంగళయాన్, గగనయాన్ తదితర ప్రతిష్ఠాత్మక అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన తన అనుభవాలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలో భారత్ సాధించిన ప్రగతి, శాస్త్రవేత్తల కృషి, ప్రయోగాల వెనుక ఉన్న శాస్త్రీయ అంశాలను వివరించారు. అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా పలు అంశాలను సులభంగా వివరించిన ఆయన.. విద్యార్థులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఇలాంటి విజ్ఞానపరమైన కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల జాబితాను నిలిపివేయాలి

- అర్హులను పారదర్శకంగా గుర్తించాలని కాంగ్రెస్ డిమాండ్
- ఎంపీడీవోకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు
- అవకతవకలపై విచారణ చేపట్టాలని విజ్ఞప్తి



**గంభీరావుపేట, ఆగస్టు 20 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను వెంటనే నిలిపివేసి, అర్హులను పారదర్శకంగా గుర్తించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీడీవో రాజేందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ కొందరు ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. డబ్బులు తీసుకుని అనర్హుల పేర్లను జాబితాలో చేర్చారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. నిజమైన అర్హులను గుర్తించేందుకు 15 రోజుల గడువు ఇస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేసి అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, కుట్టుమిషన్లు తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకే అందేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఇదిలా ఉండగా సంక్షేమ పథకాల అమలుపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఎంపీడీవో నుంచి సరైన స్పందన రావడం లేదని తిరుపతి గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. గురువారం పంతులుగారి తోటలో పాత్రికేయులతో మాట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల అమలులో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు సమాచారం అందించి అర్హులను గుర్తించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవోను పలుమార్లు సంప్రదించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత లోపిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కూడేల్లి ప్రవీణ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏడబోయిన ప్రభాకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మల్యాల రాజ్వీర్, నాయకులు బంగ్లా రాజుగౌడ్, శంకర్ రాజశేఖర్, నరేష్ వర్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి 40 మంది వైద్య సిబ్బంది

**కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు..**

**గోదావరిఖని, ఆగస్టు 20 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా గోదావరి ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన 40 మంది వైద్య సిబ్బందిని నియమించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. నియమితుల్లో ఒక ప్రొఫెసర్, 17 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు సీనియర్ రెసిడెంట్లు, 19 మంది ట్యూటర్లు ఉన్నారని పేర్కొన్నారు. సైకియాట్రీ విభాగంలో డా. పవన్‌కుమార్‌ను ప్రొఫెసర్‌గా నియమించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా డా. రుద్ర విజయ్, డా. వంశీకృష్ణ (ఎఫ్ఎంటీ), డా. బి.లత, డా. వైభవ్‌కృష్ణ, డా. స్వాతి (జనరల్ మెడిసిన్), డా. నిఖిల్ (పీడియాట్రిక్స్), డా. హేమంత్, డా. ఎస్.భరత్‌కుమార్ (ఎమర్జెన్సీ మెడిసిన్), డా. కుమ్ముమేశ్వర్ (ఆర్థోపెడిక్స్), డా. మానిష్ గాంధీ (ఓబీజీవై), డా. భార్గవి (ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్), డా. గోపికాంత్ (యూరాలజీ), డా. శేషాంక్ (ఫార్మకాలజీ), డా. సుమన్య (బయోకెమిస్ట్రీ), డా. సుదీప (ఆప్తాల్మాలజీ), డా. అఖిల్ (కమ్యూనిటీ మెడిసిన్), మరో డా. స్వాతి నియమితులయ్యారు. సీనియర్ రెసిడెంట్లుగా డా. సాయి తరుణ్య, డా. సత్యశ్రీ, డా. జె.పి.మౌనిషా నియమితులయ్యారు. ట్యూటర్లుగా ఎమర్జెన్సీ మెడిసిన్‌లో డా. శివకృష్ణ, డా. సాయినాథ్‌రావు, డా. వినయ్, డా. తస్లీమా, డా. శ్రీలక్ష్మి, డా. జయంత్, సైకియాట్రీలో డా. గాయత్రి, అనాటమీలో డా. నిఖిల్‌రెడ్డి, డా. వర్ష, డా. అఖిల, డా. హుమేరా, బయోకెమిస్ట్రీలో డా. హర్షిణి, డా. రవళి, ఫార్మకాలజీలో డా. సంగీత, మైక్రోబయాలజీలో డా. గాయత్రి, పాథాలజీలో డా. నిఖిల్‌తేజ, ఎఫ్ఎంటీలో డా. వెన్నెల, ఎస్‌పీఎంలో డా. లత, డా. స్వాతి ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు చేపట్టిన ఈ నియామకాలతో ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అందుబాటు పెరిగి, వివిధ విభాగాల్లో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## ఎస్సారార్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 20, (జనం సాక్షి) :** ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్‌లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. ఇంగ్లీష్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, బీకాం ఫైనాన్స్, బీసీఏ, స్టాటిస్టిక్స్, జువాలజీ, పొలిటికల్ సైన్స్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. కమిషనర్ ప్రొసీడింగ్స్ నిబంధనలకు అనుగుణంగా పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాటు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు, బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు వెయిటేజీ ఉంటుందని తెలిపారు.
ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో కూడిన దరఖాస్తులను ఆగస్టు 22న సాయంత్రం 4 గంటల్లోపు ఎస్సారార్ కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు ఆగస్టు 24న ఉదయం 10 గంటలకు ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

## ఇందిరమ్మ ఇంటి మంజూరులో గందరగోళం..
# అప్పులపాలైన మహిళ

- మంజూరైందని చెప్పడంతో నిర్మాణం ప్రారంభించిన వైనం
- రూ.2 లక్షలు అప్పు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మాణం
- ఏడాది తర్వాత మంజూరు కాలేదన్న అధికారుల సమాధానం
- తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే, అధికారులకు వేడుకోలు



**శంకరపట్నం, ఆగస్టు 20 (జనం సాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల పథకం విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాను తీవ్రంగా నష్టపోయానని కేశవపట్నం గ్రామానికి చెందిన బొజ్జ కొమురమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని అధికారులు చెప్పడంతోపాటు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో భూమి పూజ నిర్వహించడంతో నమ్మి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించానని తెలిపారు. భర్త 15 ఏళ్ల క్రితమే మృతి చెందడంతో అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నానని చెప్పారు. తన ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణానికి అధికారులు టెంట్ ఏర్పాటు చేయడంతో పాటు ఎమ్మెల్యేతో భూమిపూజ చేయించడంతో ఎంతో సంతోషించానన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు సుమారు రూ.2 లక్షలు అప్పు చేసి బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేశానని తెలిపారు. అయితే ఏడాది గడిచినా ఇంటి నిర్మాణానికి సంబంధించిన తొలి విడత బిల్లు అందకపోవడంతో అధికారులను సంప్రదించగా, అసలు ఇల్లు తనకు మంజూరు కాలేదని, మరో మహిళ పేరుతో మంజూరైందని చెప్పడంతో షాక్‌కు గురయ్యానని వాపోయారు. అధికారులు ఇచ్చిన హామీ, ఎమ్మెల్యే సమక్షంలో జరిగిన భూమిపూజను నమ్మి అప్పు చేసి నిర్మాణం చేపట్టగా, ఇప్పుడు బిల్లు రాదని చెప్పడంతో తీవ్రంగా నష్టపోయానని కన్నీటి పర్యంతమయ్యారు. అప్పుగా తీసుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నానని, తనకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.
సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు న్యాయం జరగలేదన్నారు. గురువారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామంలో పర్యటిస్తున్నారని తెలుసుకుని గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన సమావేశానికి వెళ్లి తన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అయితే కొందరు అధికారులు, స్థానిక నాయకులు తనను మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాంటి పేద మహిళకు అధికారుల తప్పిదం వల్ల అన్యాయం జరగకుండా చూడాలని కొమురమ్మ కోరారు. తనకు ఇల్లు నిజంగా మంజూరై ఉంటే రికార్డులను పరిశీలించి వెంటనే నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని, లేదంటే తనకు జరిగిన ఆర్థిక నష్టానికి తగిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.




# విద్యార్థులపై దమనకాండకు పాల్పడిన వారే మొసలి కన్నీరు

**రాంచందర్‌రావు, బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించిన కోమటిరెడ్డి**

- గాంధీ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం తగదు
- మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?
- కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 20 (జనంసాక్షి):** స్వాతంత్రోద్యమంతో సంబంధంలేని బీజేపీ పార్టీ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబం పై బురుద జల్లాలని చూస్తుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక మాజీ సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 1950 లో భారత జాతీయ కాంగ్రెస్ వందేమాతరం గీతాన్ని జాతీయ గీతంగా ఆమోదించిందని,1951 లో జనసంఘ్ పార్టీ ఆవిర్భవించిందని 1980 లో జనసంఘ్ భారతీయ జనతా పార్టీ అయ్యిందని బీజేపీకి కాంగ్రెస్ పార్టీని గానీ, కాంగ్రెస్ నాయకులను గానీ విమర్శించే నైతిక హక్కు లేదని నరేందర్ రెడ్డి తెలిపారు. సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గేల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రెండు సార్లు ప్రధాన మంత్రి గా అవకాశం వచ్చిన సున్నితంగా సోనియా గాంధీ తిరస్కరించారని ఓటమెరుగని నిబద్ధతగల ప్రజా నాయకులు మల్లికార్జున ఖర్గే అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రశ్నించిన విద్యార్థుల పై దమనకాండ జరిపిన బీజేపీ పై దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారని, ఫీజురీయింబర్స్ మెంట్ పేరుమీద మొసలి కన్నీరు కారుస్తున్నారని 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీతో అంటకాగి 8 లక్షల కోట్ల అప్పుకు కారణం బీజేపీ కారణమని, అప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ ఒక్క రూపాయి ఇవ్వకున్నా పెదవులు తెరవలేదని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల మోడీ హామీ ఏమైందని, ఎన్ని ఇబ్బందులున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పర్వతం మల్లేశం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, జీడి రమేష్, ముక్క భాస్కర్, లయక్, మూల కృష్ణారెడ్డి, పెద్దిగారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బోయినపల్లి, ఆగస్టు 20 (జనం సాక్షి) :** మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని గురువారం బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా సంఘాలు కేవలం రుణాలు అందించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకే పరిమితం కాదన్నారు. మహిళల గుర్తింపు, సంక్షేమం, సాధికారతతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు.
మహిళల్లో రక్తహీనతతో పాటు పలు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ–ఆరోగ్యం యాప్ ద్వారా పరీక్షల ప్రక్రియను నిర్వహిస్తున్నామని, పరీక్షల ఫలితాలను మొబైల్‌కు మెసేజ్ ద్వారా పంపిస్తామని చెప్పారు. అవసరమైతే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. తొలి దశలో బోయినపల్లి, వేములవాడ, వీర్నపల్లి, కోనరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో మహిళా సంఘాల సభ్యులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బోయినపల్లి మండలంలో 31 విలేజ్ ఆర్గనైజేషన్ల పరిధిలో 819 స్వయం సహాయక సంఘాల్లో 9,424 మంది సభ్యులు ఉన్నారని, వారందరికీ దశలవారీగా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రోజుకు 50 మంది మహిళలకు పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య పరీక్షల సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని, మహిళా సంఘాల సమావేశాల కోసం గ్రామైక్య సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమూహంగా ఏర్పడి వ్యాపారాలు, కొత్త యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న మహిళలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వైద్యారోగ్య శాఖ అధికారిణి ఏంజెలా అల్ఫ్రెడ్, సర్పంచ్ మోహన్, మండల ప్రత్యేక అధికారి శరత్, తహసీల్దార్ షరీఫుద్దీన్, వైద్యులు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరాదరణకు గురైన వృద్ధ దంపతులపై విచారణ

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 20, (జనం సాక్షి) :** నిరాదరణకు గురైన వృద్ధ దంపతులు గన్నులక్ష్మి–మోహన్ వ్యవహారంపై జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి విచారణ చేపట్టారు. కిసాన్‌నగర్‌కు చెందిన ఈ వృద్ధ దంపతులను కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వెలిచాల గ్రామంలోని స్పందన వృద్ధాశ్రమంలో చేర్పించారు. గతంలో కుమార్తె వద్ద ఉన్న వారు అనారోగ్యానికి గురికావడంతో మంథనిలోని చిన్న కుమారుడి వద్దకు వెళ్లి చికిత్స పొందినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వారిని ఆటోలో కరీంనగర్‌కు పంపగా, జీజీహెచ్ వద్ద వదిలివేయడంతో వర్షంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం ప్రకారం పూర్తి స్థాయిలో విచారణ జరిపి, వృద్ధ దంపతులకు న్యాయం జరిగేలా తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు బీఎస్పీ మద్దతు

- ఐదో రోజుకు చేరిన జర్నలిస్టుల నిరసన దీక్ష
- నల్ల బెలూన్లతో వినూత్నంగా నిరసన
- ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన: పల్లె ప్రశాంత్ గౌడ్
- జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి



**హుజూరాబాద్, ఆగస్టు 20 (జనం సాక్షి):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం హుజూరాబాద్‌లో కొనసాగుతున్న న్యాయపోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన శాంతియుత నిరసన దీక్షలు గురువారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్, పార్టీ నాయకులు, ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య సందర్శించి జర్నలిస్టులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గమని అన్నారు. జర్నలిస్టులంతా ఏకతాటిపై నిలిచి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవలో నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టులకు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, అవి ఏ ఒక్క రాజకీయ పార్టీ ఇచ్చినవి కావని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే ఎన్నికల సమయంలో ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలే తప్ప.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కి దీక్ష చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు. జర్నలిస్టుల సమస్యపై స్పందించని నాయకులు, రాజకీయ పార్టీల వార్తలను బహిష్కరించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్ ఈ సమస్యను ముఖ్యమంత్రి, మంత్రులు, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. గ్రామాల ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. ఐదో రోజు నిరసనలో భాగంగా జర్నలిస్టులు నల్ల బెలూన్లను ఆకాశంలోకి ఎగురవేసి తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు. డప్పు చప్పుళ్లతో నినాదాలు చేస్తూ జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలపై దాఖలైన కోర్టు కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 'మా స్థలాలు మాకు ఇవ్వాలి.. మా హక్కులు కాపాడాలి' అంటూ నినదించారు. సాంస్కృతిక కళాకారుల ఆటపాటలు, గేయాలు నిరసన శిబిరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు, బీఎస్పీ నాయకులు గిన్నారపు మహేందర్, వేల్పుల మల్లేష్, అంబాల ప్రభాకర్, ఇల్లందుల రమేష్, మంద సమ్మయ్య, దొడ్డ సమ్మయ్య, జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, చందుపట్ల జనార్ధన్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పాపం పండింది..

**ఏసీబీ వలలో రాజంపేట ఎస్సై**
**స్టేషన్ బెయిల్ కోసం రూ.30 వేల లంచం డిమాండ్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** రాజంపేట పోలీస్ స్టేషన్‌లో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. స్టేషన్ బెయిల్ మంజూరు చేయడానికి రూ.30 వేల లంచం డిమాండ్ చేసిన రాజంపేట ఎస్సై ఆంజనేయులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో చిక్కారు. సమాచారం ప్రకారం, ఒక సిమెంట్ షాపుకు సంబంధించిన విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ కేసులో ఒక వర్గానికి స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు ఎస్సై ఆంజనేయులు రూ.30 వేల లంచం ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఉచ్చు పన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో ఎస్సైను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత కలిగిన పోలీసు అధికారి లంచం కోసం చేతులు చాచడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. ఈ ఘటనతో రాజంపేట పోలీస్ స్టేషన్‌లో అవినీతి వ్యవహారాలపై మరింత లోతైన విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సమన్వయం, డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

- కొత్త నేర చట్టాల అమలుకు సమన్వయమే కీలకం: సీజే జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్
- సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయం అవసరం: జస్టిస్ మౌషుమి భట్టాచార్య
- శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలతో పౌరులకు సత్వర న్యాయం : డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించాలి: డీజీపీ సీవీ ఆనంద్





హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) : కొత్త నేర చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమం (బీఎస్ఏ) అమలులో డిజిటల్ వేదికల వినియోగం, వివిధ విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయవ్యవస్థ, పోలీస్, జైళ్లు, ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్, వైద్య విభాగాలతో పాటు ఎన్ఐసీ, ఎన్సీఆర్బీ వంటి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, తెలంగాణ పోలీస్ శాఖ సంయుక్తంగా ఈ వినూత్న సదస్సును నిర్వహించాయి. దేశంలోనే తొలిసారిగా కొత్త నేర చట్టాల డిజిటల్ అమలుకు సంబంధించిన అన్ని భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా ఇది నిలిచింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200 మంది న్యాయాధికారులు, పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్లు, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు.

### సమన్వయంతోనే న్యాయవ్యవస్థ బలోపేతం : హై కోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

సదస్సును ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హై కోర్టు చీఫ్ జస్టిస్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. "న్యాయం అనేది వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాధ్యమయ్యే సామూహిక ఫలితం" అని పేర్కొన్నారు. నేరం నమోదైనప్పటి నుంచి దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశ కీలకమన్నారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విభాగం తన బాధ్యతతో పాటు ఇతర విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ఒక్కసారితో ముగిసిపోకుండా నిరంతర సమన్వయానికి నాంది కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే న్యాయాన్ని అందించడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.

### సాంకేతిక పరిజ్ఞానం పెంచాలి : జస్టిస్ మౌషుమి భట్టాచార్య

తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య మాట్లాడుతూ కొత్త నేర చట్టాల సమర్థ అమలుకు భాగస్వామ్య సంస్థల మధ్య మెరుగైన సమన్వయం అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పనిభారాన్ని పెంచకుండా ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఒకే సమాచారాన్ని పదేపదే నమోదు చేయడం, అసంపూర్తి వివరాలు ఇవ్వడం వల్ల కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులు తప్పులు, తప్పుడు కోడింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రాసిక్యూషన్ పరిశీలన ఆలస్యమవుతోందన్నారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగంగా జరగాలని తెలిపారు. కొంతమంది సిబ్బందికి డిజిటల్ వేదికలపై పూర్తి అవగాహన లేకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోందని పేర్కొంటూ, సామర్థ్య పెంపు, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని సూచించారు.

### శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలతో పౌరులకు సత్వర న్యాయం : డీజీపీ సీవీ ఆనంద్

డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రిత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు. దర్యాప్తుపై సమర్థవంతమైన పర్యవేక్షణ, డిజిటల్ సమాచారాన్ని పూర్తి, కచ్చితంగా నమోదు చేయడం, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న అన్ని డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించడం అవసరమన్నారు. సదస్సులో మూడు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు తమ అనుభవాలు, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.

ఐసీజేఎస్, ఈ-సాక్ష్య, ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల వినియోగం, ఈ-సమన్లు, దర్యాప్తు కాలపరిమితులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యాల నమోదు, న్యాయ సంహిత కాలపరిమితులు, న్యాయ శ్రుతి మాడ్యూల్, ఫోరెన్సిక్, వైద్య విభాగాల అనుసంధానం, జైళ్ల నిర్వహణ, దర్యాప్తు-ప్రాసిక్యూషన్ సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు.


### నెలనెలా సమీక్షకు ప్రతిపాదన

కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెల అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డీజీపీ కోరారు. ఈ కార్యక్రమం మరింత సమగ్ర, సాంకేతిక ఆధారిత, పౌర కేంద్రిత న్యాయవ్యవస్థ నిర్మాణానికి తొలి అడుగుగా నిలిచింది. సదస్సుకు చొరవ చూపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మౌషుమి భట్టాచార్య, డీజీపీ సీవీ ఆనంద్, ఎన్సీఆర్బీ ప్రతినిధి ప్రవన్ గుప్తా, టీజీఎస్ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ ప్రిన్సిపల్ శ్రీదేవి, సీటీటీజి డైరెక్టర్ సల్మాన్ తాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, డీజీలు, ఐజీలు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న జయంతి, వర్ధంతుల నిర్వహణకు

# అధికారిక ఉత్తర్వులు

- మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో అధికారిక ప్రకటన



హైదరాబాద్, ఆగస్టు 20 (జనంసాక్షి) : తెలంగాణ రాబిన్‌వుడ్‌గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి, డిసెంబర్ 10న వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలన్న ముదిరాజ్ సమాజం చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ అంశంపై ముదిరాజ్ సంఘాల ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని అంశాలను కూలంకషంగా పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆగస్టు 14న లేఖ నంబర్ 464 ద్వారా జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేయగా, ఆగస్టు 18న సంబంధిత నోట్ జారీ చేసి, కేవలం ఆరు రోజుల్లోనే ప్రభుత్వం జీవో విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఇంత వేగంగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముదిరాజ్ సమాజం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధికారిక ఉత్తర్వుల ప్రక్రియకు సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కూడా వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే అక్టోబర్ 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పండుగ సాయన్న జయంతి అధికారిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# విద్యార్థి పీక పట్టిన సీఐ సస్పెన్షన్

- ఘటనపై డీఎస్పీ స్థాయి విచారణకు ఆదేశం
- ఎస్పీ కీలక చర్య..



మహబూబాబాద్, (జనం సాక్షి) : పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన సందర్భంగా విద్యార్థి పట్ల దురుసుగా వ్యవహరించిన ట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్న మహబూబాబాద్ సీఐ రఘుపతి రెడ్డిపై పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. సీఐను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు డీఎస్పీ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. జీఓ నంబర్ 97 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులు మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించిన సమయం లో విద్యార్థులు, పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో సీఐ ఒక విద్యార్థి పీక పట్టుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి సీఐపై వేటు వేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో విచారణకు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల ఆందోళనలను నియంత్రించే క్రమంలో పోలీసులు చట్టపరమైన పరిమితులు, మానవ హక్కులు, ప్రజాస్వామ్య నిరసన హక్కులను పాటించాల్సిన అవసరం ఉందన్న చర్చ నేపథ్యంలో ఈ చర్యకు ప్రాధాన్యత ఏర్పడింది.

# ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరందిస్తాం

- కృష్ణా జలాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా
- మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ పనులను పరిశీలించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి



చింతలపాలెం (జనంసాక్షి) : సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం,పాత వెల్లటూరు వద్ద 1648 కోట్ల రూపాయలతో 53000 ఎకరాల కు నీరు అందించే మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను గురువారం రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించి పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు.తదుపరి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ కృష్ణానది వద్ద నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు 1,648 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ 16 మెగా వాట్ల 4 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయడం ద్వారా మట్టంపల్లి మండలంలో 9 గ్రామాలలో 20,466 ఎకరాలకు, మేళ్లచెరువు మండలంలో 5 గ్రామాలలో 15,829 ఎకరాలకు, చింతలపాలెం మండలంలో 9 గ్రామాలలో 16705 ఎకరాలకు మొత్తం 53000 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని దీని ద్వారా 5,080 ఎస్సీ,3540 ఎస్టీ, 8470 బీసీ,2205 ఓసీ కుటుంబాలు మొత్తంగా 19,295 కుటుంబాలు లబ్ది పొందుతాయని దీని కొరకు 191 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా 60 కోట్లు చెల్లించడం జరిగినదని నాగార్జునసాగర్ లో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో పులిచింతల ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌ను వినియోగించుకుని ఈ ప్రాంతంలోని గ్రామాలను సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు.డిసెంబర్ నాటికీ ప్రాజెక్టు రూఫ్ టాప్ లెవల్,పంప్ హౌస్ పనులు పూర్తి అవుతాయని వీలైనంత తొందరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని మంత్రి గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నర సింహా, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, ఆర్డీవో శ్రీనివాసులు ,హుజూర్నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,సీనియర్ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# యూరియా యాప్ నిషేధించాలి

- ఎడపల్లిలో రైతుల రాస్తారోకో

నిజామాబాద్, ఆగస్టు20 (జనంసాక్షి) : యూరియా యాప్ రద్దు చేయాలని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని షాటాపూర్ గేటు వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై మండల బీఆర్ఎస్ శ్రేణులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ యూరియా యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక ఎకరానికి రెండు యూరియా బస్తాలు సరిపోవని, కనీసం నాలుగు బస్తాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు అందించడంతో పాటు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ప్రధాన రహదారిపై అరగంట పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో రైతులు నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్ నాయకులు ఉండి నాగేందర్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370